

ఆంధ్రజ్యోతి

www.andhrajyothy.com
సోమవారం | 15-1-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 271 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: పంచమి రా. 2.18 తదుపరి షష్ఠి; నక్షత్రం: శతభిషం ఉ. 8.08, పూర్వాభాద్ర తె. 6.10 వరకు; వర్జ్యం: మ.2.00-3.29, దుర్ముహూర్తం: మ.12.47-1.31, మ.3.00-3.44; అమృతఘడియలు: రా.10.50-12.18; రాహుకాలం: ఉ.7.30-9.00, సూర్యోదయం: 6.53, సూర్యాస్తమయం: 5.57 | హైదరాబాద్ సిటీ*
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





సంక్రాంతికి పల్లెటూరు

పండుగ వేళ.. ఊరెళ్లిన పట్నంవాసులు

తెలుగు రాష్ట్రాల్లో పెద్ద పండుగ సందడి

కుటుంబమంతా కలిసి సంబురాలు

గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లలోనూ ఉమ్మడిగా వేడుకలు జరుపుకొంటున్న వైనం

ఫాంహౌస్‌ల్లో సెలబ్రిటీల ప్రత్యేక వేడుకలు

హైదరాబాద్‌లో బోసిపోయిన రోడ్లు

రాష్ట్రం నలుమూలల నుంచి 6,261 ప్రత్యేక బస్సులు.. కొన్ని ఆంధ్రప్రదేశ్‌కు


ఆదివారం నిర్మానుష్యంగా మారిన హైదరాబాద్‌లోని సైబర్ టవర్స్ కూడలి

హైదరాబాద్ సిటీ, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): తెలుగువారి పెద్ద పండుగ.. సంక్రాంతి సంబరాలు జోరందుకున్నాయి. ఎంతసేపూ ఇల్లు.. ఆఫీసు.. అంటూ నాలుగు గోడల మధ్య బందీలైపోయి నగరజీవితానికి అలవాటుపడిపోయిన పట్నంవాసుల్లో చాలామంది.. అన్నదమ్ములు, బంధువులతో కలిసి పండుగ జరుపుకోవడానికి పల్లె బాట పట్టారు. నగరంలోనే ఉండిపోయిన గేటెడ్ కమ్యూనిటీ, అపార్ట్‌మెంట్‌వాసులూ ఈసారి ఉమ్మడిగా వేడుకలు జరుపుకోవడం ద్వారా పండుగ స్ఫూర్తిని చాటుతుండడం విశేషం. ముఖ్యంగా.. రాజధాని హైదరాబాద్‌లో ఆదివారం తెల్లవారుజామునుంచే వీధివీధినా.. ఇళ్లు, అపార్ట్‌మెంట్ల

మిగతా 13వ పేజీలో...

పందెం నీదా నాదా?

కోస్తాంధ్ర జిల్లాల్లో కోడి పందేలు, గుండాటల జోరు

ఒక్క పశ్చిమలోనే 200 బరులు.. కోట్లలో పందేలు

పలు బరుల్లో రూ.25లక్షలుంటేనే లోపలికి

అక్కడే పేకాటలు.. ఏరులై పారిన మద్యం

నిర్వాహకుల నుంచి భారీ మొత్తంలో నేతల వసూళ్లు

గోదావరి, కృష్ణా జిల్లాల్లో తొలిరోజే వందల కోట్లు

తెలంగాణ నుంచి భారీగా తరలివచ్చిన ఔత్సాహికులు

13

చైనా మాంజా.. గొంతు తెగ్గోసింది

లంగర్‌హౌస్‌లో ఆర్మీ జవాను దుర్మరణం

ఫ్లైఓవర్ మీద బైక్‌పై వెళ్తుండగా మెడకు మాంజా

పతంగులు ఎగురవేసే ఉత్సాహంలో ఆగని విషాదాలు

భవనం పై నుంచి పడి నాగోలులో 13 ఏళ్ల బాలిక..

పేట్‌బషీరాబాద్‌లో 20 ఏళ్ల యువకుడి మృతి

పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు 'ఆంధ్రజ్యోతి' సంక్రాంతి శుభాకాంక్షలు.

సెలవు

సంక్రాంతి సందర్భంగా మా కార్యాలయాలకు సోమవారం సెలవు. కావున 'ఆంధ్రజ్యోతి' మంగళవారం (16-1-2024) సంచిక వెలువడదు. పునర్దర్శనం బుధవారం.

- మేనేజింగ్ డైరెక్టర్



కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా..

అద్దంకి, మహేశ్?




మహేశ్‌కుమార్‌గౌడ్

ఎమ్మెల్యేల కోటాలో దక్కనున్న అవకాశం

పరిశీలనలో చిన్నారెడ్డి, హర్కార వేణుగోపాల్, బలరాం నాయక్, పటేల్ రమేశ్‌రెడ్డి పేర్లు కూడా

గవర్నర్ కోటాలో కోదండరాం, ఆమెర్ అలీఖాన్!

నేడు ప్రకటించనున్న కాంగ్రెస్ అధిష్ఠానం

హైదరాబాద్, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నికలు జరగనున్న రెండు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ సీట్లకు అభ్యర్థులను కాంగ్రెస్ అధిష్ఠానం సోమవారం ప్రకటించే అవకాశం ఉంది. ఈ స్థానాలకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్‌లను అభ్యర్థులుగా ప్రకటించే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. శనివారం టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తోపాటు ఇతర అధిష్ఠానం పెద్దలతో ఎమ్మెల్యేల కోటాతోపాటు గవర్నర్ కోటా ఎమ్మెల్సీల అంశంపై చర్చలు జరిపారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ సీట్లకు మహేశ్‌కుమార్‌గౌడ్, అద్దంకి దయాకర్‌తోపాటు టీపీసీసీ ఉపాధ్యక్షుడు హర్కార వేణుగోపాల్, ఏఐసీసీ కార్యదర్శి జి.చిన్నారెడ్డి, పటేల్ రమేశ్‌రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్‌ల పేర్లను అధిష్ఠానం ప్రధానంగా పరిశీలనలోకి తీసుకున్నట్లు సమాచారం. అయితే మహేశ్‌కుమార్ గౌడ్, అద్దంకి దయాకర్‌ల పేర్లనే ఖరారు చేస్తే.. చిన్నారెడ్డి, హర్కార వేణుగోపాల్‌లను ప్రభుత్వ పదవుల్లోకి తీసుకునే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ రేసులో చిన్నారెడ్డిని దింపేందుకూ ఆస్కారం ఉందంటున్నారు. ఇక పటేల్ రమేశ్‌రెడ్డి, బలరాం నాయక్ ఎలాగూ లోక్‌సభ ఎన్నికల అభ్యర్థుల రేసులో ఉన్నారు. గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న ఎమ్మెల్సీ సీట్లకు టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం, సియాసత్ న్యూస్ ఎడిటర్ ఆమెర్ అలీ ఖాన్‌ల పేర్లను అధిష్ఠానం ప్రధానంగా పరిశీలనలోకి తీసుకున్నట్లు సమాచారం. వాస్తవానికి కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో ముస్లిం మైనారిటీ వర్గం వారు ఒక్కరు కూడా లేకపోవడంతో.. నాలుగు ఎమ్మెల్సీల్లో ఒకటి కచ్చితంగా ఆ వర్గానికి కేటాయించాలని అధిష్ఠానం నిర్ణయించింది. ఇందుకోసం మాజీ మంత్రి షబ్బీర్ అలీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అజారుద్దీన్‌ల పేర్లు ప్రముఖంగా వినిపించాయి. అయితే ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిపాలైన వారికి ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వకూడదని పార్టీపరంగా నియమం ఉండడంతో రేసులో వారిద్దరు వెనుకపడ్డారు. ఒకవేళ ముస్లిం మైనారిటీని ఎమ్మెల్సీగా తీసుకుని మంత్రివర్గంలోనూ చోటు కల్పించాలని అధిష్ఠానం భావిస్తే మాత్రం.. షబ్బీర్ అలీకి ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం దక్కవచ్చన్న ప్రచారం పార్టీ వర్గాల్లో జరుగుతోంది.

పైన రామ జపం.. లోన కత్తులు

మతాన్ని రాజకీయాలతో కలిపి ప్రజల్ని రెచ్చగొట్టడమే బీజేపీ విధానం

మోదీకి సముద్ర షికారుకు టైమ్ ఉంటుంది

మణిపూర్ ప్రజల కన్నీళ్లు తుడవడానికి మాత్రం ఆయనకు సమయం దొరకదు

ఫాసిస్టులపై పోరు కోసమే రాహుల్ యాత్ర

దేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడడమే లక్ష్యం: ఖర్గే

మణిపూర్‌లో మళ్లీ శాంతి నెలకొల్పుతాం: రాహుల్

'భారత్ జోడో న్యాయ్ యాత్ర' ప్రారంభం

పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్, భట్టి, షర్మిల

2



తెలంగాణ బలాన్ని చాటుతాం



భారీ పెట్టుబడులే లక్ష్యంగా దావోస్‌లో సీఎం రేవంత్ పర్యటన

3

అనేకమంది పారిశ్రామికవేత్తలతో ఆయన సమావేశం

కీలక రంగాల పెట్టుబడులపై సంతకాలు చేసే అవకాశం

వ్యవసాయ ఎకానమీపై వాతావరణ మార్పుల ప్రభావం, రైతుల జీవనోపాధిపై ప్రసంగించనున్న ముఖ్యమంత్రి

పర్యటన వివరాలను వెల్లడించిన ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు





అయోధ్య సీతమ్మకు ధర్మవరం పట్టుచీర

ధర్మవరం, జనవరి 14: అయోధ్య సీతమ్మకు ప్రత్యేకంగా సిద్ధం చేసిన ధర్మవరం పట్టు చీర ఇది. 180 అడుగుల పొడవు, 40 అంగుళాల వెడల్పుతో ఉన్న ఈ చీరపై 13 భాషల్లో జై శ్రీరామ్ నినాదం... చీర అంచుల్లో రామాయణంలోని 400 ఘట్టాల చిత్రీకరణ వంటి ఎన్నో ప్రత్యేకతలున్న ఈ పట్టు చీరను శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన చేనేత కార్మికుడు నాగరాజు రూపొందించారు. చీర తయారీకి మల్బరీ దారంతోపాటు కాటన్, లెనిన్, గద్వాల్, సిలికాన్, కొర్నియా తదితర రకాల పట్టు పోగులను విని యోగించారు. రూ.5 లక్షల ఖర్చుతో ఈ పట్టు చీర నేసేందుకు 4 నెలలు పట్టింది. ఈనెల 22న అయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా అమ్మవారికి కానుకగా అందజేయాలనుకున్నానని నాగరాజు తెలిపారు. అయోధ్య రామ జన్మభూమి కమిటీ పెద్దల సూచన మేరకు చీరను రూపొందించానన్నారు.

అయోధ్యకు వెళ్లనున్న ఇద్దరు శంకరాచార్యులు

- విశ్వహిందూ పరిషత్ ప్రకటన

న్యూఢిల్లీ, జనవరి 14: అయోధ్య రామమందిర ప్రాణ ప్రతిష్ఠకు దేశంలోని నలుగురు జగద్గురు శంకరాచార్యులు హాజరు కావడం లేదంటూ వార్తలు వచ్చిన నేపథ్యంలో విశ్వ హిందూ పరిషత్ కీలక ప్రకటన చేసింది. కర్ణాటకలోని శృంగేరీ శారదా పీఠం శంకరాచార్య ఈ నెల 22న జరిగే కార్యక్రమానికి వెళ్లనున్నారని తెలిపింది. గుజరాత్‌లోని ద్వారకా శారదా పీఠం శంకరాచార్య కూడా వెళ్లనున్నారని పేర్కొంది. ఈ సందర్భంగా ద్వారకా పీఠం ఓ ప్రకటన విడుదల చేసింది. ఆలయ పనులు పూర్తి కాకుండానే ప్రాణ ప్రతిష్ఠ చేయడం తగదని, అందువల్ల ఆ కార్యక్రమానికి హాజరు కావడం లేదని అంతకుముందు పూరీ శంకరాచార్య ప్రకటించడం గమనార్హం.

రామాలయ ప్రాణప్రతిష్ఠకు స్టాలిన్ సతీమణికి ఆహ్వానం

చెన్నై, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): అయోధ్య శ్రీరామాలయానికి ఈ నెల 22న నిర్వహించనున్న ప్రాణప్రతిష్ఠ, మహాకుంభాభిషేక కార్యక్రమంలో పాల్గొనాలంటూ విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) నిర్వాహకులు తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ సతీమణి దుర్గా స్టాలిన్‌ను సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి నివాసానికి వీహెచ్‌పీ జాతీయ సంయుక్త కార్యదర్శి పీఎం నాగరాజన్ బృందం ఆదివారం వెళ్లి దుర్గా స్టాలిన్‌కు రామాలయ ప్రాణప్రతిష్ఠ ఆహ్వాన పత్రిక అందజేశారు.

పేరులో రాముడు.. తీరులో రాక్షసుడు

- కర్ణాటక సీఎంపై 'అయోధ్య' ఆలయ పూజారి వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, జనవరి 14: కర్ణాటక సీఎం సిద్ధరామయ్య అయోధ్య ఆలయ ప్రారంభోత్సవానికి హాజరుకానంటూ ప్రకటించడంపై బీజేపీ, హిందూ సంస్థల నుంచి ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. 'రాముడితో అనుబంధమైన సిద్ధరామయ్య పేరు చాలా మంచిది. కాని ఆయన(కర్ణాటక సీఎం) చర్యలే రాక్షసుడిని తలపిస్తున్నాయి. వాళ్ల బాధ అంతా బాబర్ గురించే. ఈ విషయంలో బీజేపీ నేత సీటీ రవి చేసిన వ్యాఖ్యలు తప్పేమీ కాదు' అని ఉత్తరప్రదేశ్‌లోని హనుమాన్‌గఢీ ఆలయ పూజారి మహంతరాజు దాస్ అన్నారు. కాంగ్రెస్ నేతలు బాబర్‌ను వదలుకోలేక పోతున్నారని అందుకే రామాలయ ప్రారంభోత్సవానికి హాజరు కావడం లేదంటూ సీటీ రవి శనివారం ధ్వజమెత్తిన సంగతి తెలిసిందే.

భారత సైన్యాన్ని ఉపసంహరించుకోండి

- మార్చి 15 వరకు గడువు: మాల్దీవ్స్ సర్కారు

న్యూఢిల్లీ, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): తమ దేశం నుంచి భారత సైన్యాన్ని పూర్తిగా ఉపసంహరించుకోవాలని మాల్దీవ్స్ సర్కారు స్పష్టం చేసింది. ప్రస్తుతం తమ దేశంలో 88 బెటాలియన్ల భారత సైనికులున్నారని, వారిని మార్చి 15లోపు వెనక్కి రప్పించుకోవాలని భారత్‌ను దేశాధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు కోరినట్లు అధ్యక్ష కార్యాలయ పౌర విధాన కార్యదర్శి అబ్దుల్లా నజీమ్ ఇబ్రహీం విలేకరులకు తెలిపారు. ఈ మేరకు అధ్యక్ష కార్యాలయంలో ఆదివారం ఉదయం ఉన్నతస్థాయి సమావేశం జరిగిందని, భారత హైకమిషనర్ మనూ మహావర్ కూడా హాజరయ్యారని వివరించారు. భారత ప్రధాని నరేంద్రమోదీపై ముగ్గురు మాల్దీవ్స్ మంత్రులు నోరుపారేసుకోవడంతో ఇరుదేశాల మధ్య దౌత్యపరమైన సంక్షోభం నెలకొంటున్న తరుణంలో చైనా అనుకూలుడిగా పేరున్న ముయిజ్జు భారత సైన్యాన్ని వెనక్కి పంపాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. కాగా మాలె మేయర్ ఎన్నికల్లో ముయిజ్జు పార్టీ-పీపుల్స్ నేషనల్ కాంగ్రెస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. శనివారం ప్రకటించిన ఫలితాల్లో భారత అనుకూల పార్టీ మాల్దీవియన్ డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి ఆదమ్ అజీమ్ ఘనవిజయం సాధించారు.

పేరుకే రామ జపం.. లోపల కత్తులు

ఫాసిస్టులపై పోరు కోసమే రాహుల్ యాత్ర.. దేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడటమే లక్ష్యం: ఖర్గే

- మణిపూర్ లో మళ్లీ శాంతిని నెలకొల్పుతాం: రాహుల్
- 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' ప్రారంభం



థౌబాల్, జనవరి 14: బీజేపీది పేరుకే రామ జపం అని లోపల మాత్రం ఆ పార్టీ నేతలు కత్తులు పెట్టుకుంటారని కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. మతాన్ని రాజకీయంతో కలిపి ప్రజలను రెచ్చగొట్టటమే బీజేపీ విధానమన్నారు. మణిపూర్‌లోని థౌబాల్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' ఆదివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏర్పాటైన బహిరంగసభను ఉద్దేశించి ఖర్గే ప్రసంగించారు. 'మోదీకి సముద్రంపై షికారుకెళ్లే సమయం ఉంటుంది. రామ్ రామ్ అంటూ జపం చేయటానికి సమయం ఉంటుంది. కానీ, హింసాకాండతో అట్టుడికిన మణిపూర్‌కు వచ్చి బాధితుల కన్నీళ్లు తుడిచే సమయం మాత్రం ఉండదు' అని దుయ్యబట్టారు. అందరిలోనూ దైవభక్తి ఉంటుందని, కానీ, బీజేపీ మాత్రమే ఓట్ల కోసం దైవభక్తిని ప్రదర్శిస్తుందని విమర్శించారు. సామాజిక న్యాయం, లౌకికవాదం, సమానత్వం అనే సిద్ధాంతాలకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని చెప్పారు. ఫాసిస్టు శక్తులతో పోరాడి దేశంలో రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి రాహుల్‌గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్రను చేపట్టారని తెలిపారు. నిరుద్యోగులు, రైతుల హక్కుల కోసం, అధిక ధరలకు వ్యతిరేకంగా ప్రజల్ని చైతన్యపరుస్తూ ఈ యాత్ర సాగుతుందన్నారు. శాంతి సందేశాన్ని ఇంటింటికీ వ్యాపింపజేసే పార్టీకి నాయకుడినైనందుకు గర్విస్తున్నానని ఖర్గే తెలిపారు. రాహుల్‌గాంధీ మాట్లాడుతూ.. మణిపూర్ వాసుల బాధలు తనకు తెలుసని, రాష్ట్రంలో శాంతియుత పరిస్థితులను తిరిగి నెలకొల్పుతామని, అందుకే యాత్రను ఇక్కడి నుంచి ప్రారంభిస్తున్నామన్నారు. 'హింసాకాండలో కొన్ని లక్షల మంది నష్టపోయారు. కానీ, మిమ్మల్ని ఓదార్చటానికి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఇక్కడికి రాలేదు. బహుశా మోదీకి, బీజేపీకి, ఆర్ఎస్ఎస్‌కు మణిపూర్ భారత్‌లో అంతర్భాగం కాదేమో. అందుకే మీ దుఃఖం వారికి దుఃఖం కలిగించలేదు. కానీ, మేం మణిపూర్ ప్రజలు ఎంతటి బాధలను, ఆవేదనను, విషాదాన్ని అనుభవించారో అర్థం చేసుకోగలం. మణిపూర్ అంటేనే శాంతి, సౌభ్రాతృత్వం, ఆప్యాయత.. వాటిని తిరిగి ఈ రాష్ట్రంలో నెలకొల్పుతాం' అని హామీ ఇచ్చారు. గత ఏడాది జరిపిన భారత్ జోడో యాత్ర లాగే ప్రస్తుత న్యాయ్‌యాత్రను కూడా నడక ద్వారా కొనసాగించాలని తాను భావించినప్పటికీ, లోక్‌సభఎన్నికల దృష్ట్యా.. నడకతో చాలా సమయం పడుతుంది కాబట్టి బస్సు, నడక.. రెండు విధాలా జరపాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించిందని రాహుల్ చెప్పారు. భారత్ జోడో న్యాయ్ యాత్ర 67 రోజులపాటు కొనసాగనుంది. 15 రాష్ట్రాలకు చెందిన 110 జిల్లాల్లో 6,713 కి.మీ.ల మేర ఈ యాత్ర సాగుతుంది. మార్చి 20న ముంబైకి చేరటంతో యాత్ర ముగుస్తుంది.

పలు ఆంక్షలతో అనుమతి

న్యాయ్‌యాత్రను వాస్తవానికి ఇంఫాల్‌లోని హప్తా కాంగ్జీబంగ్ మైదానం నుంచి ప్రారంభించాలని రాష్ట్ర కాంగ్రెస్ భావించింది. అనుమతి కోసం దరఖాస్తు చేసుకోగా, రాష్ట్ర ప్రభుత్వం పలు ఆంక్షలు విధించింది. కేవలం వెయ్యి మందితోనే సభ జరపాలని చెప్పింది. దీంతో కాంగ్రెస్ నేతలు వేదికను ఇంఫాల్‌కు 34 కి.మీ.ల దూరంలో ఉన్న థౌబాల్‌లోని ఓ ప్రైవేటు స్థలానికి మార్చుకున్నారు. అక్కడ కూడా అనుమతి వెంటనే లభించలేదు. కేవలం గంటలోనే కార్యక్రమాన్ని ముగించాలని, 3 వేల మందికి మించి హాజరు కారాదనే షరతులతో గురువారం రాత్రికిగానీ జిల్లా కలెక్టర్ అనుమతి ఇవ్వలేదని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు కీషమ్ మేఘచంద్ర వెల్లడించారు.

యుద్ధ స్మారకానికి రాహుల్ నివాళి

ఆదివారం మధ్యాహ్నం రాహుల్ విమానంలో రాష్ట్ర రాజధాని ఇంఫాల్‌కు చేరుకోగానే కాంగ్రెస్ మద్దతుదార్లు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి రాహుల్ థౌబాల్ జిల్లాలోని ఖాంగ్జామ్ యుద్ధ స్మారకం వద్దకు వెళ్లి, 1891 నాటి ఆంగ్లో-మణిపూర్ యుద్ధ అమరులకు నివాళి అర్పించారు. బ్రిటిష్ సేనల్ని ఎదిరించి ప్రాణాలు విడిచిన ఒకప్పటి మణిపూర్ రాజ్య సైనికులకు నివాళిగా ఈ స్మారకాన్ని నిర్మించారు.

ఈ వారమే షర్మిలకు పీసీసీ పగ్గాలు!



- మణిపూర్‌లో అధిష్ఠానం సూచన
- అసెంబ్లీ ఎన్నికల్లో 15-20 సీట్లు గెలవాలి
- ఏపీ రాష్ట్ర నేతలకు దిశానిర్దేశం
- రాహుల్ యాత్రలో సీఎం రేవంత్, భట్టితోపాటు పాల్గొన్న షర్మిల, ఏపీ నేతలు

న్యూఢిల్లీ, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి తర్వాత ఏ రోజైనా షర్మిలకు ఆంధ్రప్రదేశ్ పీసీసీ బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఉన్నాయి. మణిపూర్‌లో ఆమెకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈ మేరకు సూచించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ నెల 17న పార్టీ నేత మధుసూదన్ మిస్త్రీ ఆధ్వర్యంలో అమరావతిలో లోక్‌సభ, అసెంబ్లీ అభ్యర్థుల స్క్రీనింగ్ కమిటీ సమావేశం జరుగుతున్నందువల్ల ఈ లోపే షర్మిలకు పీసీసీ పగ్గాల అప్పగింతపై పార్టీ నిర్ణయం ప్రకటించనుందని ఈ వర్గాలు తెలిపాయి. అసెంబ్లీలో కనీసం 15 నుంచి 20 సీట్లు గెలవడం లక్ష్యంగా పెట్టుకోవాలని, కాంగ్రెస్ అధికారంలోకి రాలేకపోయినా కింగ్‌మేకర్ పాత్ర పోషించేలా పనిచేయాలని పార్టీ రాష్ట్ర నేతలకు ఢిల్లీ పెద్దలు దిశానిర్దేశం చేశారు. రాహుల్ భారత్ జోడో న్యాయ్ యాత్ర ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఏపీ నేతలు కొప్పుల రాజు, రఘువీరారెడ్డి, జేడీ శీలం, షర్మిల తదితరులు మణిపూర్‌కు వెళ్లారు. ఇతర కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, సీఎల్పీ నేతలు, పీసీసీ అధ్యక్షులు, ఏఐసీసీ ఆఫీసు బేరర్లు కూడా మణిపూర్ సభలో పాల్గొన్నారు. సభ పూర్తి కాగానే రాహుల్ బస్సులో జోడో యాత్రను ప్రారంభించారు. థౌబాల్ ప్రాంతంలో స్థానికులతో టీ తాగుతూ ముచ్చటించారు. బీఎస్పీ నుంచి సస్పెండైన డానిష్ అలీ కూడా యాత్రలో పాల్గొనడం విశేషం.

లోకం తీరు



కాంగ్రెస్‌కు మిలింద్ దేవ్‌రా గుడ్‌బై

షిండే నేతృత్వంలోని శివసేనలో చేరిక

అభివృద్ధి పథంలో నడిచేందుకేనని వెల్లడి



ముంబై, జనవరి 14: సార్వత్రిక ఎన్నికలకు ముందు మహారాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో కీలక నేతగా ఉన్న కేంద్ర మాజీ మంత్రి మిలింద్ దేవ్‌రా(47) ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఆదివారం ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో చేరిపోయారు. అభివృద్ధి పథంలో నడించేందుకే తాను కాంగ్రెస్‌ను వీడినట్టు దేవ్‌రా చెప్పారు. అయితే.. దేవ్‌రా కుటుంబానికి కాంగ్రెస్‌తో ఏకంగా 55 ఏళ్ల సుదీర్ఘ అనుబంధం అనుబంధం ఉండడం విశేషం. పైగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ యాత్ర ప్రారంభానికి ముందు జరిగిన ఈ ఘటనను ప్రధాని మోదీ కుట్రగా ఆ పార్టీ అభివర్ణించింది. యాత్రకు సంబంధించిన వార్తలను కనుమరుగు చేసి, దేవ్‌రా రాజీనామా వార్తలు ప్రముఖంగా ప్రసారం కావాలనే కుట్ర పన్నారని ఆరోపించింది. అయితే, దేవ్‌రా రాజీనామా వ్యవహారం యాత్రపై ప్రభావం చూపదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మాజీ ఎంపీ అయిన దేవ్‌రా ఆదివారం ఉదయమే పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు ఎక్స్‌లో పేర్కొన్నారు. "ఈరోజు నా రాజకీయ ప్రయాణంలో ఒక ముఖ్య అధ్యాయం ముగిసింది. కాంగ్రెస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశాను. ఈ పార్టీతో మా కుటుంబానికి ఉన్న 55 ఏళ్ల అనుబంధం ముగిసింది. నాకు సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులకు కృతజ్ఞతలు" అని దేవ్‌రా పేర్కొన్నారు. అనంతరం ఆయన స్థానిక సిద్ధి వినాయకస్వామి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలుచేశారు. ఆదివారం మధ్యాహ్నం సీఎం ఏక్‌నాథ్ షిండే సమక్షంలో శివసేనలో చేరారు.

ఖర్గే కింద పనిచేయాలా? : నితీశ్ గుర్రు

న్యూఢిల్లీ, జనవరి 14: ప్రతిపక్షాల 'ఇండియా' కూటమిలో అంతర్గత విభేదాలు మరోసారి బయటపడ్డాయి. కాంగ్రెస్ నాయకత్వం తీరుపై బిహార్ సీఎం, జేడీయూ అధినేత నితీశ్‌కుమార్ రగిలిపోతున్నారు. శనివారం జరిగిన వర్చువల్ భేటీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కూటమి చైర్మన్‌గా నియమించి.. తనకు కన్వీనర్ పోస్టు ఇవ్వచూపడాన్ని ఆయన సహించలేకపోయారు. బీజేపీకి వ్యతిరేకంగా ఆయా పార్టీలను ఏకతాటికి తీసుకురావడంలో కీలక భూమిక పోషించిన తనను కాంగ్రెస్ కావాలనే తక్కువ చేసి చూస్తోందని.. ఖర్గే కింద పనిచేయాలని పరోక్షంగా సూచిస్తోందని గుర్రుగా ఉన్నారు. అందుకే కన్వీనర్ పదవి తనకు వద్దని, ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్‌కు ఇవ్వాలని సూచించారు.

హిట్ అండ్ రన్ కేసుల్లో పరిహారం పెంపును పరిశీలించండి

- కేంద్రానికి సుప్రీంకోర్టు సూచన



న్యూఢిల్లీ, జనవరి 14: హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు చెల్లించే పరిహారాన్ని ప్రతియేటా పెంచే విషయాన్ని పరిశీలించాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న మోటారు వెహికల్స్ చట్టం-1988 ప్రకారం హిట్ అండ్ రన్ సంఘటనల్లో మరణించిన వారి కుటుంబాలకు నష్టపరిహారం కింద రూ.2 లక్షలుగానీ, కేంద్రం నిర్ణయించిన మేరకు అంతకన్నా ఎక్కువ మొత్తాన్నిగానీ చెల్లించాల్సి ఉంటుంది. అదే గాయపడ్డ వారికి రూ.50 వేలకు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ పరిహారాన్ని పెంచే ప్రతిపాదనను పరిశీలించాలని జస్టిస్ ఎ.ఎస్. ఓకా, జస్టిస్ పంకజ్ మిట్టల్‌ల ధర్మాసనం ఆదేశించింది. దీనిపై ఎనిమిది వారాల్లో సమాధానం ఇవ్వాలంటూ తదుపరి విచారణను ఏప్రిల్ 22కు వాయిదా వేసింది. సుప్రీంకోర్టుకు కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ అందించిన నివేదిక ప్రకారం 2016లో 55,942 హిట్ అండ్ రన్ కేసులు నమోదు కాగా, 2022లో 67,387 కేసులు రిజిస్టర్ అయ్యాయి. ఈ అయిదేళ్ల కాలంలో హిట్ అండ్ రన్ ప్రమాదాల్లో మరణించిన వారిలో 660 మంది కుటుంబాలకు, 113 మంది గాయపడ్డ వారికి పరిహారం అందింది. రూ.1.84 కోట్లు మాత్రమే పరిహారం కింద చెల్లించారు. జరిగిన ప్రమాదాలకు తగ్గట్టుగా పరిహారం చెల్లించలేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

విదేశీ విద్యార్థులపై పరిమితి!

- కెనడా ప్రభుత్వం యోచన

ఒట్టావా, జనవరి 14: కెనడాలో ఇళ్లకు కొరత నేపథ్యంలో విదేశీ విద్యార్థుల రాకపై పరిమితులు విధించాలని ట్రూడో ప్రభుత్వం యోచిస్తోంది. వలసలు, శరణార్థులు, పౌరసత్వ శాఖల మంత్రి మార్క్ మిల్లర్ తాజాగా ఒక టీవీచానల్ ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని వెల్లడించారు. దేశంలో విదేశీ విద్యార్థుల సంఖ్య 9లక్షలకు చేరడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విదేశీ విద్యార్థుల సంఖ్య కలవరపెడుతోందని, దీనికి కళ్లెం వేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వాలతో ఫెడరల్ ప్రభుత్వం చర్చలు జరపాలన్నారు. ఈ ఏడాది 4.85లక్షల మంది వలసదారులను దేశంలోకి అనుమతించాలన్నది అధికార లిబరల్స్ పార్టీ లక్ష్యం. 2025, 26సంవత్సరాల్లో ఐదేసి లక్షల చొప్పున వలసదారులను అనుమతించాలని భావిస్తోంది. 2012లో 2.75 లక్షలున్న విదేశీ విద్యార్థుల సంఖ్య 2022లో 8లక్షలు దాటింది. కెనడా ఇమ్మిగ్రేషన్ విభాగం గణాంకాల ప్రకారం కెనడాకు వస్తున్న విదేశీ విద్యార్థుల్లో భారతీయుల సంఖ్య బాగా ఉంది. గతేడాది నవంబరునాటికి కెనడాలో 5,79,075 మంది విదేశీ విద్యార్థులుండగా, వారిలో 2,15,910 మంది(37%) భారతీయ విద్యార్థులే. 2022ఏప్రిల్ నుంచి 2023మార్చి వరకు 32వేల మంది ఐటీ ఉద్యోగులు కెనడాకు వలస వెళ్లగా వారిలో సగం మంది భారతీయులే. 2018 నుంచి విదేశీ విద్యార్థుల ప్రధాన వనరుగా భారత్ మారింది. ఉన్నత విద్య, ఉద్యోగాల కోసం పెద్ద సంఖ్యలో భారతీయులు కెనడాకు వలస వెళ్తుండటంతో గత రెండు దశాబ్దాల్లోనే కెనడాలోని సిక్కు జనాభా రెండింతలైంది.

జగన్ నివాసంలో తిరుమల సెట్టింగ్

- ప్రముఖ ఆలయాల్లోని దేవుళ్ల నమూనాలు
- హిందూ గుళ్లకు భారతీరెడ్డి దూరం
- తిరుమలకూ జగన్ ఒంటరిగానే..
- అలాంటిది ఎన్నికల సంక్రాంతి వేళ నమూనా ఆలయాల్లో పూజలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఏపీ ముఖ్యమంత్రి జగన్ నివాసంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. తాడేపల్లి ప్యాలెస్‌లో తిరుమల ఆలయాన్ని పునఃసృష్టించారు. జగన్ దంపతులు ఆ నమూనా ఆలయంలో పూజలు జరిపారు. శఠగోపం పెట్టించుకున్నారు. ఒకరికి ఒకరు కుంకుమ దిద్దుకుని స్వామిని సేవించారు. అక్కడి పరసరాలను కూడా అచ్చం పల్లెటూరు అందాలు, అద్భుతమైన కళాఖండాలు, ఆలయం, ఇంకా ప్రముఖమైన కళాకృతులతో నింపేశారు. అయితే.. భర్త సీఎం అయ్యాక ఏనాడూ ఏ హిందూ ఆలయానికీ వెళ్లని భారతిరెడ్డి జగన్‌తో కలిసి ఈ 'మినీ తిరుమల' ఆలయంలో పూజలు, దర్శనాలు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. నిజానికి, సీఎం హోదాలో జగన్ తిరుమల బ్రహ్మోత్సవాలకు పట్టువస్త్రాలు తీసుకెళుతున్నారు. సాధారణంగా ఈ కార్యక్రమంలో సతీమణితో కలిసి పాల్గొనడం రివాజు. అయినా, తిరుమల కొండపై జగన్ వెంట ఎప్పుడూ భారతీరెడ్డి కనిపించలేదు. రాష్ట్రంలోని హిందూ ఆలయాలను ఆమెగానీ, జగన్‌తో కలిసి జంటగాగానీ వెళ్లిందే లేదు. అలాంటిది.. తాడేపల్లి నివాసంలోనే తిరుమల ఆలయం సెట్టింగును రూ.కోట్ల ఖర్చుతో నిర్మింపజేయడం, సంక్రాంతి రోజు అక్కడ పూజాకార్యక్రమాల్లో స్వయంగా పాల్గొనడం సొంత వైసీపీ పార్టీ వర్గాలనే ఆసక్తికి గురి చేస్తోంది. దీంతో రాజకీయ సంక్రాంతి పర్వంలో.. ఎన్నికల భక్తిని భారతీరెడ్డి ప్రదర్శించారనే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి. నిజానికి, ఉగాది, సంక్రాంతులను తెలుగు సంప్రదాయాలను అనుసరించి జగన్ దంపతులు ఏటా జరుపుతున్నారు. అయితే, ఇంత అట్టహాసం గతంలో ప్రదర్శించలేదు. ముగ్గులు, రంగులతో నివాస పరిసరాలను ముస్తాబు చేసేవారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి నిర్వహించే గోశాలను సందర్శించి గోవులను తాకి వాటికి ఆహారం అందించేవారు. సాంస్కృతిక కార్యక్రమాలను కలిసి తిలకించేవారు. ఈసారి మాత్రం.. ఆలయ సెట్టింగులు వేశారు.

విమానాలకు మంచు దెబ్బ!

పలు విమాన సర్వీసులకు తీవ్ర ఆటంకం.. ఢిల్లీలో 10 విమానాల దారి మళ్లింపు



బెంగళూరు, చెన్నై, శంషాబాద్, (ఆంధ్రజ్యోతి), న్యూఢిల్లీ, జనవరి 14: దట్టమైన పొగమంచు ఆదివారం దేశవ్యాప్తంగా విమాన సర్వీసులపై తీవ్ర ప్రభావం చూపింది. ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, వరాణసీ విమానాశ్రయాల్లో విమాన సర్వీసులకు తీవ్ర ఆటంకం కలిగించింది. పొగమంచు కారణంగా తక్కువ దృశ్యమాన పరిస్థితులు ఏర్పడి రన్‌వే కనిపించలేదు. దీంతో ఆదివారం తెల్లవారుజామున 4:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రెండు అంతర్జాతీయ విమానాలు సహా.. మొత్తం పది విమానాలను జైపూర్‌కు దారి మళ్లించినట్టు ఢిల్లీ విమానాశ్రయ అధికారులు వెల్లడించారు. ప్రతికూల వాతావరణం కారణంగా విదేశీ సర్వీసులతోపాటు దాదాపు 100 విమానాలు ఆలస్యమయ్యాయని, కొన్ని రద్దయ్యాయని తెలిపారు. ఆదివారం ఢిల్లీతోపాటు ఉత్తర భారతదేశంలోని అనేక ప్రాంతాలను దట్టమైన పొగమంచు కమ్మేసింది. అనేక చోట్ల విజిబులిటీ స్థాయి సున్నా మీటర్లకు పడిపోయింది. దేశ రాజధాని ఢిల్లీ నుంచి కెనడాలోని వాంకోవర్‌కు వెళ్లాల్సిన ఎయిరిండియా విమానం ఏఐ185ను ప్రయాణికులు ఎక్కిన తర్వాత రీషెడ్యూల్ చేశారు. దీంతో ప్రయాణికులు విమానం లోపలే గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. వరాణసీలో పొగమంచు కారణంగా నాలుగు విమానాలను రద్దు చేసినట్టు ఆకాశ ఎయిర్ ప్రకటించింది.

బెంగళూరులో 34 విమానాలు ఆలస్యం

బెంగళూరుకు అనుబంధంగా ఉండే దేవనహళ్లి అంతర్జాతీయ విమానాశ్రయ ప్రాంతంలో దట్టమైన పొగమంచు కారణంగా ఆదివారం విమాన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. తెల్లవారుజామున పొగమంచు కప్పేయడంతో 2 గంటల నుంచి విమానాలు టేకాఫ్ కాలేదు. 34 విమానాలు ఎయిర్‌పోర్టులోనే గంటల తరబడి నిలిచిపోయాయి. సంక్రాంతి వేళ సొంతూళ్లకు వెళ్లేందుకు బయల్దేరిన ప్రయాణికులు విమానాశ్రయంలోనే పడిగాపులు పడ్డారు.

చెన్నై నుంచి హైదరాబాద్‌కు నాలుగు విమానాలు

చెన్నై మీనంబాక్కం ప్రాంతంలో భోగిమంటల కారణంగా వాయుకాలుష్యం ఏర్పడింది. భోగి మంటలలో నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు, పాత టైర్లను కాల్చడంతో నగరంలో మునుపెన్నడూ లేనంతగా దట్టమైన పొగలు అన్ని వైపులా వ్యాపించాయి. ఆ పొగలకు మంచుకూడా తోడై.. మీనంబాక్కం విమానాశ్రయం రన్‌వేలను పొగమంచు దట్టంగా కప్పేసింది. దీంతో విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆదివారం వేకువజాము సింగపూర్ నుంచి వచ్చిన ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానం, లండన్ నుంచి వచ్చిన బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానం, శ్రీలంక నుంచి వచ్చిన మరో విమానం, ఢిల్లీ నుంచి వచ్చిన విమానం ఇక్కడ ల్యాండింగ్ కాలేకపోయాయి. చివరకు వాటిని హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయానికి మళ్లించారు. అలాగే.. మస్కట్, దుబాయ్, కువైత్, ముంబై, హైదరాబాద్, కోల్‌కతా, బెంగళూరు నుంచి రావాల్సిన 20 విమానాలు, ఇక్కడి నుంచి ఇతర నగరాలకు వెళ్లాల్సిన విమానాల రాకపోకలు ఆలస్యమయ్యాయి.

గత ప్రభుత్వం అవినీతిపై చర్యలు

» పదేళ్లలో ఆ ప్రభుత్వం చేసిందేమీ లేదు: మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ, జనవరి 14: గత ప్రభుత్వం చేసిన అవినీతిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అప్పటి ప్రభుత్వం పదేళ్లలో అవినీతి చేసిందే తప్ప మరేమీ చేయలేదని విమర్శించారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టుపై జరిగిన అవినీతిపై తాను అసెంబ్లీలో మాట్లాడిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి సిటింగ్ జడ్జితో జ్యుడీషియల్ విచారణకు ఆదేశించారని చెప్పారు. తాను ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఆ జిల్లాలో అభివృద్ధి పనులు చేయడంతో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 నియోజకవర్గాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని తెలిపారు. తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజాభవన్ ద్వారా ప్రజాపాలన నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఇటీవల వచ్చిన దరఖాస్తులను పరిశీలించి 100 రోజుల్లోనే అన్ని పథకాలను అమలు చేయనున్నట్లు తెలిపారు.

రంగనాయకసాగర్‌లోకి నీటిని పంపింగ్ చేయండి

» మంత్రి ఉత్తమ్‌ను ఫోన్‌లో కోరిన హరీశ్‌రావు

సిద్దిపేట టౌన్, జనవరి 14: సిద్దిపేట రైతాంగం యాసంగి పంటకు నీళ్లు లేక ఆందోళన చెందుతున్న తరుణంలో వెంటనే రంగనాయకసాగర్‌లోకి నీటిని పంప్ చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కోరారు. నీటి లభ్యత ఉన్న మిడ్‌మానేరు లేదా అనంతగిరి రిజర్వాయర్ నుంచి 1.50 టీఎంసీ నీటిని వెంటనే పంప్ చేయాలని సూచించారు. ఆదివారం హరీశ్‌రావు.. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో యాసంగి పంటకు సరిపోయే నీరు రిజర్వాయర్‌లో లేక రైతాంగం ఆందోళనకు గురవుతున్నదని చెప్పారు. ఈ తరుణంలో రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని నీటి లభ్యత ఉన్న మిడ్ మానేరు నుంచి లేదా అంతగిరి రిజర్వాయర్ నుంచి వెంటనే 1.50 టీఎంసీల నీళ్లు రంగనాయక సాగర్‌కు వచ్చేవిధంగా అధికారులను తక్షణమే ఆదేశించాలని కోరారు. అదేవిధంగా మల్లన్నసాగర్ ద్వారా రైతులకు నీళ్లు అందించాలని కోరారు. అందుకు మంత్రి ఉత్తమ్ సానుకూలంగా స్పందిస్తూ ఇరిగేషన్ అధికారులతో చర్చించి నీటి పంపింగ్‌కు ఆదేశాలు ఇస్తానని హామీ ఇచ్చారు.

'రామాలయం'పై బీజేపీది రాజకీయం

» నిర్మాణం పూర్తయిన తర్వాత అయోధ్యకు వెళ్తా: ఉత్తమ్

మేళ్లచెర్వు, జనవరి 14: అయోధ్యలో రామమందిర నిర్మాణం పూర్తి కాకుండానే రాజకీయ ప్రయోజనాల కోసం బీజేపీ, ఆర్ఎస్ఎస్ హడావుడిగా ప్రారంభోత్సవ కార్యక్రమాలు చేపడుతున్నాయని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే బీజేపీ రాజకీయం చేస్తోందన్నారు. ఆ పార్టీ చర్యలను పలు హిందూ సంస్థలు, మఠాధిపతులు, పీఠాధిపతులతో పాటు శంకరాచార్యులు కూడా తప్పుపట్టారన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులోని స్వయంభు శంభులింగేశ్వరస్వామి దేవాలయాన్ని దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజల్లో ఉత్తమ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరలతో ఆయన మాట్లాడుతూ.. తమ కుటుంబం రామభక్తుల కుటుంబం అని, ప్రతి రోజూ ఏదో ఒక ప్రాంతంలో రామమందిరాన్ని దర్శిస్తుంటామని చెప్పారు. అయోధ్యలో రామాలయ నిర్మాణం పూర్తయిన తర్వాత స్వామి వారిని దర్శించుకుంటామని, ఇది పూర్తిగా తన వ్యక్తిగతమన్నారు. కాంగ్రెస్ నిర్ణయాన్ని, పార్టీ అధికార ప్రతినిధులు ప్రకటిస్తారని తెలిపారు. పదేళ్లలో రాష్ట్రం అప్పుల పాలైందని, తెలంగాణ ఏర్పడే నాటికి రూ.70వేల కోట్ల అప్పు ఉంటే ఈ పదేళ్ల కేసీఆర్ పాలనలో 10 రెట్లు పెరిగిందని ఆయన అన్నారు.

పది రోజుల్లో ఫాంహౌస్‌కు వస్తా

» వ్యవసాయ పనులన్నీ చూసుకుంటా: కేసీఆర్

» ఫర్టిలైజర్ షాపు యజమానికి ఫోన్



జగదేవ్‌పూర్, జనవరి 14: తుంటికి ఆపరేషన్ జరిగి హైదరాబాద్‌లోని నివాసంలో కోలుకుంటున్న మాజీ సీఎం కేసీఆర్.. పదిరోజుల్లో తాను ఫాంహౌస్‌కు వస్తానని చెప్పారు. ఈ మేరకు ఆదివారం సిద్దిపేట జిల్లా ములుగు మండలం ఒంటిమామిడిలోని ఫర్టిలైజర్ షాపు యజమాని బాపురెడ్డికి ఆయన స్వయంగా ఫోన్ చేశారు. "పది రోజుల్లో వ్యవసాయ క్షేత్రానికి వస్తా. వ్యవసాయ పనులన్నీ నేనే దగ్గరుండి చూసుకుంటా. ఈసారి బొప్పాయి పంట సాగు చేద్దాం. అవసరమైన ఎరువులు, విత్తనాలు పంపించు" అని బాపురెడ్డితో కేసీఆర్ అన్నారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. "ఆరోగ్యం ఎలా ఉంది సార్? పూర్తిగా తగ్గిందా?" అని ఫర్టిలైజర్ యజమాని అడగగా.. చాలా త్వరగా కోలుకున్నానని, తన ఆరోగ్యం ఇప్పుడు బాగుందని కేసీఆర్ చెప్పారు. కాగా, కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో ఇప్పటికే వంద ఎకరాలకు పైగా వరి పంట సాగు చేసినట్లు తెలిసింది.

తెలంగాణ బలాన్ని చాటుతాం

భారీ పెట్టుబడులే లక్ష్యంగా దావోస్‌లో సీఎం రేవంత్ పర్యటన

» అనేకమంది పారిశ్రామికవేత్తలతో ఆయన సమావేశం

» కీలక రంగాల పెట్టుబడులపై సంతకాలు చేసే చాన్స్

» వ్యవసాయ ఎకానమీపై వాతావరణమార్పుల ప్రభావం

» రైతుల జీవనోపాధిపై ప్రసంగించనున్న ముఖ్యమంత్రి

» పర్యటన వివరాలను వెల్లడించిన ఐటీ మంత్రి దుద్దిళ్ల

హైదరాబాద్, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): ఐటీ రంగంలో అగ్రగామిగా, లైఫ్ సైన్సెస్ రంగానికి హబ్‌గా ఉన్న తెలంగాణ బలాబలాలను ప్రపంచానికి చాటి చెప్పి పెట్టుబడులను ఆకర్షించడానికి దావోస్‌లో జరగబోయే వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ 54వ వార్షిక సమావేశం ఉపయోగపడుతుందని రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఈ పర్యటనలో భాగంగా.. తెలంగాణ కొత్త ప్రభుత్వ విజన్‌ను, ప్రాధాన్యాలను దేశ, విదేశీ పారిశ్రామికవేత్తలకు వివరిస్తారని ఆయన పేర్కొన్నారు. సోమవారం (15వ తేదీ) నుంచి 19వ తేదీ వరకూ స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరగనున్న ఈ సమావేశానికి సీఎం రేవంత్ నేతృత్వంలో తెలంగాణ అధికారిక బృందం వెళ్తున్న నేపథ్యంలో.. దానికి సంబంధించిన పలు అంశాలను మంత్రి వెల్లడించారు. తెలంగాణకు భారీ ఎత్తున పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా తమ దావోస్ పర్యటన సాగుతుందని చెప్పారు. సీఎంతో పాటు వెళ్లే బృందంలో ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ, ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉన్నారని తెలిపారు. తొలి పర్యటనలోనే సీఎంకు ప్రత్యేక గౌరవం దక్కిందని.. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ కాంగ్రెస్ సెంటర్‌లో ప్రసంగించేందుకు కూడా ఆహ్వానించారని మంత్రి వెల్లడించారు. అక్కడ జరగబోయే చర్చాగోష్ఠిలో.. పురోగమిస్తున్న వైద్యరంగంపై సీఎం రేవంత్ తన అభిప్రాయాలను పంచుకుంటారని తెలిపారు. 'ఫుడ్ సిస్టమ్స్ అండ్ లోకల్ యాక్షన్' అనే అంశంపై జరగనున్న అత్యున్నత స్థాయి సదస్సులో సీఎం పాల్గొని.. అగ్రి-ఎకానమీపై వాతావరణ మార్పుల ప్రభావం, రైతుల జీవనోపాధిని పరిరక్షించడానికి వాతావరణం ప్రకారం సాగే వ్యవసాయాన్ని ప్రోత్సహించే చర్యలపై ప్రసంగిస్తారని తెలిపారు. కృత్రిమమేధ (ఏఐ) వర్గాలు ఏర్పాటుచేస్తున్న చర్చా వేదికలో తాను పాల్గొని "డెవలపింగ్ స్కిల్స్ ఫర్ ఏఐ" అనే అంశంపై మాట్లాడుతానని.. టెక్ కంపెనీలు, వర్తక సంస్థల ప్రతినిధులను, ప్రవాస భారతీయ పారిశ్రామికవేత్తలను కూడా కలుసుకుంటానని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. అలాగే.. వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ అధ్యక్షుడు బ్రెండే బోర్జ్‌తో సమావేశం కానున్నట్లు ప్రకటించారు. తెలంగాణతో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్‌కు బలమైన వ్యవస్థీకృత సంబంధాలున్నాయన్న ఆయన.. ఆరోగ్యసంరక్షణ, లైఫ్ సైన్సెస్ రంగంలో ప్రపంచ ఆర్థిక వేదికకు సంబంధించిన "సెంటర్ ఫర్ ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్ (సీ4ఐఆర్)" సదస్సు హైదరాబాద్‌లో జరగబోతున్న విషయాన్ని గుర్తుచేశారు. వ్యవసాయం, ఆహార శుద్ధి రంగాల్లో సాంకేతిక ఉపక్రమణలకు ఆ సంస్థ క్రియాశీలక మద్దతునిస్తోందన్నారు. దావోస్ పర్యటనలో.. ఫార్మా, ఎలక్ట్రానిక్స్, డేటా సెంటర్లు, డిఫెన్స్‌తో పాటు ఏరోస్పేస్, ఆహార శుద్ధి, పునరుత్పాదక ఇంధనం వంటి రంగాల్లో పెట్టుబడుల ఒప్పందాలపై సంతకాలు చేసే అవకాశం ఉందని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. మూడు రోజుల పర్యటనలో ముఖ్యమంత్రితో కలిసి దాదాపు 70మందికి పైగా పారిశ్రామిక దిగ్గజాలను కలవబోతున్నట్టు తెలిపారు. నోవార్టిస్, మెడ్ ట్రానిక్స్, ఆస్ట్రాజెనెకా, గూగుల్, ఉబెర్, మాస్టర్ కార్డ్, బేయర్, ఎల్డీసీ, యూపీఎల్ తదితర అంతర్జాతీయ కంపెనీల సీఈవోలు, సీఎక్స్‌వోలను కలవనున్నట్టు చెప్పారు. భారత్‌కు చెందిన టాటా, విప్రో, హెచ్‌సీఎల్ టెక్, జేఎస్‌డబ్ల్యూ, గోద్రేజ్, ఎయిర్‌టెల్, బజాజ్ వంటి సంస్థల ప్రతినిధులతో పాటు, సీఐఐ, నాస్కాం ప్రతినిధులతోనూ సమావేశమవనున్నట్టు తెలిపారు.



దావోస్ నుంచి లండన్‌కు రేవంత్..

దావోస్‌లో అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సుకు హాజరయ్యే సీఎం రేవంత్.. 18వ తేదీ మధ్యాహ్నం తరువాత లండన్ వెళ్లనున్నారు. 20వ తేదీ వరకూ లండన్‌లో పర్యటించి, 21న రాష్ట్రానికి రానున్నారు. లండన్‌లో పలు ప్రముఖ కంపెనీల వ్యవస్థాపకులు, కొంతమంది సీఈవోలతో ఆయన సమావేశమవుతారు. అక్కడున్న తెలుగువారితోనూ ప్రత్యేకంగా భేటీ అయి కొన్ని కంపెనీలతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టించే విధంగా చూడాలని కోరనున్నట్టు సమాచారం. కాగా రేవంత్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తరువాత విదేశీ పర్యటనకు వెళ్లడం ఇదే మొదటిసారి.

మనోళ్ల డామినేషన్

ప్రపంచ ఆర్థిక వేదిక 54వ వార్షిక సమావేశం కోసం ముస్తాబైన దావోస్‌లో.. భారతీయ లాంజ్‌ల ఆధిపత్యం కనిపిస్తోంది. ప్రభుత్వాలు, ప్రైవేటు సంస్థలు అన్నీ కలిపి 60-70 లాంజ్‌లు ఏర్పాటు చేయగా వాటిలో డజనుకుపైగా మనవే! తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన పెవిలియన్లతో పాటు విప్రో, ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ తదితర ఐటీ దిగ్గజాలు ఈ లాంజ్‌లు ఏర్పాటు చేశాయి. అలాగే.. అక్కడ ఎప్పుడూ అమ్మే మన సమోసాలు, కచోరీలతోపాటు ఈసారి భారతీయ మద్యాన్ని కూడా విదేశీయులకు రుచిచూపించనున్నారు.

చిక్కిన 'చైన్ స్నాచింగ్' జంట!

» అప్పులు తీర్చేందుకు భార్యాభర్తల చోరీలు

» మూడ్రోజుల కింద 15 తులాలు స్నాచింగ్

» నల్లగొండ జిల్లా మర్రిగూడలో పట్టుబడిన జంట

మర్రిగూడ, జనవరి 14: వారిద్దరూ భార్యాభర్తలు.. ఆటో నడుపుకొనే భర్త ఆన్‌లైన్ బెట్టింగులకు అలవాటు పడి అప్పుల పాలయ్యాడు. వాటిని తీర్చే మార్గంలేక చోరీలు మొదలుపెట్టాడు. ఇది తెలిసిన భార్య మందలించకపోగా అతనితో పాటు చైన్ స్నాచింగ్‌లకు బయలుదేరింది. మూడ్రోజుల కింద ఓ మహిళ వద్ద ఇరువురు కలసి ఏకంగా 15 తులాలు చోరీ చేశారు. దీన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు తనిఖీలు చేపట్టి వారిని పట్టుకున్నారు. కేసు వివరాలను నల్లగొండ జిల్లా నాంపల్లి సీఐ నవీన్, మర్రిగూడ ఎస్సై రంగారెడ్డి ఆదివారం మీడియాకు వెల్లడించారు. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం పాలెంలతండాకు చెందిన సపావత్ వెంకటేశ్ హైదరాబాద్‌లోని సంతోష్‌నగర్, సరళాదేవి కాలనీలో తల్లిదండ్రులతో కలసి కొన్నేళ్లుగా ఉంటున్నాడు. అతనికి 2020లో కుమారితో వివాహమైంది. వీరికి 8 నెలల చిన్నారి కూడా ఉంది. ఆటో నడుపుకొనే వెంకటేశ్.. ఈజీ మనీ కోసం ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడ్డాడు. సుమారు రూ.4 లక్షల వరకు నష్టపోవడంతో చేసిన అప్పులు తీర్చేందుకు చోరీలు ప్రారంభించాడు. వెంకటేశ్‌కు అతడి భార్య కుమారి కూడా సహకరించడంతో ఇద్దరూ కలిసి చైన్ స్నాచింగ్‌లు మొదలుపెట్టారు. చోరీలకు వెళ్లేటప్పుడు వెంకటేశ్ తల్లిదండ్రుల వద్ద పాపను విడిచిపెట్టేవారు.. ఈ నెల 11న నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం తిరుగండ్లపల్లికి చెందిన చాట సునీతను మర్రిగూడకు లిఫ్ట్ ఇస్తామని తీసుకెళ్లి మార్గమధ్యలో దింపి.. మూడున్నర తులాల పుస్తెల తాడు, తులంన్నర నల్లపూసల తాడును దోచుకున్నారు. సునీత కేకలు వేయడంతో అక్కడే ఉన్న కొందరు బైక్‌తో వెంబడించారు. అయితే స్కూటీని ఏకంగా 110 కి.మీ. వేగంతో నడిపి వారు తప్పించుకున్నారు. చైన్ స్నాచింగ్‌పై సునీత పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు 4 బృందాలుగా ఏర్పడి తనిఖీలు ప్రారంభించారు. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని సరంపేట ఎక్స్‌రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, అదే సమయంలో అటుగా స్కూటీపై వెంకటేశ్, కుమారి వచ్చారు. వీరిపై అనుమానం రావడంతో తనిఖీ చేయగా.. ఐదు తులాల బంగారం దొరికింది. దీంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించి, విచారించగా ఈనెల 11న చైన్‌స్నాచింగ్ పాల్పడింది తామేనని ఒప్పుకొన్నారు. నిందితుల వద్ద రూ.3 లక్షల విలువైన బంగారంతో పాటు స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నవీన్‌కుమార్ తెలిపారు. నిందితులను అరెస్టు చేసి దేవరకొండ కోర్టుకు రిమాండ్‌కు పంపినట్లు వివరించారు.

వనపర్తి విద్యార్థి అమెరికాలో అనుమానాస్పద మృతి

» వెళ్లిన 15 రోజులకే దారుణం.. ఏపీకి చెందిన విద్యార్థి కూడా

» రాత్రి తిని పడుకుంటే తెల్లారి శవాలుగా..




గట్టు దినేశ్ (ఫైల్)

వనపర్తి టౌన్, జనవరి 14: ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లిన వనపర్తి విద్యార్థి 15 రోజులకే అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఏపీకి చెందిన మరో విద్యార్థి కూడా ఇదే ఘటనలో మరణించాడు. రాత్రి భోజనం చేసి పడుకున్న ఆ ఇద్దరు స్నేహితులు తెల్లారి చూసేసరికి శవాలుగా కనిపించారు. వివరాల్లోకి వెళ్తే.. వనపర్తిలోని 13వ వార్డు రాంనగర్ కాలనీకి చెందిన గట్టు వెంకన్న, లావణ్య దంపతులకు ఒక కూతురు, కుమారుడు దినేశ్ (23) ఉన్నారు. గత డిసెంబరు 28న ఉన్నత చదువుల (ఎంఎస్) నిమిత్తం అమెరికాకు వెళ్లిన దినేశ్.. హార్ట్‌ఫోర్డ్‌లోని ఓ కళాశాలలో చేరాడు. శనివారం రాత్రి శ్రీకాకుళం జిల్లాకు చెందిన తన స్నేహితుడితో కలిసి భోజనం చేసి గదిలో పడుకున్నాడు. ఆదివారం తెల్లవారేసరికి ఇద్దరూ చనిపోయి ఉన్నారు. విషయం తెలిసి దినేశ్ కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో పండుగ పూట ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి వేర్వేరుగా బాధిత కుటుంబ సభ్యులను కలసి పరామర్శించారు. మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి ఫోన్ చేసి పరామర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి మృతదేహాన్ని వనపర్తికి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేయిస్తామని ఎమ్మెల్యే మేఘారెడ్డి తెలిపారు.

వచ్చే నెలలో ఆదిలాబాద్‌కు ప్రధాని మోదీ

హైదరాబాద్, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ వచ్చే నెలలో ఆదిలాబాద్ పర్యటనకు రానున్నారు. మొదటి వారంలోనే ప్రధాని పర్యటన కొనసాగే అవకాశం ఉందని బీజేపీ వర్గాలు వెల్లడించాయి. రామగుండం ఎన్టీపీసీ 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ప్రారంభోత్సవంతో పాటు రాష్ట్రానికి సంబంధించి మరికొన్ని అభివృద్ధి కార్యక్రమాలను మోదీ ప్రకటించనున్నారు. ఆదిలాబాద్‌కు విమానాశ్రయం మంజూరు, నాగ్‌పూర్-హైదరాబాద్ పారిశ్రామిక కారిడార్‌కు ప్రత్యేక నిధులపై ప్రధాని ప్రకటన చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.





వివిధ

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

“దళిత కవిత్వం అంటేనే ప్రశ్నించడం.”



లోక్ నాయక్ ఫౌండేషన్ జీవన సాఫల్య పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా కవి, అంతర్జాతీయ పర్యటన శాఖా నిపుణులు తుల్లిమల్లి విల్సన్ సుధాకర్‌తో ఇంటర్వ్యూ

సుధాకర్ గారూ, పాతికేళ్ల కిందటి కవిత్వారంభ యవ్వనం, ఇప్పుడు సాఫల్య దశకు చేరిందని అనుకుంటున్నారా?

నా కవిత్వం సాఫల్య దశకు చేరిందో లేదో పాఠకులే చెప్పాలి. నేను చెప్పడం సాహసమే అవుతుంది. రాయాల్సింది చానా ఉంది.

కాకపోతే గత పాతికేళ్లుగా నేను నిరంతర సమస్యల అధ్యయనంతో కవిత్వం రాస్తున్నందున, ఎప్పటికప్పుడు నవీకరించబడే వ్యక్తీకరణ ప్రక్రియలో వ్రాయడం, నాకంటూ ఒక వ్యక్తీకరణను సృష్టించుకోడం వల్ల నా కవిత్వం ఎప్పుడూ కొత్తదనాన్ని వెతుకుతున్నట్లు అనిపిస్తుంది. సొంత అభివ్యక్తిని సాధించడంలో విజయం సాధించానేమో అని అప్పుడప్పుడూ అనిపిస్తుంది.

ఆశ్చర్యకరమై పోలికలు, సంక్లిష్టంగా అనిపించే అల్లికలు, పదునైన ఆగ్రహం, ప్రత్యేకమైన డిక్షన్... వీటిని మీ కవిత్వంలో ప్రధాన పనిముట్లు అనుకోవచ్చా?

ప్రపంచవ్యాప్తంగా ఉన్న సమస్యల గురించి నేను రాస్తున్నాను. నేను విశ్వవ్యాప్త ప్రేమ, బాధ, కోపం, పోరాటాలను కవిత్వంలో వ్యక్తీకరిస్తున్నాను. వీటిని కవిత్వంలో వ్యక్తీకరించే సాధనాలు నాకు ఎన్నో దొరికాయి. కవిత్వంలోనే ప్రశ్నించడం ఒకటి. దళిత కవిత్వం అంటేనే ప్రశ్నించడం. అదే పనిముట్లతో గిరిజనులు, మైనార్టీల సమస్యల గురించి రాయగలిగాను. సమకాలీన ప్రపంచంలోని ప్రధాన స్రవంతిలో ఉన్న సమస్యలపై అవగాహన పెంచుకుని, కవిత్వపాదాల్లో నిరసన, ప్రతిఘటన తెలియజేశాను. వ్యవస్థలో మార్పు కోరుకున్నాను. ఆంధ్రాలో దళితుల ఊచకోత, మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న హింస, హిజాబ్, పాలస్తీనా ప్రజలపై జరుగుతున్న మారణకాండ, వీటన్నింటి మీద కవిత్వం రాసాను. రాయడానికి ప్రపంచ సమస్యలే నాకు పెద్ద కాన్వాసు. వీటినుండి స్ఫూర్తి పొందుతున్నాను. ఇంకా రాయాల్సింది ఎంతో ఉంది.

తుల్లిమల్లి విల్సన్ సుధాకర్ | పలకరింపు

పేర్లు చదవకుండా కేవలం కవిత్వం చదివి, కవి ఎవరో చెప్పగలిగిన బృందంలో నేనున్నందుకు సంతోషిస్తున్నాను. ఒక వ్యక్తి ఆరాధన కంటే వస్తువు మీద కవిత్వం రాసినప్పుడు ఇది జరుగుతుంది.

కవిగానే కాదు, పర్యాటక రంగ నిపుణునిగా కూడా మీకు జీవనసాఫల్య పురస్కారం ఇస్తున్నారు. ప్రపంచ పర్యటన మీ కవిత్వానికి ఎంతవరకు ఉపయోగపడింది?

చాలా మంది ఫీల్డులో ఎలాటి పాత్ర లేకుండానే పాల్గొనకుండానే ఉద్యమంలోకి వస్తుంటారు. కొంతమంది జర్నలిజం వార్తల ఆధారంగా కవిత్వం రాస్తారు, వివిధ సమస్యలపై అభిప్రాయాలు వ్యక్తం చేస్తుంటారు. ఈ గందరగోళంలో వాస్తవాలు మరుగుపడుతుంటాయి. నిజానిజాలు కనిపెట్టడానికి ఎంతమందికి మూడో నేత్రం ఉంది? వివిధ దేశాలను సందర్శించే అవకాశం ఉండడం వల్ల కొన్ని కదలికలను, ఉద్యమాలను దగ్గరగా చూడగలిగాను. దక్షిణాఫ్రికాలో నల్లవారి బాధలే కాదు, తెల్లవారి కష్టాలు, భారతీయుల కష్టాలు, నల్లజాతీయుల ఆధిపత్యం కూడా చూడగలిగాను. మొరాకో వెళ్లినప్పుడు కాసాబ్లాంకా మురికివాడల్లో ప్రజల ఆత్మగౌరవ పోరాటాలు చూశాను. అభివృద్ధి చెందిన జపాన్‌లో కూడా అనేక రెస్టారెంట్‌లలో స్థానిక ప్రజలు, మైనారిటీలకు వ్యతిరేకంగా అనేక సైన్ బోర్డులు చూసాను. వివక్షాపూరిత చట్టాలు, జాత్యహంకార ప్రజలు కనబడతాయి. ఇవన్నీ దగ్గరగా చూడగలిగాను. దుబాయ్‌లో ఉన్నప్పుడు వలస కార్మికుల అవస్థలు కనబడుతుండేవి. ఇవన్నీ నాకవిత్వంలో రాసాను.

మార్క్సిస్టులు క్షేత్రస్థాయిలో ఉండి ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నారు. దళితోద్యమకార్యకర్తలు కూడా దళితుల సమస్యలను పూర్తిగా తెలుసుకుని రాస్తుంటారు. అలాంటి ప్రపంచానుభవం నాది. వివిధ ప్రదేశాల్లోని సమస్యలను చూసే అవకాశం లభించింది. అవన్నీ నా కవిత్వంలో నిలిచిపోతాయి.

పేరు చూడకుండానే కవిత్వ కర్తను గుర్తుపట్టగలిగే అతి కొద్ది మంది కవుల్లో మీరు చేరారు, మీ వ్యక్తీకరణలోనే కాక, మీరు ఎంచుకునే వస్తువుల్లో కూడా మీ ముద్ర కనిపిస్తుంది. వాట్ నెక్స్ట్?

'Death of author' కాన్సెప్ట్ వినే ఉంటారు. సాహిత్య సిద్ధాంతంలో, కవి కవిత్వం మీద ఎప్పటికీ ఆధిపత్యం వహించడు. కవి మరణిస్తాడు. కవిత్వం మాత్రమే మిగిలి ఉంటుంది. కవిత్వం రాసాక కవి మరణిస్తాడు. మరణం తరువాత, పాఠకులు మరిన్ని కళాకృతుల కోసం తహతహ లాడుతుంటారు. అలాంటి వాతావరణంలో పేర్లు చదవకుండా కేవలం కవిత్వం చదివి, కవి ఎవరో చెప్పగలిగిన బృందంలో నేనున్నందుకు సంతోషిస్తున్నాను. ఒక వ్యక్తి ఆరాధన కంటే వస్తువు మీద కవిత్వం రాసినప్పుడు ఇది జరుగుతుంది. ఈ లక్షణం కొనసాగుతుంది. అయితే వైయక్తిక అనుభూతులతో భావాలతో భావ కవిత్వం కూడా రాశాను. కానీ నిరసన కవిత్వంలోనే వ్యక్తిగత అనుభూతులతో రాసినవి ఎన్నో ఉన్నాయి. కవిత్వంలో విశాల దృక్పథంతో రకరకాల అంశాలతో కవిత్వం రాస్తూ వచ్చాను.

95380 53030

రామేశ్వరం కాకులూ, కొల్లేటి పక్షులూ... పతంజలి కథా!

మీకు పతంజలి శాస్త్రి తెలుసా? అదే ఆ కథలు రాసే శాస్త్రి, కాదు కాదు నాటకాలు కూడా రాశాడే ఆ పతంజలి, లేదూ పర్యావరణ ఉద్యమాలంటూ తిరుగుతాడే అదిగో ఆ కురచగా ఉండి, పిచ్చిగా నవ్వే పతంజలిశాస్త్రి, ఆ... ఆయనే.

ఎప్పుడో పుట్టిన మనిషి, మరెక్కడో పెరిగిన మనిషి అని చెప్పుకోవటం ఎప్పుడూ వినేదే. ఫలానా కథ రాసిన మనిషి అని చెప్పుకోవటం బావుంటుంది, ఫలానా ప్రాంతంలో భూమిని కాపాడిన మనిషి అని చెప్పుకోవటం ఇంకా బాగుంటుంది. కవి లేదా రచయిత అన్నవాడు ఉద్యమకారుడైనప్పుడు అతని నుంచి ఉత్తమమైన సాహిత్యం వస్తుంది. మనిషి మనిషిలాగానే ప్రవర్తిస్తాడు. పోలీసు పోలీసులాగే ఉంటాడు. కథల్లో సన్నివేశాలు మరీ కృతకంగా అనిపించవు. అయితే అంతా సహజంగానే ఉంటే మరి కథెక్కడ ఉంటుందీ!? ముగింపులో... అవును ముగింపులోనే కథ మొదలు ఉంటుంది. దాదాపు చివరికి వచ్చేవరకూ అక్కడే కథంతా ఉందని పాఠకుడికి తెలియకుండా దాచి ఉంచటం బహుశా పతంజలిగారికి ఉన్న ప్రత్యే'కథ'.

'రామేశ్వరం కాకులు', 'కచ్ఛప సీత', 'మార్ఖండేయుడి కాఫీ', 'భగవంతం కోసం', 'దూరెన్ పాము' లాంటి కొన్ని కథల్లో పాత్రలన్నీ ఏదో ఒకరకమైన మౌనాన్నీ, భారమైన జీవితాన్నీ మోస్తూనే ఉంటాయి. చివరలో ఆ కథ మొదలు అలా ఎందుకుందో అర్థమయ్యే మాటలు కనిపిస్తాయి అప్పుడు... అక్కడ కథని టెక్నికల్‌గా ముగించేస్తాడు. అక్కడినుంచీ పాఠకుడు మళ్ళీ కథలోకి వెళ్ళాల్సిన అనివార్యమైన స్థితిలో పడిపోతాడు.

ఒక సామాజిక, పర్యావరణ ప్రేమికుడిగా, ఉద్యమకారుడిగా ఉన్నందునే ఆయన కథల్లో అంశాలు కూడా అవే విషయాలని చర్చిస్తాయి. చరిత్ర, పౌరాణిక అంశాలని టచ్ చేసినా మానవ సమాజ హెచ్చుతగ్గులనూ, మానసిక సంచలనాన్నీ చర్చించటం రెగ్యులర్‌గా కనిపించే విషయం.

'గుప్తా 91' కథ చదివితే కథ చెబుతున్నట్టుగా కాక ఒక ప్రాంతపు సామాజిక, భౌగోళిక మార్పుని ఇంతందంగా చెప్పొచ్చా అనిపిస్తుంది. రకరకాల పాత్రల మధ్యలో ఒక మధ్యతరగతివాడి పొదుపరితనం, దాన్ని అధిగవించే ఖర్చులూ, నిరంతరం మేజిక్ జరుగుతున్నట్టుగా మారిపోతున్న ప్రపంచ చిత్రం ఒక ఇరవయ్యేళ్లకాలాన్ని చుట్టచుట్టి తలలోకి కూరటం అంత ఈజీగా సాధ్యపడేది కాదు. కానీ పతంజలిశాస్త్రికి అదేమంత ఇబ్బంది కూడా అయినట్టుగా అనిపించదు. అట్లాగే 'మార్ఖండేయుడి కాఫీ' లోనూ. అతను... ఆమెకోసం ఎదురు చూస్తాడు, చూస్తూనే ఉంటాడు అతనికి ఆమెమీద ఇష్టం కంటే, ఎదురు చూడటంలోనే ఏదో ఆనందం ఉందన్న విషయం అర్థం కావటానికి కాస్త సమయం పడుతుంది. కానీ ఆ కథ పూర్తయ్యాక మార్ఖండేయుడు భేతాళుడిలా మన బుర్రలోంచి పోడు. ఇక్కడ కొట్టొచ్చినట్టు కనిపించే ఒక లక్షణం ఏమిటంటే... కథ పాఠకుడిని ఏమాత్రం తక్కువ అంచనాలో ఉంచదు. తనకన్నా పాఠకుడి ఊహాశక్తి తక్కువని రచయిత ఏమాత్రం అనుకోడు. అందుకే కథ స్థల కాలాలలో పాటుగా ముందుకూ వెనక్కూ నడుస్తుంది, అనుకోకుండా ఫ్లాష్‌బ్యాక్ లోకి వెళ్ళిపోయి చప్పున వెంటనే మళ్లీ వర్తమానంలోకి వస్తుంది. ఇదొక ప్రత్యేకమైన టెక్నిక్. ఇది ప్రయత్నిస్తే వస్తుందేమో కానీ అంత సులభ సాధ్యమైనదైతే కాదు.

'భగవంతం కోసం', 'రామేశ్వరం కాకులు', 'ఆమెదనంతపురం' లాంటికథల్లో ఉండే ప్రత్యేకమైన ముగింపులు, ఆ చిన్న చిన్న సంభాషణల్లో అంతర్గతంగా వినిపించే నిశ్శబ్దం ఒక వింత స్థితిలోకి తీసుకుపోతాయి. అయితే ఈ కథల్లోని ఏ పాత్రా మన ఊహకు అందనిది కాదు, మనం చూసే అనేకానేక మనుషులలాగే అత్యంత సాధారణంగా ఉంటుంది, ఆ పాత్రల ప్రవర్తనా, వాటి చుట్టూ ఉండే వాతావరణమూ మన నిత్య జీవితాల్లో కనిపించేవే అయి ఉంటాయి. ఒక రచయిత ఎంతగా ప్రజా జీవితంలో మమేకమైతే అతని రచనా విస్తృతి అంతగా పెరుగుతుంది. రాసే రచనలో వైవిధ్యం ఉంటుంది. ఒకరకమైన మాజిక్ రియలిజం లాంటి కథాగమనంలోనూ కొత్తదనం వచ్చి చేరుతుంది. కాబట్టే పతంజలిశాస్త్రి మాజిక్ రియలిజం తరహా కథల్లోనూ ఏమాత్రం లాజిక్ మిస్సవని తీరు కనిపిస్తుంది. 'భగవంతం కోసం', 'అలవాటైనకోతి', 'దూరెన్ పాము' లాంటి కథల్లో మార్మికత, మాజిక్ రియలిజం సుస్పష్టంగా ఉండటాన్ని గమనించవచ్చు. ఈ కథలన్నిటిలో పైన చదివేది వేరు, అంతర్లీనంగా రచయిత మనకు చెప్పాలనుకున్నది వేరు. ఇక ఈ కథలని కాస్త అందంగా తీర్చిదిద్దటానికి వాడే పోలికలూ, ఉపమానాలు కొన్నిసార్లు పాఠకున్ని ఆశ్చర్యపరిచేలా ఉంటాయి. అన్నిటికన్నా ముఖ్యంగా పాత్రల స్వభావాన్ని మరీ ఎక్కువ పరిచయం చేసే అవసరం లేకుండా బ్రాకెట్‌లో వాడే చిన్నమాటతో చెప్పటం. ఇది తెలుగులో ఇదివరకు ఎవరన్నా వాడారో లేదో తెలియదు గానీ, ఇదొక అద్భుతమైన ప్రయోగం, ఇది ఈ కథల విక్రమార్కుడి మార్కు. కథ చెప్పినంత సులువుగా రాయటం అలవడిన అతి తక్కువమంది రచయతల్లో పతంజలి ఒకడిగా ఉన్నాడని అంటే ఒప్పుకోని వాళ్ళెవరైనా ఒకసారి మళ్ళీ ఆ కథల్ని చదివితే నా అభిప్రాయంతో ఏకీభవిస్తారనే అనుకుంటున్నాను. నిజానికి ఈ కథలు ఒకరు చెబితేనో, వివరిస్తేనో అర్థమయ్యేవి కాదు. వాటిని నేరుగా చదివితే తప్ప రచయిత ఇచ్చే గొప్ప అనుభవాన్ని పొందటం కష్టం. కథలు, నవలలు, ప్రతీ దాంట్లో పర్యావరణం ప్రకృతి నియమాలు ఒక అంశంగా మార దానికి కారణం ఆయన క్రియాశీలంగా పర్యావరణ పరిరక్షణలో భాగం కావడమని గమనించగలం. కల్చర్, మ్యూజిక్, డాన్స్, పొలిటికల్ హిస్టరీ... ఇలా అన్నిటిలోనూ ఉన్న ప్రవేశం పతంజలిశాస్త్రిని మరింత ప్రత్యేకంగా చేసింది.



'మనో చీమ' వంటి కథను చదువుతున్నప్పుడు ఒక కార్యశీలిగా పతంజలి స్వభావమూ, ఆయన ఆలోచనా ధోరణీ స్పష్టంగా కనిపిస్తాయి. ముఖ్యంగా రచయితగా తనని తాను మోసం చేసుకోవటాన్ని నిరాకరించే స్వభావమూ ఉంది.

కొల్లేటిని కాపాడుకోవటం కోసం చేసిన పోరాటం, కొల్లేరు ప్రాంతాన్ని చేపల చెరువులుగా మార్చి అక్కడి జీవావరణాన్ని నాశనం చేసే ప్రయత్నాలని అడ్డుకోవటం కోసం పడ్డ శ్రమా పతంజలి శాస్త్రి రచయతగా చేసిన దానికంటే ఎక్కువ. 1994లో పిల్లల్లో పర్యావరణ స్పృహని పెంచేందుకు సిలబస్‌లో దాన్ని పాఠ్యాంశాలుగా చేర్చాలన్న తీర్పు రావటం, కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడిగా, పబ్లిక్ హియరింగ్ మెంబెర్‌గా పనిచేసిన శాస్త్రి కథల్లో కూడా ఆ అంశాలనే ఎత్తుకోవటం వింతగా ఏమీ అనిపించదు. అయితే పోరాట జీవితం ఆయన వ్యక్తిగత ఆరోగ్యాన్ని ఎంతగా ప్రభావితం చేసిందో, కథకుడిగా, రచయితగా మరింత బలపరిచింది.

'కాసులోడు' కథలో సెజ్‌లో భూముల ఆక్రమణని చర్చిస్తే, 'రామేశ్వరం కాకులు' మరికొన్ని కథల్లో పోలీసు పాత్రలు, పొలిటీషియన్ల రూపాలూ మరింత పచ్చిగా కనిపిస్తాయి. ఇవన్నీ కొత్తవీ, వింతవీ కాదు. మనకు తెలియని నిజాలూ కావు. కానీ అవి కథలుగా మారే క్రమంలో మరింత లోతుగా మనలని ప్రభావితం చేయగలవు. ఒక న్యూస్ ఆర్టికల్ చదివినదానికన్నా ఎక్కువ సమాచారం ఇవ్వగలవు. ఇది అరవయ్యేళ్ల కాలపు కథకుడు ఈ సమాజాన్ని గమనిస్తూ వచ్చి వాటిని డాక్యుమెంట్ చేసి పెట్టిన రిపోర్ట్‌గా అనుకోవచ్చు. ఈ మహా కాలపు మార్పులని, మనుషుల, సమాజాల మానసిక, భౌతిక మార్పులని తెలుసుకోవచ్చు.

ఒక సామాజిక, పర్యావరణ ప్రేమికుడిగా, ఉద్యమకారుడిగా ఉన్నందునే పతంజలిశాస్త్రి కథల్లో అంశాలు కూడా అవే విషయాలని చర్చిస్తాయి. చరిత్ర, పౌరాణిక అంశాలని టచ్ చేసినా మానవ సమాజ హెచ్చుతగ్గులనూ, మానసిక సంచలనాన్నీ చర్చించటం రెగ్యులర్‌గా కనిపించే విషయం. పతంజలిశాస్త్రి గురించి, ఆయన కథల గురించి చర్చ జరుగుతుందంటే ఈ సమాజాన్ని మరింత అర్థం చేసుకునే ప్రయత్నం జరుగుతున్నట్టే. ఇది ఈ కాలానికీ ఈ తరం పాఠకులకీ అత్యవసరమైన విషయం.

అందుకే ఇప్పటికి ఈ సంతోషమంతా! పతంజలిశాస్త్రి గురించి ఆయన కథల గురించి చర్చ జరుగుతుందంటే ఈ సమాజాన్ని మరింత అర్థం చేసుకునే ప్రయత్నం జరుగుతున్నట్టే. ఇది ఈ కాలానికీ ఈ తరం పాఠకులకీ అత్యవసరమైన విషయం.

నరేష్కుమార్ సూఫీ

95736 09460

కపర కపర చీకటి



ఆరోజు
నాకు జ్ఞాపకముంది
గూట్లోనుంచి తొంగి చూసే జిట్టపిట్ట మాదిరి
కలుజు మీద పారే నీళ్లు
తల్లి గుండెల మీద పారాడే బిడ్డ లెక్క
ఏట్లో ఎక్కుతున్న చేపలు

నీ నోట్లో నుంచి
ఎవరికెవరం ఏమౌతాం
ఏటి చేప యాడికెళ్తందో
గేలమేసి గుండె నొక్కేస్తే
పాన మేమో పాకమౌతుంది
కొడం తెచ్చి మాయ చేసేస్తే
చెరువులోకి చేప పోతుందా
కపర కపర చీకటవుతుంది
ఏటి నీళ్లకు ఎక్కిళ్లు అంటూ పాడిన పాట
చెరువు గుండెను సంద్రం చేసింది

నాయిన భుజాన బిడ్డెక్కినట్టు
కలుజు ఎక్కిన నీటి పాదాల సవ్వడి
నీ పాట లాగానే మాయమైంది
గుండెల్లో భూకంప అలజడి
దూరమైన చేపల దుఃఖమిలా
బతుకుతెర మీద ప్రత్యక్షం

ఇప్పుడు
రక్త సంబంధాల మధ్య
మైలు రాళ్లు
చుట్టపు చూపుకొచ్చే కళ్ళు లేవు
బంధాలకు విలువివ్వని
దాయాదులు
ఇంటికొచ్చి పలకరించే
నోళ్లు, గూట్లో చిక్కుకున్నాయ్

అమ్మను
పలకరించే అన్నదమ్ములేరి
నన్ను భుజానేసుకుతిరిగిన
మేనత్తలేరి
కురుస్తున్న వానకు
చేతులడ్డం పెట్టి
తొడునిలిచిన తోబుట్టువులేరి

అంత
ఎందుకు నాయనా
ఒకే రొమ్ము పాలు తాగిన
మా పెదాలు, మాట్లాడుకొని
మాపిటేళ కావొస్తోంది

నువ్వు
పాడిన పాటలో
చెరువు గుండె సంద్రం అయినట్టు

చెట్టు కొమ్మలు
విరుగుతున్న చప్పుడు
పైరులో
తెగులుపడ్డ దిగులు
కంటి ముందు
కపర కపర చీకటి

సుంకర గోపాలయ్య

94926 38547

ముగియని కాలంలో



ఏమో
నువ్వెప్పుడూ
ఏదో మాటాడాలని
మొదలు పెడతావు
ఇంతలో
ఒక పూవు రాలిపోతూ
నేలను తాకుతుంది
నెత్తురంటిన మట్టిని
దోసిలిలోకి తీసుకుని
హృదయానికి హత్తుకుంటావు
ఓ పసిపాప
ఊదారంగు గౌనుతో
ఎదురుగా చినిగిన
పుస్తకాలసంచీతో నడిచిపోతూ ఉంటుంది
ఆ పాదముద్రలను తాకుతూ
ఒరిగిపోతావు

మనుషుల కోసం
మరో మారు ఆర్తిగా
అన్వేషిస్తావు
మొండి గోడల మధ్య
బూడిద రాలిన చెట్ల ఆకులపై
వేలితో నిమురుతూ
ఏదో తెలియని ప్రాకృత భాషలో
రాసిపోతావు
అవునా
నన్నిలా
ఈ నిశ్శబ్ద శూన్యంలో వదిలేసిన
నిన్ను మరలా ఎలా పలికిలించగలను
యుద్ధమెప్పుడూ ముగియని
కాలంలో

కెక్యూబ్ వర్మ

94934 36377

కరుణ కుమార కథల్లో నిశితమైన దళిత స్పృహ

వందల సంవత్సరాల కుల చరిత్ర బ్రిటిష్ వలస పాలనలో ఆధునికమవుతున్న భారత దేశంలో మొదటిసారిగా ప్రశ్నింపబడింది. ఇంగ్లీషు విద్యా ఉద్యోగాల వల్ల, ఆధునిక ప్రాపంచిక విజ్ఞాన శాఖల పరిచయం వల్ల పెరిగిన హేతుబద్ధ మానవీయ దృష్టి ఇందుకు దోహదపడింది. ఈ నేపథ్యంలో జ్యోతిబా పూలే 1873-74లలో సత్యశోధక సమాజాన్ని స్థాపించి కుల వ్యవస్థ మూలాలకు, ఉనికికి సంబంధించిన చర్చ ప్రారంభించాడు. 1910 నాటికి శివరామ్ కాంబ్లే నిమ్న జాతుల వారి మహాసభను ఏర్పాటు చేశాడు. కర్మ వీర్ షిండే- నారాయణ్ గణేష్ చందావర్కర్ సహకారంతో దళిత జాతుల సేవా సంఘం స్థాపించాడు. ఆ సమయంలోనే హిందూ మత సంస్కరణ కొరకు బ్రహ్మ సమాజం, ఆర్య సమాజం ఏర్పడి దళితుల ఆత్మగౌరవ చైతన్యానికి అభివృద్ధికి కారణమయినాయి. 1917లో కలకత్తా కాంగ్రెస్ సమావేశం దళితుల అభివృద్ధిని కోరుతూ అస్పృశ్యతను నిరసిస్తూ తీర్మానాలు చేసింది. 1920 నుండి జాతీయోద్యమ రాజకీయాలలో అస్పృశ్యతా నివారణ ప్రధాన అంశమయింది. 1923 తరువాత హరిజనోద్యమ నిర్మాణం ప్రముఖంగా ముందుకు వచ్చింది. 1924లో డా. బి.ఆర్ అంబేడ్కర్ అస్పృశ్యతా నివారణోద్యమాన్ని ప్రారంభించాడు.

ఈ తరుణంలో భిన్న కులాల సమూహాల అనుభవాల వ్యక్తీకరణకు వాతావరణం సిద్ధమై తెలుగు సాహిత్యం దళిత చైతన్యాన్ని ప్రతిఫలింప చేయడం అత్యంత సహజంగా ప్రారంభమైంది. అగ్రకులాల ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తూ, తిరస్కరిస్తూ స్వీయ జీవితానుభవాలతో తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తున్న వాళ్లు దళిత బహుజనులే కాక ఇతర వర్గాల నుండి అనేకమంది ఉన్నారు. 1934 నుంచి 1968 వరకు గల కాలాన్ని దళిత కథల ప్రాథమిక దశగా విమర్శకులు గుర్తించారు. శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిని ఈ విభాగంలో మొదటి కథకుడిగా భావిస్తున్నాం.

ఈ దశలోనే అభ్యుదయ దృక్పథంతో దళితుల పక్షం వహించి కథలను రచించిన వారు కరుణకుమార. వీరి అసలు పేరు కందుకూరి అనంతం. అరసం గుంటూరు శాఖ ఈమధ్య కథా స్రవంతి పేరుతో పదిమంది ప్రసిద్ధ రచయితల కథా సంపుటాలను విడుదల చేసింది. అందులో ఒకటైన 'కరుణకుమార కథలు' సంపుటి దళిత బహుజన వాదాన్ని బలంగా వినిపించి ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ కథలు 1934-1956 మధ్యకాలంలో రచింపబడినాయి.

'పోలయ్య' కథ అస్పృశ్యతకు సంబంధించినది. రాత్రిపూట రైలు దిగిన బ్రాహ్మణుడు పోలయ్య బండి తీయడానికి సుముఖంగా లేకపోయినప్పటికీ ఎక్కువ డబ్బును ఇస్తానని నానారకాలుగా ఒప్పించి ఊర్లోకి వెళ్లడానికి బండి ఎక్కుతాడు. దారి మధ్యలో జరిగిన సంభాషణలో పోలయ్య దళితుడని తెలుసుకొని గ్రామానికి చేరిన తరువాత గ్రామ పెద్దలతో కలిసి అతన్ని హింసిస్తాడు. కానీ పోలయ్య ప్రాణాపాయ పరిస్థితులలో తన పేరు పౌలయ్య అని తాను క్రైస్తవుడనని చెప్పి ప్రమాదం నుండి తప్పించుకుంటాడు. అది బ్రిటిష్ పాలనా కాలం గనుక ఫాదర్‌లకి సర్కారు వారికి చాలా స్నేహం ఉంటుందని గ్రామ పెద్ద నాయుడు శిక్షించడానికి వెనుకంజ వేస్తాడు. ప్రభువుల మతం క్రైస్తవం కనుక ఆ మతాన్ని నిందిస్తే ప్రభువును నిందించినట్లేనని బ్రాహ్మణుడు తప్పుకుంటాడు. దళిత స్త్రీ శ్రమను ఆమె కుటుంబపోషణ బాధ్యతను ఎలా తీసుకుంటుందో యంత్రాలు మనుషుల ఉపాధిని ఎలా పోగొడతాయో పోలయ్య పాత్ర సంభాషణ ద్వారా రచయిత తెలియజేస్తాడు. రాజ్యాధికారం ప్రభావం ఎలా ఉంటుందో సంప్రదాయాలు కట్టుబాట్లు ఎలా విడిపోతాయో విశదపరుస్తుందీ కథ. కుల వ్యవస్థ చేత తిరస్కరించబడి బహిష్కరించబడిన దళితులకు క్రైస్తవ మిషనరీలు మతమార్పిడి ద్వారా సామాజిక గౌరవాన్ని కల్పించడాన్ని ఈ కథ స్పష్టపరుస్తుంది.



కుల వివక్షతలు, వర్గ వైరుధ్యాలు, అధికార ఆర్థిక ఆధిపత్యాలు పోయి సాంఘిక సమానతా సంస్కృతి పరిపూర్ణంగా వికసించాలని దళిత సాహిత్యపు తొలినాళ్లలోనే మనసులని కదిలించేలా చిత్రించినవి కరుణ కుమార కథలు.

దళిత స్త్రీల దుస్థితిని చిత్రించిన కథ 'పశువుల కొఠం'. అంటరాని వాళ్ళుగా పరిగణిస్తూనే హీనంగా చూస్తూనే దళిత మహిళలని చెరపట్టే అగ్రకుల ఆధిపత్య పురుషాహంకారాన్ని, అందుకు వారి ప్రయత్నాలను పన్నే కుట్రలను కళ్ళముందు ఉంచుతుందీ కథ. పెంచలి, రొబ్బడు ఒకరినొకరు ప్రేమించుకుంటారు. పెళ్లి చేసుకోవాలనుకుంటారు. రాయుడు పెంచలిని లొంగదీసుకోవాలని ప్రయత్నిస్తాడు. ఆమె తిరస్కరిస్తుంది. రొబ్బడు పోలీసు సూపరిండెంట్ వద్ద గుర్రాన్ని చూసుకుంటూ ఉంటాడు. సూపరిండెంట్ అనుమతితో తన పెళ్లిలో ఆ గుర్రం మీద ఊరేగాలనుకుంటాడు. దీనిని అడ్డుకోవడం కోసం రాయుడు బహుజనుల ఐక్యతను దెబ్బతీసేలా రెచ్చగొట్టి ప్రేరేపిస్తాడు. పెంచలి రొబ్బడుల పెళ్లి విషయం తెలుసుకున్న రాయుడు పన్నిన కుట్రతో రొబ్బడి చేతిలోనే పెంచలి ప్రాణాలు పోయేంతగా దెబ్బలు తిని మతిభ్రమణకు చేరువై పడిపోతుంది.

'కయ్య - కాలువ' ఒక దళిత రైతు కథ. వంద ఎకరాల భూమికి యజమానురాలైన లక్ష్మమ్మ ఆమె పొలం పక్కన కొండడు అనే దళితునికి అర్థ ఎకరం పొలం ఉండడాన్ని భరించలేక దాన్ని తన పొలంలో కలిపేసుకోవడానికి కొండడిని అనేక విధాల పీడిస్తుంది. ఆ పొలాన్ని కాపాడుకోవాలని పట్టుదలతో మంచి పంట పండిస్తాడు. లక్ష్మమ్మ బంధువులతో కలిసి కుట్ర చేసి దొంగతనం నింద మోపి కేసు పెట్టి అపరాధం వేయిస్తుంది. చివరకు పంటకు అగ్గి పెట్టిస్తుంది. కాలిపోతున్న పంటను చూసి కుప్పకూలిపోతాడు కొండడు.

ఆధిపత్య కుల పీడన మీద దళితుల తిరుగుబాటు కథ 'కొత్త చెప్పులు'. కొత్త చెప్పులు కుట్టి తీసుకురావడంలో ఒకరోజు ఆలస్యమైందని నరిసి అనే దళిత మహిళను చిన్నపరెడ్డి కొడతాడు. ఆమె చనిపోవడంతో బావిలో పడవేయిస్తాడు. విషయం తెలుసుకున్న దళితులు అతని ఎద్దు చనిపోతే తీసుకుపోవడానికి రారు. చివరికి అగ్రకులాల వారు గ్రామంలోని వారు కలిసి ఎద్దును పూడ్చవలసి వస్తుంది. నరసి కుట్టించిన కొత్త చెప్పుల వల్ల కాళ్ల పుండుపడి ఆసుపత్రిపాలై చిన్నపరెడ్డి ప్రాణం వదులుతాడు.

విద్యావంతులైన దళితులు కూడా కులవివక్షతను వర్గ వైరుధ్యాలను ఎదుర్కొనక తప్పలేదని తెలిపే కథ 'టార్చిలైట్'. జకరయ్య అనే దళిత ఉపాధ్యాయుడు ఉత్తర్వులను అనుసరించి తప్పని స్థితిలో సంపన్నుల దగ్గర విరాళాలు సేకరించి ఆటల పోటీలు నిర్వహిస్తాడు. బహుజనుల పిల్లలే బహుమతులన్నీ గెలుచుకుంటారు. అగ్రకులాల వారి ఒత్తిడితో పిల్లల బహుమానాలను తిరిగి తీసుకుంటాడు. వాటిని గ్రామపెద్ద పెద్దిరెడ్డి స్వాధీనంలో పెట్టుకుంటాడు. కానీ టార్చ్‌లైట్‌ను బహుమతిగా పొందిన విద్యార్థి తిరిగి ఇవ్వడు. కథ మలుపులు తిరిగి చివరికి జకరయ్య విధులకు అనర్హుడిగా తీర్మానించబడి ఉద్యోగం నుండి తొలగించబడతాడు.

దళిత కథల్లో తొలి తరానికి సంబంధించినవి కాబట్టి చాలా కథల్లో ధిక్కారం లేకపోవడం, కేవలం కారుణ్యం మాత్రమే చిత్రించగలిగిన పరిస్థితి ఈ కాలపు పాఠకులను కలచి వేస్తుంది. కుల వివక్షతలు, వర్గ వైరుధ్యాలు, అధికార ఆర్థిక ఆధిపత్యాలు పోయి సాంఘిక సమానతా సంస్కృతి పరిపూర్ణంగా వికసించాలని దళిత సాహిత్యపు తొలినాళ్లలోనే మనసులని కదిలించేలా చిత్రించినవి కరుణ కుమార కథలు.

కాచాపురం దుర్గాదేవి

78930 93495

'విభజిత' కథా సంపుటి

విజయ భండారు కథా సంపుటి 'విభజిత' ఆవిష్కరణ సభ జనవరి 18 సా.6గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. సభలో ఓల్గా, శీలా సుభద్రాదేవి, మామిడి హరికృష్ణ, వి. సంధ్య, మానస ఎండ్లూరి, నందిగాం నిర్మల పాల్గొంటారు.

హస్మిత ప్రచురణలు

బాలల కథా సంకలనాలకు ఆహ్వానం

తెలంగాణ సారస్వత పరిషత్తు వెలువరిస్తున్న 'బాల సారస్వతం' పరంపరలో ప్రచురించే బాల కథా సంకలనాల కోసం కథలను ఆహ్వానిస్తున్నాం. బాలల మూర్తిమత్వ వికాసం, పర్యావరణ పరిరక్షణ, కుటుంబ బాంధవ్యాలు తదితర అంశాలను స్వీకరించి ఏ4 సైజులో ఒకటిన్నర పేజీకి మించకుండా టైప్ చేసి పంపాలి. కథలను జనవరి 20లోగా ఈమెయిల్: telanganasaraswathaparishath@gmail.com కు పంపాలి. మరిన్ని వివరాలకు ఫోన్: 88852 45234.

జె. చెన్నయ్య

కథా సంపుటాలకు ఆహ్వానం

కందికొండ రామస్వామి స్మారక పురస్కారం కోసం 2023లో ముద్రితమైన కథా సంపుటాలను పంపాలి. బహుమతి పొందిన సంపుటికి నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక తరపున ఏప్రిల్‌లో పదివేల రూపాయల నగదు, పురస్కారం, జ్ఞాపిక ప్రదానం జరుగును. మీ కథా సంపుటాలు మూడేసి ప్రతులను జనవరి 31లోగా చిరునామా: అబ్దుల్ వహీద్ ఖాన్, ఇంటి నెం. 15-120/4/1, రహత్ నాగర్ కాలనీ, నాగర్ కర్నూల్ - 509209, తెలంగాణకు పంపాలి. వివరాలకు: 94927 65358.

వనపట్ల సుబ్బయ్య

నవలలకు ఆహ్వానం

రజనీశ్రీ రాష్ట్ర స్థాయి సాహిత్య పురస్కారానికి నవలలను ఆహ్వానిస్తున్నాం. ఈ పురస్కారం కింద ప్రశంసా పత్రం, శాలువాతో పాటు రూ.10,116/- నగదు ఉంటుంది. రచయితలు జనవరి 1, 2014 నుంచి డిసెంబర్ 31, 2023 మధ్య ముద్రితమైన వారి సొంత నవలలు నాలుగు ప్రతులను ఫిబ్రవరి 10లోగా చిరునామా: గాజుల రవీందర్, ఇం.నెం.: 8-3-255/1, రామచంద్రాపూర్ కాలనీ, రోడ్ నంబర్ 12, భగత్ నగర్, కరీంనగర్ - 505001కు పంపాలి. మరిన్ని వివరాలకు ఫోన్: 98482 55525.

గాజుల రవీందర్

దళిత ప్రేమ కథలకు ఆహ్వానం

గత ఏడాది మార్జిన్స్ ప్రచురణల నుంచి మేం తెచ్చిన దళిత కథల సంకలనం 'ముళ్ళ చినుకులు'కి వచ్చిన స్పందనతో చేస్తున్న మరో ప్రయత్నం దళిత ప్రేమ కథల సంకలనం. దళిత, దళితేతర రచయితలందరి నుంచి కథలను ఆహ్వానిస్తున్నాం. దళిత, ఇతర కులాల మధ్య చిగురించిన ప్రేమకథలే వస్తువు. చివరి తేదీ ఏప్రిల్ 30. డిటిపి చేసిన కథని ఓపెన్ ఫైల్లో ఈమెయిల్: dalitapremakathalu@gmail.com కు ఈ మెయిల్ చెయ్యాలి.

మానస ఎండ్లూరి, అరుణ గోగులమండ

ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.4 కనిష్ఠం 18.7

సందడే..సందడి

- రోడ్లన్నీ ఖాళీ.. ● బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో తగ్గని రద్దీ
- కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్‌కు సందర్శకుల తాకిడి
- పర్యాటక ప్రాంతాలకూ వెల్లువలా జనం





కైట్ ఫెస్టివల్‌లో..





గంగిరెద్దు ఆశీర్వాదం తీసుకుంటున్న మహిళ



పతంగి ఎగురవేస్తున్న మహిళ

హైదరాబాద్ సిటీ, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): నగర వాసులు సంక్రాంతి పండగకు పల్లెబాట పట్టడంతో నగరం ఖాళీ అయింది. ఎప్పుడూ వాహనాలతో నిండి.. హారన్ మోతలతో హోరెత్తించే రోడ్లు ఆదివారం చాలా వరకు ఖాళీగా దర్శనమిచ్చాయి. నిత్యం రద్దీగా ఉండే రోడ్లలోనూ అప్పుడప్పుడు ఒకటి రెండు వాహనాలు వచ్చి వెళ్లడం కనిపించింది. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో ఆదివారమూ రద్దీ కనిపించింది. స్వగ్రామాలకు వెళ్లగా మిగిలిన వారు నగరంలోనే పండగ ఘనంగా జరుపుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.

మరో పక్క కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్‌కు సందర్శకులు భారీగా తరలివచ్చారు. నుమాయిష్ కూడా జనంతో కిటకిటలాడింది. శనివారం రాత్రి నుంచే పలుచోట్ల భోగిమంటలు వేశారు. గేటెడ్ కమ్యూనిటీలు సహా బస్తీ కూడళ్లలో భోగి మంటలు వేశారు. ఆలయాల్లో గోదారంగనాథుల కల్యాణం కమనీయంగా జరిగింది. శిల్పారామాల్లో సంక్రాంతి సంబురాల్లో భాగంగా గంగిరెద్దుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.



సికింద్రాబాద్‌లో భోగి మంటలు వేస్తున్న పంజాబీ సేవా సమితి సభ్యులు



నెక్లెస్ రోడ్డులో

పర్యాటక ప్రాంతాల్లో రద్దీ

హైదరాబాద్ సిటీ, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి నేపథ్యంలో రహదారులు ఖాళీగా కనిపించగా.. పర్యాటక ప్రాంతాల్లో సందడి నెలకొంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయం, ఎన్‌టీఆర్ గార్డెన్, అంబేడ్కర్ విగ్రహం వద్ద రద్దీ కనిపించింది. నెక్లెస్ రోడ్, లుంబిని, సంజీవయ్య పార్కుల్లో సందర్శకులు పెరిగారు. పండగ సెలవులు ఉండడంతో కుటుంబ సమేతంగా ఆయా ప్రాంతాలకు వచ్చిన ప్రజలు సరదాగా గడిపారు. ఫొటోలు దిగేందుకు ఆసక్తి చూపారు. చార్మినార్, గోల్కొండ కోటలోనూ సందర్శకుల సంఖ్య పెరిగినట్టు అక్కడి సిబ్బంది తెలిపారు. మల్టీప్లెక్స్, మాల్స్‌లోనూ జనం కనిపించారు.



సంక్రాంతి జోష్

హైదరాబాద్, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా ఆకాశంలో పతంగులు రెపరెపలాడాయి. నెక్లెస్ రోడ్ పీపుల్స్ ప్లాజాతోపాటు పలు ప్రాంతాల్లో చిన్నా, పెద్ద పతంగులు ఎగురవేసి సందడి చేశారు. సంక్రాంతి పాటలతో యువత డ్యాన్స్‌లు చేస్తూ సంబరాల్లో పాల్గొన్నారు. బస్తీలు, కాలనీల్లో ప్రజలు భవనాలపై డీజే పాటలతో పోటీ పడుతూ పతంగులు ఎగురవేస్తూ రోజంతా కుటుంబ సభ్యులతో ఉత్సాహంగా గడిపారు.

మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ ఎదుట ముగ్గులు వేస్తున్న మహిళా కానిస్టేబుళ్లు



విద్యుత్ అంతరాయాలు లేకుండా చర్యలు

8

సిలబస్ 60 శాతమే..



8

బల్దియా.. డిప్యుటేషన్ మాయ..!

- ఒకసారి వస్తే ఇక్కడే తిష్ట
- ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో సంస్థ
- అదనపు ఖర్చులతో మరిన్ని ఇబ్బందులు



హైదరాబాద్ సిటీ, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థ ఏదైనా అవసరాన్ని బట్టి ఉద్యోగులను నియమించుకుంటుంది. కానీ, జీహెచ్‌ఎంసీలో మాత్రం పూర్తి భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. సంస్థ అవసరం కోసం కాకుండా.. తమ అవసరార్థం అధికారులు, ఉద్యోగులు ఇక్కడికి వస్తున్నారు. దీంతో కాసుల కష్టాలున్న సంస్థపై ఆర్థిక భారం మరింత పెరుగుతోంది. అప్పులున్న బల్దియా.. పొదుపు ఆలోచన చేయకుండా డిప్యుటేషన్‌పై వచ్చే వారికి ఎర్ర తివాచీ పరిచి స్వాగతం పలుకుతోంది. కొందరు ఉన్నతాధికారులు ఇతర విభాగాల్లోని నచ్చిన అధికారులను సంస్థకు తీసుకొస్తుంటే.. ఇంకొందరు పైరవీల ద్వారా జీహెచ్‌ఎంసీకి వస్తున్నారు. ఇలా వచ్చిన వారిలో కొందరికి ఏ బాధ్యతలూ అప్పగించకపోవడం గమనార్హం. మరి కొందరికి లేదనకుండా చిన్నా, చితక పనులు అప్పగిస్తున్నారు. దీంతో అసలే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సంస్థకు వేతనాల చెల్లింపు గుదిబండలా మారుతోంది. డిప్యుటేషన్‌పై వచ్చిన అధికారులకు సదుపాయాల కల్పన మరింత భారమవుతోంది. బల్దియా ప్రస్తుతం ప్రతినెలా వేతనాలు, పెన్షన్లకు రూ. 120-130 కోట్లు చెల్లించాల్సి వస్తోంది. ఆ స్థాయిలో ఆదాయం వస్తోన్న దాఖలాలు లేవు. రోడ్ల నిర్మాణం, నాలాల పూడికతీత తదితర పనులు చేసిన కాంట్రాక్టర్లకు ఏడాదిగా సంస్థ బిల్లులు చెల్లించడం లేదు. ఆ బకాయిలు రూ. 1000 కోట్ల వరకు పేరుకుపోయాయి. అదే సమయంలో పని లేకున్నా.. అవసరాల కోసం వస్తోన్న అధికారుల సంఖ్య జీహెచ్‌ఎంసీలో రోజురోజుకూ పెరుగుతుండడం చర్చనీయాంశమైంది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రెవెన్యూ విభాగానికి చెందిన దాదాపు 12 మంది డిప్యూటీ కలెక్టర్లు జీహెచ్‌ఎంసీకి డిప్యుటేషన్‌పై

మిగతా 8వ పేజీలో..

నకిలీ ఆధార్‌లు సృష్టించి బ్యాంకు ఖాతాలు

- ఉద్యోగాల పేరుతో రూ. కోట్లు కాజేసిన కేటుగాళ్లు
- నగరవాసికి రూ. 4.75 లక్షలు టోకరా
- ఇద్దరి అరెస్ట్.. పరారీలో ప్రధాన నిందితుడు
- ఖాతాలో రూ. 6 లక్షలు ఫ్రీజ్

హైదరాబాద్ సిటీ, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): నకిలీ ఆధార్‌కార్డులు, పాన్‌కార్డులు సృష్టించి.. పలు సంస్థల పేరుతో బ్యాంకు ఖాతాలు తెరిచి, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, ఇన్వెస్ట్‌మెంట్స్ పేరుతో మోసాలకు పాల్పడుతూ.. రూ. కోట్లు కొల్లగొడుతున్న హరియాణా సైబర్ ముఠా ఆటకట్టించారు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు. ఇద్దరిని అరెస్ట్ చేశారు. మరో ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నాడు. వారు తెరిచిన బ్యాంకు ఖాతాల్లో రూ. 6 లక్షలు ఫ్రీజ్ చేశారు. సిటీ జాయింట్ సీపీ (క్రైమ్స్) ఏవీ రంగనాథ్ వివరాలు వెల్లడించారు.

హరియాణా రాష్ట్రం ఫరీదాబాద్ ప్రాంతానికి చెందిన హిమాన్షు, ప్రవీణ్, దేవేందర్ ముఠాగా ఏర్పడ్డారు. సులభంగా డబ్బు సంపాదించాలని పథకం వేశారు. హిమాన్షు, ప్రవీణ్‌కు గతంలో ఆధార్ కేంద్రాల్లో పని చేసిన అనుభవం ఉంది. ప్రవీణ్‌కు సొంతంగా ఆధార్ నమోదు సెంటర్ ఉంది. ఈ క్రమంలో నకిలీ ఆధార్, పాన్‌కార్డులు సృష్టించి దేవేందర్‌కు ఇచ్చే వారు. వాటితో దేవేందర్ వివిధ బ్యాంకుల్లో పలు రకాల సంస్థల

మిగతా 8వ పేజీలో..

లష్కర్‌పై నజర్

- సీటును కైవసం చేసుకునేందుకు తహతహ
- పట్టుబిగించాలని మూడు పార్టీల కసరత్తు

8




కాజల్ పితిలియాకు చాదర్‌తో స్వాగతం పలుకుతున్న సాధుమార్గ్ జైన్ సంఘ్ నేతలు


జైన సన్యాసినిగా నగర యువతి

- ఈనెల 22న మధ్యప్రదేశ్‌లో స్వీకారం

కవాడిగూడ, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన మరో యువతి జైన దీక్ష స్వీకరించనున్నారు. కాచిగూడలో నివసిస్తున్న విజేందర్ పితిలియా కుమార్తె కాజల్ పితిలియా ఈనెల 22న మధ్యప్రదేశ్ జావెద్‌లో గురు రాంలాల్‌జీ మహారాజ్ సమక్షంలో సన్యాసినిగా దీక్ష చేపట్టనున్నారు. 27 ఏళ్ల కాజల్ బీకాం ఇంటీరియర్ డిజైనింగ్ కోర్సు పూర్తి చేశారు. ఏడాదిగా రాంలాల్‌జీ మహారాజ్ వద్ద శిక్షణ

మిగతా 8వ పేజీలో..









అస్వస్థతకు గురైన వారిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

షవర్మా తిని నలుగురికి అస్వస్థత

● హోటల్ నిర్వాహకులకు నోటీసులు

అల్వాల్, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): అల్వాల్ లోతుకుంటలోని గ్రిల్ హౌజ్ హోటల్‌లో షవర్మా తిని నలుగురు అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. శనివారం మధ్యాహ్నం బొల్లారం ప్రాంతానికి చెందిన భావికొరెడ్డి, మున్నాతో పాటు మరో ఇద్దరు యువతులు గ్రిల్ హౌజ్ హోటల్‌లో షవర్మా తిన్నారు. ఇంటికెళ్లిన గంట తరువాత వారికి వాంతులు, విరోచనాలు మొదలై అనారోగ్యానికి గురయ్యారు. వెంటనే వారిని కుటుంబ సభ్యులు సుచిత్రలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కలుషితమైన షవర్మా తినడంవల్లే నలుగురు అనారోగ్యానికి గురయ్యారని వైద్యులు నిర్ధారించారు. ఈ క్రమంలో స్థానికులు అల్వాల్ సర్కిల్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్‌కు గ్రిల్ హౌజ్ హోటల్‌పై ఫిర్యాదు చేశారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ కోసం రాగా హోటల్ యజమాని పరారయ్యాడు. హోటల్ నిర్వాహకులకు నోటీసులు అందించినట్లు అధికారులు పేర్కొన్నారు.

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

షవర్మా తిని అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఫుడ్ పాయిజన్‌కు కారణమైన హోటల్‌పై చర్యలు తీసుకోవాలని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్‌కు ఎమ్మెల్యే సూచించారు.

ఏవోసీ సెంటర్‌లో వెటరన్స్ డే ఉత్సవాలు

అల్వాల్, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఆంధ్రా సబ్‌ఏరియా ఆధ్వర్యంలో ఆదివారం ఏవోసీ సెంటర్‌లో 8వ వెటరన్స్ డే వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారత రక్షణశాఖ సహాయ మంత్రి అజయ్‌భట్ ముఖ్యఅతిథిగా హాజరై మాజీ సైనికులను, వీరనారీలను సత్కరించారు. దేశ సేవలో తమ ప్రాణాలను అర్పించిన వీరసైనికులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సైనికులకు, మాజీలకు మకర సంక్రాంతి, పొంగల్ శుభాకాంక్షలు తెలిపారు.



వీరనారీలను సత్కరిస్తున్న భారత రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్‌భట్



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

'ఇండో-నేపాల్' పోటీల్లో భారత్ జయకేతనం

అడ్డగుట్ట, జనవరి 14 (ఆంధ్రజ్యోతి) : నేపాల్‌లోని పోఖరా స్టేడియంలో ఈ నెల 13న జరిగిన ఇండో-నేపాల్ ఆరో ఇంటర్నేషనల్ చాంపియన్ షిప్ బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్ విభాగాల్లో భారత జట్టు విజయాలు సాధించింది. బ్యాడ్మింటన్ సింగిల్స్, డబుల్స్‌లో రెండో స్థానం, బాస్కెట్ బాల్‌లో మొదటి స్థానంలో నిలిచింది. గెలుపొందిన జట్లలో తెలంగాణకు చెందిన క్రీడాకారులు సాయిరామ్, వజాహత్ ఉన్నారు. బాస్కెట్ బాల్ జట్టుకు తెలంగాణ క్రీడాకారిణి గాయత్రి నేతృత్వం వహించారు. ఎస్‌డీపీఎఫ్ ఇండియా- కోచ్‌లు అద్నాన్ అహ్మద్ అలీ అమూడీ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు.

చైనా మాంజాకు తట్టుకుని గద్ద విలవిల

నార్సింగ్, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): షేక్‌పేట్ లేక్వ్యూ టౌన్‌షిప్‌లో ఓ గద్ద చైనా మాంజాకు తట్టుకుని తల్లడిల్లిపోయింది. కాళ్లకు, రెక్కలకు చైనా మాంజా చుట్టుకొని ఎగరలేని స్థితిలో షేక్‌పేట్‌లోని లేక్వ్యూ కాలనీలోని ఓ ఇంటి గేటుపై దీనంగా కూర్చుండిపోయింది. గమనించిన ఆ ఇంట్లోని వారు పలు ఎన్‌జీవో సంస్థలకు, ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి వచ్చిన ఫారెస్ట్ అధికారులు, ఆ కుటుంబ సభ్యులు కలిసి గద్దను పట్టుకుని మాంజా తొలగించి, జూపార్కుకు తరలించారు.



చైనా మాంజాకు చిక్కుకున్న గద్దను రక్షించిన ఫారెస్ట్ అధికారి, స్థానికుడు

హఫీజ్‌బాబానగర్‌లో చైనా మాంజా పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న నిషేధిత చైనా మాంజా, చెరఖాలు

చంపాపేట, జనవరి 14(ఆంధ్రజ్యోతి): హఫీజ్‌బాబానగర్‌లో పోలీసులు నిషేధిత చైనా మాంజాను స్వాధీనం చేసుకున్నారు. కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హఫీజ్‌బాబానగర్ ఉమరకాలనీలో నిషేధిత చైనా మాంజాను విక్రయిస్తున్న ఎండీ.సమీర్(23)ను ఆదివారం అదుపులోకి తీసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి తెలిపారు. అతని నుంచి చైనా మాంజాతో ఉన్న 2 చిన్న చెరఖాలు, 2 పెద్ద చెరఖాలు, పలు మాంజా ప్యాకెట్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్న ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

చెట్ల పొదల్లో మహిళ మృతదేహం

గాజులరామారం, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని నిర్మానుష్య ప్రాంతంలో గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సూరారం, శివాలయనగర్ శ్రీదుర్గాభవానీ అమ్మవారి గుడి వెనుక చెట్లపొదల్లో కుళ్లిన స్థితిలో ఉన్న మహిళ మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి కాలికి మెట్టెలు ఉన్నాయని, వయస్సు 45 సంవత్సరాలు ఉంటుందని, మూడు, నాలుగు రోజుల క్రితం మృతి చెంది ఉండొచ్చని సీఐ వెంకటేశ్వరావు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.



సంక్రాంతి సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు ఎస్పీ క్రాంతికుమార్, ఎస్.శైలజ దంపతులు రాజన్నబావి ఫలక్‌నుమా సమీపంలోని రెయిన్‌బో హోమ్ అనాథ బాలికల నిలయంలో బాలికలకు గాలిపటాలు, నువ్వుల లడ్డూలు పంచిపెట్టారు. ఎస్.ప్రణీత్, రితేశ్, శ్రీవాస్తవ్, రెయిన్‌బో హోం సిబ్బంది పాల్గొన్నారు.

- చాంద్రాయణగుట్ట, ఆంధ్రజ్యోతి



గౌలిపురా హనుమాన్ నగర్‌లో చిన్నారులకు పతంగులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ ప్రెసిడెంట్ మామిడాల శ్రీనివాస్

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/ICwg7Ekలో చదవండి.

Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.

నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.



సంక్రాంతి పండుగ పురస్కరించుకొని ఆదివారం గాంధీభవన్‌లో తెలంగాణ కాంగ్రెస్ ఫిషర్మెన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి ముఖచిత్రంతో తయారు చేసిన గాలిపటాలను చిన్నారులకు అందజేశారు. కార్యక్రమంలో కె.ఎస్.ఆనంద్ రావు తదితరులు పాల్గొన్నారు.

-అఫ్జల్‌గంజ్, ఆంధ్రజ్యోతి

ఆనందోత్సాహాలతో భోగి వేడుకలు



హైదర్‌గూడలో భోగి మంటల వద్ద మహిళలు



బాబుల్‌రెడ్డినగర్‌లో భోగి మంటలు వేస్తున్న యువకులు



బుద్వేల్‌లో గాలిపటాల దుకాణాలు

రాజేంద్రనగర్, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు ముందు రోజు భోగి పండుగను రాజేంద్రనగర్ సర్కిల్‌లో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రజలు ఎక్కువగా నివాసం ఉండే హైదర్‌గూడ పరిసర కాలనీలతో పాటు బుద్వేల్ గ్రీన్ సిటీ, బవానీ కాలనీ, పద్మశాలి పురం, శివానగర్, ఉప్పర్‌పల్లి పరిసర కాలనీలలో తమ ఇళ్ల ముందు ఆదివారం ఉదయమే భోగి మంటలు వేసుకున్నారు. బాబుల్‌రెడ్డినగర్, బుద్వేల్ ప్రాంతాలలో సైతం భోగి మంటలు వేశారు. యువకులు ఇళ్ల పైనుంచి గాలిపటాలు ఎగురవేసి పండుగ చేసుకున్నారు.

పాతబస్తీలో

చాంద్రాయణగుట్ట, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): పాతబస్తీలో ఆదివారం భోగి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మూడు రోజులపాటు సాగే సంక్రాంతి పండుగలో మొదటి రోజు భోగి పండుగను హిందువులు తమ ఇండ్లలో భోగి మంటలు వేసి చిన్న కుండలలో పాలు పొంగించి చిన్న పిల్లలకు రేగుపళ్ళు, చెరుకు గడలు, జీడిపళ్లు, నవధాన్యాలు తదితర వస్తువులతో కూడిన భోగి పండ్లు పోశారు.

మహిళలు తమ ఇళ్లముందు అందమైన ముగ్గు వేసి ఆవు పేడతో గొబ్బెమ్మలు పెట్టి వాటిపై భోగి పండ్లు పోశారు.

మదీన, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): పాతబస్తీ, శివారు ప్రాంతాలలో పతంగులు, ముగ్గుల పోటీలతో భోగి పండుగను ఆనందంగా జరుపుకుంటున్నారు. ఇళ్ల ముందు ముగ్గులు, గొబ్బెమ్మలను ఏర్పాటు చేశారు. ఆకాశంలో పతంగుల సందడి కనిపిస్తోంది.



జంగమ్మెట్‌లో గాలిపటాలు పంపిణీ చేస్తున్న టీపీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి పర్వతాల రాజేందర్



పతంగులతో సందడి చేస్తున్న మహిళలు



ఇంటి ముందు గొబ్బెమ్మలు పెడుతున్న మహిళ

వైభవంగా గోదా రంగానాథ స్వామి కల్యాణం

రాజేంద్రనగర్, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం చివరి రోజున గోదాదేవీ రంగనాథ స్వామి కల్యాణ మహోత్సవాలను వైష్ణవ దేవాలయాలల్లో ఘనంగా నిర్వహిస్తారు. అందులో భాగంగా రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవుపల్లి డివిజన్ టీఎన్‌జీవోస్ కాలనీలో శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం శ్రీగోదా రంగనాథ స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు.

గోదా దేవీ, రంగనాథ స్వామి దేవతామూర్తుల విగ్రహాలను భక్తులు దేవాలయ పరిసర ప్రాంతాల్లో ఊరేగించారు. మహిళలు కోలాటం ఆటలతో ముందు నడవగా, పల్లకిపై గోదా రంగనాథ స్వాములు ఉత్సవ మూర్తులను ఊరేగించి కల్యాణ మహోత్సవానికి తీసుకువెళ్లారు. అనంతర మహిళల దీపారాధన కార్యక్రమం కనులపండువగా జరిగింది. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ ప్రతినిధి పులిజాల వివేకానంద మాట్లాడుతూ, ధనుర్మాసం నెల రోజుల పాటు భక్తి శ్రద్ధలతో పూజలే చేసే భక్తులు చివరి రోజున స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. వందల సంఖ్యలో భక్తు లు కల్యాణ మహోత్సవం పాల్గొని స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారని తెలిపారు.



గోదా రంగనాథుల కల్యాణంలో భక్తులు, స్వామి వారికి దీపారాధన చేస్తున్న మహిళలు



ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

భారత్ జోడో న్యాయ్ యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

- చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు

యాకుత్‌పుర, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్ర ప్రారంభం సందర్భంగా పాతబస్తీ కాంగ్రెస్ నాయకుడు, చార్మినార్ నియోజకవర్గం మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేష్ చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో కులమతాల ఆధారంగా ప్రజలను విడగొడుతున్న బీజేపీ వైఖరిని ఎండగడుతూ దేశ ప్రజలందరు ఒక్కటే అనే సందేశాన్ని ఇస్తూ ఏకత్వ భావన పెంపొందించడానికి గత సంవత్సరం రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టారని వివరించారు. ఈ క్రమంలో భారత్ జోడో న్యాయ్ యాత్ర విజయవంతం కావాలని చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాజీవ్ గాంధీ పేరుమీద ఆలయంలో అర్చనలు చేయించారు. కార్యక్రమంలో నాయకులు కె.సురేష్ బాబు, జి.శ్రీనివాస్, వై.నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.



భారత్ జోడో న్యాయ్ యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకుడు వెంకటేష్, తదితరులు

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

రాజేంద్రనగర్, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. వట్టెపల్లి గుంతల్‌బాబా దర్గా ప్రాంతానికి చెందిన మహ్మద్ మాజీద్‌కు ఎలక్ట్రికల్ దుకాణం ఉంది. అతను స్థానికంగా ఉండే కాలు అలియాస్ చావుష్ దగ్గర రూ.6 లక్షల వరకు అప్పు చేశాడు. అప్పు చెల్లించమని చావుష్ అడుగడతంతో మాజీద్ ఎలుకల మందు తాగి మైలార్‌దేవుపల్లి రైల్వే ట్రాక్ పైన ఆత్మహత్య చేసుకోవడానికి వచ్చాడు. రైలు తగిలి అతని కాలు వేళ్లు నుజ్జునుజ్జ య్యాయి. చేయి విరిగింది. గమనించిన స్థానికులు కాంగ్రెస్ నాయకుడు మహ్మద్ ఖాదర్‌కు సమాచారం ఇవ్వగా, అతను సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డ మహ్మద్ మాజీద్‌ను 108 అంబులెన్స్‌తో చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అతని కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు స్పందించలేదు. మాజీద్ ఆరోగ్యం బాగుందని మహ్మద్ ఖాదర్ తెలిపాడు.



ఆత్మహత్యాయత్నం చేసిన మహ్మద్ మాజీద్

శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి ఆలయ కమిటీ సభ్యుడు కన్నుమూత

చాంద్రాయణగుట్ట, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): హరిబౌలి శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి ఆలయ కమిటీ కార్యవర్గ సభ్యుడు ఆవుల విజయ్ కుమార్ (65) ఆదివారం గుండె పోటుతో మృతి చెందారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రాందేవ్ అగర్వాల్, ప్రతినిధులు నిరంజన్, రాజారత్నం, కె.దత్తాత్రేయ, ఎ.సతీష్, ఎస్పీ క్రాంతికుమార్, కృష్ణ, టి.రమేశ్‌బాబు సంతాపం తెలిపారు. అక్కన్న మాదన్న ఆలయం అభివృద్ధి కోసం ఆవుల విజయ్‌కుమార్, ఆయన తండ్రి రఘునందన్‌తో కలిసి ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు.



భోగి, సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గౌలిగూడలో తెలంగాణ రాష్ట్ర బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మణ్ రావు ఆదివారం అరిసెలు, పిండి వంటకాలు, నువ్వుల లడ్డూలు పంపిణీ చేశారు.

- అఫ్జల్‌గంజ్, ఆంధ్రజ్యోతి



జాంబాగ్ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్ ఆధ్వర్యంలో మాలకుంట గుడిసెల చిన్నారులకు గాలిపటాలను పంపిణీ చేశారు. శ్రీనివాస్ యాదవ్, అమర్ సింగ్, రాఘు కుంబ్లే, రామకృష్ణ, నర్సింగ్ పాల్గొన్నారు.

- అఫ్జల్‌గంజ్, ఆంధ్రజ్యోతి



సీజీఎంలు, ఎస్‌ఈలతో మాట్లాడుతున్న టీఎస్‌ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ

విద్యుత్ అంతరాయాలు తలెత్తకుండా చర్యలు

హైదరాబాద్ సిటీ, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ అధికారులను ఆదేశించారు. ఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ఆదివారం విద్యుత్‌సరఫరా తీరుపై సీజీఎంలు, ఎస్‌ఈలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగకు నగరవాసులు పెద్దఎత్తున పతంగులు ఎగురవేస్తుంటారని, పతంగులు, మాంజా విద్యుత్‌తీగలకు తగిలి విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, ప్రమాదాలు జరిగే అవకాశాలుంటాయని, అలాంటి పరిస్థితులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. 1912 టోల్ ఫ్రీ నెంబర్‌తో పాటు గ్రేటర్ జోన్ 9 సర్కిళ్ల పరిధిలో 24 గంటలు పనిచేసే కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యుత్ అంతరాయాలు, ప్రమాదాలు ఎక్కడ జరిగినా సంబంధిత సర్కిల్ కార్యాలయాలకు ఫిర్యాదు చేయాలన్నారు. సమీక్షలో డైరెక్టర్లు టి.శ్రీనివాస్, జె.శ్రీనివాస్‌రెడ్డి, సీజీఎంలు నరసింహాస్వామి, పి.ఆనంద్, సాయిబాబ. 9 సర్కిళ్ల ఎస్‌ఈలు పాల్గొన్నారు.

సర్కిల్ కంట్రోల్ రూం నెంబర్లు...

హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్	9491629047
హైదరాబాద్ సౌత్	9491162869
సికింద్రాబాద్	9491629380
బంజారాహిల్స్	9491633294
సైబర్‌సిటీ	9493193149
రాజేంద్రనగర్	7382100322
సరూర్‌నగర్	7901679095
హబ్సిగూడ	9491039018
మేడ్చల్	7382618971

లష్కర్‌పై నజర్



సికింద్రాబాద్ సెంగ్మెంట్‌పై అన్ని పార్టీల గురి

- మోదీ చరిష్మాతో మళ్లీ గెలవాలని యత్నాలు
- పాగా వేసేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్లాన్
- మారిన పరిస్థితుల్లో పొత్తులు, మద్దతుపై చర్చలు
- సమీపిస్తున్న లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్

సికింద్రాబాద్, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గంపై అన్ని పార్టీలూ కన్నేశాయి. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడడానికి మరెంతో కాలం లేకపోవడంతో సికింద్రాబాద్ సీటులో విజయమే లక్ష్యంగా పార్టీలు తమతమ అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంటున్నాయి. అభ్యర్థుల ఎంపికపై ఆయా పార్టీల్లో చర్చోపచర్చలు జరుగుతున్నాయి.

కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌ల్లో అదే ధీమా

దేశవ్యాప్తంగా మోదీ హవా ఉందని, దీంతో మళ్లీ కమలం పార్టీ వికసిస్తుందని బీజేపీ ధీమాగా ఉండగా, గత లోక్‌సభ ఎన్నికల అనంతరం బీజేపీ సిట్టింగ్ ఎంపీ చేసిన అభివృద్ధి శూన్యమని, ఈ దఫా కారు జోరు ఖాయమని బీఆర్ఎస్ పార్టీ విశ్వాసంతో ఉంది. రాష్ట్రంలో బీజేపీ-బీఆర్ఎస్‌ల చీకటి స్నేహం బట్టబయలైనందున అసెంబ్లీ ఎన్నికల్లో ఈ పార్టీలకు గుణపాఠం చెప్పిన ఓటర్లు లోక్‌సభ ఎన్నికల్లో సైతం తమకు అనుకూలంగా తీర్పు చెప్పనున్నారని, హస్తం పార్టీ విజయం తథ్యమని కాంగ్రెస్ శ్రేణులు కొండంత భరోసాతో ఉన్నారు. గత ఎన్నికల్లో మాదిరిగానే ఈ పర్యాయం కూడా దేశవ్యాప్తంగా మోదీ అనుకూల పవనాలు వీస్తున్నాయని, దీని ప్రభావం సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గంపై కూడా పడనుందని, అందుకే అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే భిన్నమైన తీర్పు వెలువడి, బీజేపీ గెలిచి తీరుతుందని కాషాయ పార్టీ నేతలు చెబుతున్నారు. కాగా, గ్రామీణ ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధించలేకపోయిన తమ పార్టీ రాష్ట్ర రాజధాని, చుట్టుపక్కల అద్భుత ఫలితాలు సాధించిందని, హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా అభివృద్ధి చేసిన ఖ్యాతి తమ పార్టీదేనని ఓటర్లు నమ్మడమే దీనికి కారణమని, అందుకే ఈసారి సికింద్రాబాద్ లోక్‌సభ సీటు తమదేనంటూ బీఆర్ఎస్ పార్టీ నేతలు ఇప్పటి నుంచే మైండ్ గేమ్ మొదలు పెట్టారు. పదేళ్ల తర్వాత రాష్ట్ర అధికార పగ్గాలు కాంగ్రెస్ పార్టీకి దక్కాయని, ఇప్పటినుంచి జరిగే అన్ని ఎన్నికల్లోనూ అధికార పార్టీని గెలిపించాలని ప్రజలు ఈపాటికే నిర్ణయించారని కాంగ్రెస్ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ముస్లింలు, క్రిస్టియన్ మైనార్టీలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలు, పలు ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారు ఈ నియోజకవర్గం పరిధిలో ఉన్నారు. ఇలా అన్ని వర్గాల ఓటర్లు హస్తం పార్టీకి అండగా నిలవనున్నారని, సెటిలర్లు సైతం బలపరిచేందుకు సిద్ధమైనందున తమ పార్టీ గెలుపు ఖాయమని హస్తం నేతలు భావిస్తున్నారు.

గుంభనంగా ఓటర్లు

రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఏయే పార్టీలు బరిలో ఉంటాయి, ఏ పార్టీ నుంచి ఎవరు అభ్యర్థిగా రంగంలో ఉంటారు తదితర అంశాలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నారు. వారు ఏ పార్టీకి అండగా ఉంటారో ఎవరికీ తెలియనీయకుండా ఓటర్లు గుంభనంగా వ్యవహరిస్తున్నారు. అభ్యర్థులు, పార్టీల పొత్తులు వ్యవహారం తేలేదాకా ఎవరూ బయటపడని పరిస్థితి. ఇదిలా ఉండగా సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలో సికింద్రాబాద్, సనత్‌నగర్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, అంబర్‌పేట్, ముషీరాబాద్. నాంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్‌లు ఉన్నాయి. 1957లో ఈ నియోజకవర్గం ఆవిర్భవించగా 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన జి.కిషన్‌రెడ్డి తన సమీప ప్రత్యర్థి, బీఆర్ఎస్ అభ్యర్థి తలసాని సాయికిరణ్‌పై 62,114 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. కిషన్‌రెడ్డికి 3,84,780 ఓట్లు రాగా, సాయికిరణ్‌యాదవ్‌కు 3,22,666 ఓట్లు వచ్చాయి. కాగా, కాంగ్రెస్ అభ్యర్థి ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ 1,73,229 ఓట్లు సాధించి మూడో స్థానంలో నిలిచారు.

బాలికపై వేధింపులు.. దాడి

బంజారాహిల్స్, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): తనతో మాట్లాడటంతో లేదని బాలిక వెంటబడి వేధించడమే కాకుండా దాడి చేసిన వ్యక్తిపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఫిలింనగర్‌లోని ఓ బస్తీలో నివాసముండే మహిళకు ఇద్దరు పిల్లలున్నారు. భర్త స్వగ్రామంలో ఉండిపోగా భార్య పిల్లలను చూసుకుంటుంది. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కుమార్తె వద్ద గతేడాది సెల్‌ఫోన్ ఉండటం తల్లి గమనించింది. కుమార్తెను నిలదీయగా ప్రభు అనే వ్యక్తి ఇచ్చినట్టు చెప్పింది. ఫోన్ లాక్కొని స్విచ్ఛాఫ్ చేసి తన వద్దనే పెట్టుకుంది. ఈ నెల 13న తల్లి ఇంట్లో లేని సమయంలో ప్రభు వచ్చాడు. తనతో ఎందుకు మాట్లాడటం లేదంటూ బాలికను నిలదీశాడు. కోపోద్రిక్తుడై బాలికను చేయితో కొట్టి కింద పడేసి కొట్టాడు. తీవ్రంగా గాయపడ్డ బాలిక తల్లి వచ్చాక విషయం చెప్పింది. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జైన సన్యాసినిగా నగర యువతి

(5వ పేజీ తరువాయి)

తీసుకున్నారు. ఆదివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లో భాగ్యనగర్ గో సేవా సదన్‌లో ఆమెకు సత్కార వేడుక నిర్వహించారు. సాధుమార్గ్ మహిళాసమితి, సాధుమార్గ్ సమతా భవన్‌జైన్ ట్రస్ట్, సమతా యువసంఘం, సమతా బాహుయువతి, అశోక్‌నగర్ జైన్ త్రిసంఘ్ తదితర జైన్ సంఘాల సంయుక్తాధ్వర్యంలో సత్కార వేడుక జరిగింది. ఆచార్య భగవంత్ 1008 రామ్‌లాల్‌జీ మహారాజ సాహెబ్ శిష్యులు సెషన్ దీపక్, త్రివిదేహ మునిజీ మహారాజ్ సాహెబ్, ఉత్తమం మహేష్ ముని మహారాజ్ సమక్షంలో ఆమెకు చాదర్‌తో స్వాగతం పలికారు. సాధుమార్గ్ జైన్ సంఘ హైదరాబాద్ అధ్యక్ష, కార్యదర్శులు వికాస్ పుతిలియా, విజయ్ మునోద్ కాజల్‌ను అభినందించారు. అఖిల భారత పర్షియా సాధుమార్గ్ జైన్ సంఘం జాతీయ నాయకుడు కిషోర్‌జీ కరువత్, సీనియర్ గైడ్ వర్ధమాన్, తానకవాసి జైన్ శ్రావక్‌సంఘ్ అధ్యక్షుడు మహవీర చంగ్లీ అలిజార్, ఆదిజైన్ మండలం సికింద్రాబాద్ చైర్మన్ మదన్‌లాల్‌జీ లునావత్, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు రాజేష్, విజయేందర్ పితిలియా తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి చేసుకోవడం లేదని యువతి పై..

బంజారాహిల్స్, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకోవడం లేదని యువతిపై దాడి చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. జార్ఖండ్‌కు చెందిన యువతి ఉద్యోగాన్వేషణలో నగరానికి వచ్చి కృష్ణానగర్‌లో ఉంటుంది. మూడు సంవత్సరాల క్రితం యాసీన్ భాషా షేక్‌తో పరిచయం ఏర్పడింది. ఇద్దరు కలిసి సహజీవనం మొదలు పెట్టారు. కొద్దిరోజుల క్రితం యాసీన్‌కు వివాహం అయినట్టు యువతికి తెలిసింది. అప్పటి నుంచి యాసీన్‌ను దూరం పెడుతోంది. కాని యాసీన్ మాత్రం తనను వివాహం చేసుకోవాలని ఒత్తిడి తెస్తున్నాడు. ఈనెల 13న ఆమె వద్దకు వచ్చిన యాసీన్ వివాహం చేసుకోవడం లేదని కోపంతో దాడి చేసి తీవ్రంగా కొట్టాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ ఉద్యమకారుల కోసం..
సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

● ప్రొఫెసర్ కోదండరాం



సమావేశంలో ప్రొఫెసర్ కోదండరాం తదితరులు

ఏఎస్‌రావునగర్, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల కోసం ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, తద్వారా నిజమైన ఉద్యమకారులను గుర్తించవచ్చని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం పేర్కొన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఈసిఐఎల్ లయన్స్ భవన్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞత సభ నిర్వహించారు. సమావేశానికి తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉప్పల్ నియోజకవర్గం అధ్యక్షులు తాడూరి గగన్‌కుమార్ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. తెలంగాణ పునర్నిర్మాణంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ఉద్యమకారులందరూ అండగా ఉంటారని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన 250 చదరపు గజాల ఇంటి స్థలం విషయంలో పోలీసు ఎఫ్ఐఆర్ కాపీలు, ఉద్యమ సమయంలోని ఫోటోలు, పేపర్ క్లిప్పింగ్‌లు భద్రపరచుకోవాలని సూచించారు. సమావేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారులను స్వరాష్ట్ర సాధకులుగా గుర్తించాలని కోరారు. విద్యార్థి ఉద్యమకారులకి ఉద్యోగ నియామకాలలో ప్రత్యేక కోటా కేటాయించాలన్నారు. సమావేశంలో తెలంగాణ ఉద్యమకారులకు సంబంధించి పలు తీర్మాణాలను చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు తాడూరి గగన్‌కుమార్‌తో పాటు నాయకులు డాక్టర్ చీమ శ్రీనివాస్, నల్లా రాధాకృష్ణ, పి.సురేందర్‌రెడ్డి, కే యాదిరెడ్డి, దామరపల్లి నర్సింహ్మారెడ్డి, పలువురు ఉద్యమకారులు పాల్గొన్నారు.

విమానంలో ప్రాణాలొదిలిన వృద్ధుడు

శంషాబాద్, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): పశ్చిమబెంగాల్ నుంచి హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స కోసం కొడుకుతో కలిసి వచ్చిన ఓ వృద్ధుడు చికిత్స తరువాత స్వరాష్ట్రం వెళ్లేందుకు రంగారెడ్డి జిల్లా శంషాబాద్ విమానాశ్రయంలో విమానం ఎక్కాడు. విమానం టేకాఫ్‌కు రెడీ అవుతుండగా సదరు వృద్ధుడు ఉన్నట్టుండి తలవాల్చాడు. శరీరంలో కదలిక లేకపోవడంతో వృద్ధుడి కుమారుడు ఎయిర్‌పోర్టు సిబ్బందికి సమాచారమివ్వడంతో ఎయిర్‌పోర్టులోని అపోలో ఆస్పత్రి వైద్యుడు వచ్చి చూసేసరికే వృద్ధుడు మృతిచెందాడు. ఈ ఘటనపై వృద్ధుడి కొడుకు ఆర్జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకొచ్చింది. ఈ సంఘటన వివరాల్లోకి వెళ్తే.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం దుర్గాపూర్‌కు చెందిన వృద్ధుడు షేక్ నజ్రుల్(62) ఇస్లాంకు కడుపులో ఇన్ఫెక్షన్ అయ్యింది. అతడు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఐఏజీ ఆస్పత్రికి వచ్చాడు. చికిత్స అనంతరం తన కొడుకు ముజాహిద్‌తో కలసి సొంతూరు వెళ్లేందుకు శనివారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానం ఎక్కారు. విమానం టేకాఫ్ అవుతుండగా నజ్రుల్ ఇస్లాం సీటులోనే ఒరిగిపోయాడు. భయపడిన అతడి కొడుకు వెంటనే విమాన సిబ్బందికి సమాచారమిచ్చాడు. అప్పటికప్పుడు పరీక్షించే లోగానే నజ్రుల్ మృతిచెందినట్టు వైద్యుడు నిర్ధారించారు.

బల్దియా..
డిప్యూటేషన్ మాయ..!

(5వ పేజీ తరువాయి)

వచ్చారు. వీరిలో మెజారిటీ డిప్యూటీ కలెక్టర్లు ఇప్పటికీ సంస్థలోనే ఉన్నారు. వీరికి వేతనాలతోపాటు, వాహనాలకయ్యే ఖర్చు బల్దియా భరించాల్సి వస్తోంది. కొందరు అటెండర్లనూ వెంట తెచ్చుకుంటున్నారు. గతంలో ఎప్పుడూ ఈ స్థాయిలో ఎన్నికల కోసం అధికారులను తీసుకొచ్చిన దాఖలాలు లేవు.

ఆరుగురు ఐఏఎస్‌లు...

గతంలో కమిషనర్, ఒకరిద్దరు ఐఏఎస్‌లు అదనపు కమిషనర్లుగా ఉండే వారు. ప్రస్తుతం సంస్థలో కమిషనర్‌తో కలిపి ఆరుగురు ఐఏఎస్ అధికారులు, ఈవీడీఎం డైరెక్టర్‌గా ఓ ఐపీఎస్ అధికారి ఉన్నారు. ఐఏఎస్‌ల్లో ముగ్గురు జోనల్ కమిషనర్లు కాగా.. మరో ఇద్దరు అదనపు కమిషనర్లుగా ఉన్నారు. ఓ అధికారికి ఇంకా ఏ విభాగం బాధ్యతలు అప్పగించ లేదు. అంతకుముందు అదనపు, జోనల్ కమిషనర్ల పోస్టుల్లో నాన్ ఐఏఎస్ అధికారులుండేవారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం జీహెచ్ఎంసీకి ఐఏఎస్‌ల రాక పెరిగింది. స్థానికంగా ప్రజాప్రతినిధులకు సహకరించని, నిక్కచ్చిగా వ్యవహరించే, వివాదాస్పదమైన కలెక్టర్, వివిధ కార్పొరేషన్ల కమిషనర్లుగా ఉన్న ఐఏఎస్‌లను బల్దియాకు బదిలీ చేస్తున్నారు. జీహెచ్ఎంసీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం ఏళ్లుగా ఇక్కడి తిష్ట వేసిన కొందరు అధికారులను మాతృ సంస్థలకు పంపింది. ఈ క్రమంలో మరో నలుగురు ఐఏఎస్‌లను బల్దియాకు బదిలీపై వచ్చారు. గతంలో ఒక అధికారి చూసిన విభాగాలను విభజించి ప్రస్తుతం ఇద్దరు, ముగ్గురికి బాధ్యతలు అప్పగించారు. అంతకుముందు ఎస్టేట్, ప్రకటనలు, లీగల్, ట్రాన్స్‌పోర్ట్, ఎలక్ట్రిసిటీ, ట్రాన్స్‌పోర్ట్ విభాగాలకు ఒక అదనపు కమిషనర్, హెల్త్ అండ్ శానిటేషన్ బాధ్యతలు ఓ అదనపు కమిషనర్ నిర్వర్తించేవారు. ఇద్దరు అదనపు కమిషనర్లు చూసే బాధ్యతలను ఇప్పుడు నలుగురికి అప్పగించారు.

అన్ని విభాగాల్లో అదే తీరు..

జీహెచ్ఎంసీలో ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళికా, ఆర్థిక, పారిశుధ్య నిర్వహణ, వెటర్నరీ, ఎంటమాలజీ ఇలా.. ప్రతి విభాగంలో డిప్యూటేషన్‌పై వచ్చిన అధికారులున్నారు. పలు పోస్టులకు వారు అర్హులు అయినా.. అవసరం లేకున్నా కొందరిని తీసుకురావడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఎప్పుడూ లేని విధంగా జోన్ల వారీగా సమగ్ర వ్యర్థాల నిర్వహణ (ఎస్‌డబ్ల్యుఎం)కు ఓ డిప్యూటీ కమిషనర్ స్థాయి అధికారిని నియమించారు. సంస్థలో జాయింట్ కమిషనర్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. స్వచ్ఛ భారత్ మిషన్‌కు ఒకరు, టాయిలెట్ల నిర్వహణకు మరొక జేసీ ఉన్నారు. కమిషనర్ కార్యాలయంలోనూ లీగల్, ఇంజనీరింగ్ విభాగాలకు ప్రత్యేకంగా ఓఎస్‌డీలు ఉండడం గమనార్హం. కమిషనర్ పేషీలో ఓ అధికారి దాదాపు దశాబ్దానికిపైగా విధులు నిర్వర్తిస్తున్నాడు. కమిషనర్లు వస్తుంటారు.. పోతుంటారు.. ఆయన మాత్రం చంటి లోకల్ అన్నట్టుగా అక్కడే కొనసాగుతారు. ఆ అధికారి తీరుపై విమర్శలున్నా బదిలీ చేసే సాహసమూ ఎవరూ చేయరు. హైదరాబాద్‌లో ఉండాలనుకునే వివిధ విభాగాలకు చెందిన అధికారులు జీహెచ్ఎంసీకి వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో సంస్థలో అవసరముందా..? లేదా..? అన్నదీ పట్టించుకోకుండా బదిలీ చేస్తున్నారు. దీంతో సంస్థపై ఆర్థిక భారం పెరుగుతోంది. అవసరం లేని అధికారులను ఇక్కడి నుంచి పంపిస్తే.. కోట్లాది రూపాయలు ఆదా అవుతాయని ఆర్థిక విభాగం వర్గాలు చెబుతున్నాయి.

భూమి ఇప్పిస్తానని చెప్పి..
మహిళను మోసం చేసిన రియల్టర్లు

యూసుఫ్‌గూడ, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): విలువైన భూమిని కొనిపిస్తానని చెప్పి మహిళ నుంచి లక్షలు తీసుకుని మోసం చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులపై మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్‌లో నివసించే సరస్వతి అనే మహిళ టెక్స్‌టైల్ వ్యాపారం చేస్తుంటుంది. అయితే ఆమెకు పరిచయం ఉన్న బత్తుల శంకర్ అనే వ్యక్తి ద్వారా నిమ్మకాయల దుర్గాప్రసాద్ రెడ్డి అనే వ్యక్తి రియల్ ఎస్టేట్ వ్యాపారిగా పరిచయం అయ్యాడు. మంచి లాభదాయకమైన భూములు చూపిస్తానని చెప్పి అశోక్‌రెడ్డి, మునిసాయి కుమార్ అనే వ్యక్తులను పరిచయం చేశారు. వారు ఎలాంటి డాక్యుమెంట్లు లేకుండా భూములు చూపించారు. అంతేకాకుండా దుర్గాప్రసాద్‌రెడ్డికి మంచి పలుకుబడి ఉందని, బీజేపీలో మంచి పరిచయాలు ఉన్నాయని ఆమెను నమ్మించారు. ఆ తరువాత దుర్గా ప్రసాద్‌రెడ్డి కొంత డబ్బు ఇవ్వాలని, భూమి పనుల కోసం కావాలని, యాదగిరిగుట్ట వద్ద మంచి ప్రభుత్వ భూమి ఇస్తానని చెప్పాడు. అతని మాటలు నమ్మిన సరస్వతి విడతలవారీగా మొత్తం రూ.34లక్షలు ఇచ్చింది. డబ్బు తీసుకుని వారంలో రిజిస్ట్రేషన్ చేయిస్తామని చెప్పారు. కానీ ఆ తరువాత ఫోన్ తీయటం లేదు. నెల రోజుల తరువాత అనుమానం వచ్చిన ఆమె యాదగిరిగుట్టలో వారు చెప్పిన ప్రాంతానికి వెళ్లి చూడగా అక్కడ ప్రభుత్వ స్థలం లేదు. దీంతో మోసపోయానని గ్రహించిన సరస్వతి వారికి ఫోన్ చేసి గట్టిగా మాట్లాడి నాకు భూమి వద్దు, నాడబ్బులు నాకు ఇవ్వాలని తెలిపింది. ఇదిగో అదిగో అంటూ కాలయాపన చేస్తూ ఉండటంతో చివరకు విసిగిపోయి సీసీఎస్‌లో ఫిర్యాదు చేసింది. సీసీఎస్ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ చేసి మధురానగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మధురానగర్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేసు పెడదామని వస్తే కారులో వస్తువులు మాయం

పోలీస్‌స్టేషన్‌లో కేసు పెడదామని వచ్చిన ఓ మహిళ కారులో నుంచి విలువైన వస్తువులు కాజేసిన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్ ప్రాంతంలో నివసించే కూన సరస్వతి కేసు పెట్టేందుకు తన కారులో ఆదివారం మధురానగర్ పోలీస్ స్టేషన్‌కు వచ్చింది. కారును పోలీస్‌స్టేషన్ సమీపంలో నిలిపి స్టేషన్‌లోకి వెళ్లి మాట్లాడి తిరిగి కారు వద్దకు వచ్చింది. ఐతే కారు అద్దాలు కిందకు దించి ఉన్నాయి. హడావిడిగా కారులోని తన బ్యాగ్ తీసి చూడగా అందులో ఉండాల్సిన ఉంగరాలు, యాపిల్ ఇయర్ ప్యాడ్స్ కనిపించలేదు. దీంతో మళ్లీ పోలీస్‌స్టేషన్‌లోకి వెళ్లి తన కారులో వస్తువులు పోయాయని ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ ఆధార్‌లు సృష్టించి బ్యాంకు ఖాతాలు

(5వ పేజీ తరువాయి)

పేరుతో కరెంట్ ఖాతాలు తెరిచేవాడు.

మోసాలు ఇలా..

ఆన్‌లైన్‌లో పార్ట్ ఉద్యోగాలు చేస్తూ రోజుకు వేలల్లో సంపాదించొచ్చు అని, ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్‌తో రూ. లక్షల్లో లాభాలు అందుకోవచ్చు అంటూ బల్క్ ఎస్ఎంఎస్ లింకులు పంపేవారు. ఆ లింక్‌లు ఓపెన్ చేసిన వారికి ఫోన్‌లు చేసి ఉద్యోగాలు, పెట్టుబడులకు అధిక లాభాలు అంటూ బురిడీ కొట్టించి రూ. లక్షల్లో కాజేసేవారు. ఆ తర్వాత ఫోన్‌లు స్విచాఫ్ చేసేవారు. అమీర్‌పేటకు చెందిన బాధితుడి నుంచి ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో రూ. 4.75 లక్షలు కాజేశారు. మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. జాయింట్ సీపీ రంగనాథ్, డీసీపీ కవిత, ఏసీపీ శివ మారుతి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు టీమ్ రంగంలోకి దిగింది. సాంకేతిక ఆధారాలు సేకరించారు. రుచికా ఇన్ఫోటెక్ పేరుతో ఐసీఐసీఐ బ్యాంకులో కరెంట్ అకౌంట్ ఆధారంగా హరియాణాకు చెందిన ముఠా ఈ మోసానికి పాల్పడినట్లు గుర్తించారు. ఫరీదాబాద్ వెళ్లిన పోలీసులు ప్రవీణ్, హిమాన్షును అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడు దేవేందర్ పరారీలో ఉన్నాడు. ఇప్పటి వరకు సైబర్ మోసాల ద్వారా ఈ ముఠా రూ. 2.5 కోట్లు కొల్లగొట్టినట్లు విచారణలో తేలింది. అయితే బ్యాంకు ఖాతాలో కేవలం రూ. 6 లక్షలు మాత్రమే ఉండటంతో వాటిని ఫ్రీజ్ చేశారు.



స్వచ్ఛ సర్వేక్షణ్‌లో బడంగ్‌పేట్‌కు ద్వితీయ స్థానం

- లక్ష లోపు జనాభా జాబితాలో చోటు

సరూర్‌నగర్, జనవరి 14(ఆంధ్రజ్యోతి): పచ్చదనం-పరిశుభ్రత(స్వచ్ఛ సర్వేక్షణ)లో బడంగ్‌పేట్ కార్పొరేషన్ ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంది. 2023వ సంవత్సరానికిగాను ఇటీవల కేంద్రం ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో తెలంగాణ రాష్ట్రంలో 50 వేల నుంచి లక్షలోపు జనాభా ఉన్న కార్పొరేషన్లు, మునిసిపాలిటీల జాబితాలో బడంగ్‌పేట్ చోటు సంపాదించుకుంది. మొదటి స్థానంలో సిద్దిపేట్ ఉండగా, బడంగ్‌పేట్ రెండో స్థానంలో నిలిచింది. త్వరలో ఏర్పాటు చేయనున్న అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో బడంగ్‌పేట్ కార్పొరేషన్ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు సదరు అవార్డును అందజేయనున్నారు.

సిలబస్ అయ్యింది
60 శాతమే !

- సమీపిస్తున్న 'పది' వార్షిక పరీక్షలు
- ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు
- గత ఫలితాల్లో 28వ స్థానం
- ఈ ఏడాది ఉత్తీర్ణతపై టెన్షన్



హైదరాబాద్ సిటీ, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల పరిస్థితి ఆందోళకరంగా మారింది. వార్షిక పరీక్షలు సమీపిస్తున్నా చాలా స్కూళ్లలో 60 శాతం మాత్రమే సిలబస్ కావడంతో ఇబ్బందులు పడుతున్నారు. పలు సబ్జెక్టుల్లో కేవలం 40 శాతం మాత్రమే కావడంతో విద్యార్థులు ఫలితాలపై తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాల్సిన విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుండడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈసారి కూడా ఉత్తీర్ణత తగ్గుతుందేమోనేని హడలిపోతున్నారు. హైదరాబాద్ జిల్లాలోని 181 ఉన్నత పాఠశాలల్లో ఈసారి సుమారు 6,859 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలల వారీగా ఇప్పటివరకు ఎంతమేరకు సిలబస్ పూర్తయింది.. రివిజన్ క్లాసులను ఎప్పటి నుంచి ప్రారంభించాలనే దానిపై నేటికీ స్పష్టత కరువైంది.

వేధిస్తున్న సబ్జెక్టు టీచర్ల కొరత

ప్రభుత్వ పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత ఉందని, పలుచోట్ల సరిపోనూ ఉపాధ్యాయులున్నా.. సకాలంలో సిలబస్‌ను పూర్తి చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. చాలా పాఠశాలల్లో ప్రస్తుతం హిందీ, తెలుగు, సైన్స్, సోషల్ టీచర్లు తగినంత మంది లేకపోవడంతో ఆయా సబ్జెక్టుల్లో బోధన కుంటుపడుతున్న పరిస్థితి నెలకొంది. అయితే ఉన్నవారిపై కూడా ఫేస్ రికగ్నిజేషన్ సిస్టమ్ (ఎఫ్‌ఆర్ఎస్) ద్వారా ప్రతి రోజు ఉదయం వేళలో విద్యార్థుల హాజరు తీసుకోవడం, ఉన్నతి, లక్ష్య యాప్‌ల్లో టీచింగ్ ప్లాన్ అప్‌లోడ్ చేయడం లాంటి అదనపు భారం ఉంటోంది. దీంతో సిలబస్ సకాలంలో పూర్తికావడం లేదని తెలుస్తోంది. సబ్జెక్టు టీచర్లు లేని చోట బీఈడీ పూర్తిచేసిన సీనియర్ ఎస్‌జీటీలను పంపించి బోధనలు అందించాల్సిన అధికారులు కనీసం పట్టించుకోకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ చూపించి హైదరాబాద్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులను పట్టించుకోవాలని, లేని పక్షంలో గతేడాది ఫలితాలు పునరావృతమవుతాయని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

గతేడాది హైదరాబాద్‌కు 28వ స్థానం

2022-23 విద్యా సంవత్సరంలో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి 68,468 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఇందులో 54,971 మంది (80.29 శాతం) ఉత్తీర్ణత సాధించారు. 2021-22లో 73,957 మంది పరీక్ష రాస్తే.. 58,889 మంది (79.63 శాతం) పాసయ్యారు. 2022లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల కంటే చిట్టచివరి (33వ) స్థానానికి జిల్లా పరిమితమైంది. 2023లో కాస్త మెరుగుపడి 28వ స్థానంలో నిలిచింది. అయితే 5 స్థానాలు దిగినప్పటికీ ప్రధాన సబ్జెక్టులతోపాటు లాంగ్వేజ్‌ల్లో చాలామంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. 2023లో మొత్తం పరీక్ష రాసిన 68,468 మంది విద్యార్థుల్లో 7,850 మంది ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలకు చెందిన వారున్నారు. అయితే ఇందులో కొంతమంది విద్యార్థులు కష్టతరమైన గణితం, సామాన్యశాస్త్రం, ఇంగ్లిష్‌తోపాటు తెలుగు, హిందీ భాష సబ్జెక్టుల్లో కూడా ఫెయిల్ కావడం అప్పుడు చర్చనీయాంశంగా మారింది. గణితం, సైన్స్, సోషల్‌లో ప్రభుత్వ విద్యార్థులు 65 శాతం, ప్రైవేట్ పిల్లలు 35 శాతం మంది ఫెయిలయ్యారు.

ప్రతి ఏడాది తొలినాళ్లకు కాంతి తెచ్చే పండుగ సంక్రాంతి. రంగుల ముగ్గులు, బసవన్నలు, గాలిపటాలు, పందేలు.. ఇలా ఆనందాలు అంబరాన్నంటే అందమైన పండగ సంక్రాంతి. ఇకపోతే ఈ పొంగల్‌డేస్‌లో కాస్త ప్రత్యేకంగా వండుకోండిలా..

ఈ సారి పండక్కి ఈ వంటలు అదుర్స్

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
సోమవారం ● 15 జనవరి 2024



ముక్కల పులుసు

కావాల్సిన పదార్థాలు

బెండకాయ- 75 గ్రాములు, మంచి గుమ్మడికాయ- 150 గ్రాములు, సొరకాయ- 75 గ్రాములు, ములక్కాయ- 100 గ్రాములు, వంకాయలు- 75 గ్రాములు, చిలగడదుంప- 75 గ్రాములు, ఆలుగడ్డ- 75 గ్రాములు, క్యారెట్- 50 గ్రాములు, టమోటాలు- 50 గ్రాములు, ఉల్లిగడ్డ- 2 (మీడియం సైజ్), పచ్చిమిర్చి- 10, చింతపండు- 100 గ్రాములు, బెల్లం- 50 గ్రాములు, కరివేపాకు- 4 లేదా 5 రెబ్బలు, పోపు గింజలు- 6 టీస్పూన్లు, ఇంగువ- 2 టీస్పూన్లు, నూనె- 50 మి.లీ., నెయ్యి- 50 మి.లీ., కందిపప్పు- 75 గ్రాములు, మెంతిపిండి- ఒకటిన్నర టీస్పూన్, జీలకర్ర పొడి- 1 టీస్పూన్, ఎండుమిర్చి- 4, కొత్తిమీర- 1 కట్ట, ఉప్పు- 4 టీస్పూన్లు, కారం- 2 టీస్పూన్లు, పసుపు- ఒకటిన్నర టీస్పూన్, వెల్లుల్లిపాయ- 1

తయారీ విధానం

కుక్కర్‌లో కందిపప్పు, టమాటాలు వేశాక కొద్దిగా పసుపు వేసి మెత్తగా ఉడికించాలి. పప్పుగుత్తితో మెదిపి, జావ లాగా చేసి పక్కనబెట్టుకోవాలి. చింతపండు నాన బెట్టి గుజ్జుతీసి కలిపి పక్కన ఉంచుకోవాలి. ఇప్పుడు పులుసు జారుగా ఉండటానికి అనువైన పెద్ద గిన్నెలో నూనె, నెయ్యి కలిపి వేసి పోపు గింజలన్నీ వేసి, ఎండుమిర్చి, కరివేపాకు, ఇంగువ, దంచిన వెల్లుల్లి వేసి కుక్ చేయాలి. ఘుమఘుమలాడుతుండగా పెద్ద రెబ్బలుగా ఉల్లి పాయ పోపులో వేసి, ముప్పయ్ సెకన్లు వేయించి (బెండకాయ, వంకాయలను మినహా యించి మిగతా ముక్కలన్నింటినీ కొంచెం పెద్ద సైజ్ కటింగ్) పోపులో వేసి.. ఉప్పు, కారం, పసుపు వరుసగా వేసుకుంటూ కలుపుతూ మీడియం ఫ్లేమ్‌లో మూతపెట్టి ఇరవైఐదు నిముషాల పాటు మగ్గనివ్వాలి. ముక్కలు డెబ్బయ్ శాతం ఉడికినవి అని నిర్ధారించుకున్న తర్వాత బెండకాయలు, వంకాయలు, పచ్చిమిర్చి వేసి కలిపి మనం సిద్ధంగా ఉంచుకున్న పప్పు, చింతపండు నీళ్లకి గరిట జారుగా ఉండేట్లు నీళ్ల కలిపి ముక్కల్లో పోసి అన్నింటినీ కలిపి మూతపె ట్టాలి. పదినిముషాల పాటు ఉడికిన తర్వాత కలి యబెట్టి మెంతిపొడి, జీలకర్ర పొడి, సరిపడ ఉప్పు, సరిపడ కారం, బెల్లం, కొద్దిగా ఇంగువ, అల్లం తరుగు, కొత్తిమీర వేసి నిముషం పాటు మరగనిచ్చి పప్పుచారు జారులా ఉండగా స్టవ్‌ను కట్టేయాలి. ముక్కల పులుసు రెడీ.

కనుమపండగ ప్రత్యేకం



పాలకూర చికెన్ బిర్యానీ

కావాల్సిన పదార్థాలు

లేత పాలకూర- 10 కట్టలు, బిర్యానీ రైస్- 4 గ్లాసులు, చికెన్ బ్రెస్ట్‌పీసెస్- 10 (ప్రతిదీ వంద గ్రాములుండాలి), అల్లం-వెల్లుల్లి పేస్ట్- 3 టీస్పూన్లు, ఉల్లిపాయ-1 (పెద్దది), పచ్చిమిర్చి- 20, ధనియాల పొడి- 2 టీస్పూన్లు, గరం మసాలా- 2 టీస్పూన్లు, పెరుగు- కప్పు, ఉప్పు- 3 టీస్పూన్లు, కొత్తిమీర- 1 కట్ట, భగారా ఆకు- 4, లవంగాలు-8, చెక్క-2, యాలకులు-4, షాజీరా- 1 టీస్పూన్, మిరియాలు-2 టీస్పూన్లు, మరాఠీ మొగ్గ- 2, అనాసపువ్వు-2, జాపత్రి-4

తయారీ విధానం

ముందుగా తగినంత ఉప్పు, పది పచ్చి మిరపకాయల పేస్ట్, కొద్దిగా పసుపు, 2 టీస్పూన్లు అల్లం వెల్లుల్లి పేస్ట్, పెరుగు, ధని యాల పొడి, గరం మసాలాను పేస్ట్‌లా తయారు చేసి పది చికెన్ బ్రెస్ట్ పీస్‌లకు బాగా పట్టించి గంటపాటే నానబెట్టాలి. ఒక పెద్దగి న్నెలో మరిన్ని నీళ్లు తీసుకుని వేడిచేయాలి. నీళ్లు మరిగిన వెంటనే అందులో బిర్యానీ దినుసులన్నీ వేసి టీస్పూన్ అల్లం వెల్లుల్లి పేస్ట్ కూడా వేసి తగినంత ఉప్పు వేసి, ఆ నీళ్లను మూడు నిముషాల పాటు మరగనివ్వాలి. అందులో కడిగి అరగంట పాటు నాని ఉన్న బాసుమతి రైస్‌ను పది మిర్చిల చీలికలను వేసి బియ్యం డెబ్బయ్‌శాతం ఉడికేలోపల పులుసు తగులుతుండగా వార్చేసి, పక్కకు పెట్టాలి. ఇప్పుడు కడాయ్‌లో నూనె, నెయ్యి వేసి ఉల్లిపాయలను వేసి వేయించి, తరిగి పెట్టుకున్న పాలకూర కూడా వేసి రెండు నిముషాల పాటు వేయించి కొద్దిగా ఉప్పు వేయాలి. నానబెట్టి ఉన్న చికెన్ ముక్కలను కడాయ్ అడుగున వరసగా పేర్చి వేడివేడి అన్నాన్ని ముక్కలపై పరిచి, ఆవిరి బయటకు రాని మూతపెట్టి మూతపై బరువు ఉంచి ముప్పయ్ నిముషాల పాటు సిమ్‌లో బిర్యానీ ఉడకనివ్వాలి. కింద నుండి సన్నని సెగ పైనుండే రైస్ బరువుతో చికెన్ ఉడికిపోతుంది. మిగతా నెయ్యి కూడా పైనుంచి వేసి కొత్తిమీర చల్లి దించేయవచ్చు. అద్భుతమైన హైప్రొటీన్ డైట్ చికెన్ బిర్యానీ సిద్ధం.

ఓట్స్ పాయసం

కావాల్సిన పదార్థాలు

పుచ్చ గింజలు- 3 టీస్పూన్, గుమ్మడి గింజలు- 3 టీస్పూన్లు, జీడిపప్పు- 30 గ్రాములు, కిస్‌మిస్- 30 గ్రాములు, రోల్డ్ ఓట్స్- 200 గ్రాములు, సారపప్పు- 2 టీస్పూన్లు, పిస్తాపప్పు- 2 టీస్పూన్లు, ఎండు కొబ్బరి- సగం చెక్క, బియ్యం- 2 టీస్పూన్లు, పాలు- 2 లీటర్లు, నీళ్లు- అరలీటరు

తయారీ విధానం



ముందుగా పుచ్చగింజలు, గుమ్మడి గింజలు, సగం జీడిపప్పు, పిస్తాపప్పును అరటీస్పూన్ నేతిలో దోరగా వేయించి బరకగా గ్రైండ్ చేసి పక్కన పెట్టుకోవాలి. రెండు టేబుల్ స్పూన్ల బియ్యం కడిగి నానబెట్టుకోవాలి. మెత్తగా పేస్ట్ చేసుకోవాలి. ఓట్స్‌ను కడిగి పది నిముషాలు నానబెట్టాలి. మిగతా నెయ్యిలో వి ఎగిలిన జీడిపప్పు, కిస్‌మిస్, సారపప్పు, సన్నని ఎండుకొబ్బరి ముక్కలు వేయించి మిశ్రమాన్ని సిద్ధంగా ఉంచుకోవాలి.

ఒక పెద్ద గిన్నెలో పాలు , అరలీటరు నీళ్లు పోసి స్టవ్ మీద ఉంచి పొంగురాగానే సిమ్‌లో ఉంచి అందులో ముందుగా పేస్ట్ చేసిన బియ్యం, గ్రైండ్ చేసిన గింజల పొడి వేసి రెండు నిముషాల పాటు ఉడకనివ్వాలి. అటుపై నానిన రోల్డ్ ఓట్స్‌ను వేసి కలుపుతూ మూడు నిముషాల పాటు ఉడకనివ్వాలి. గరిటె జారుగా వస్తోంటే.. ఈ పాయసంలో ఫ్రై చేసి పెట్టుకున్న డ్రై నట్స్ మి శ్రమం, యాలకుల పొడి, చక్కెర వేసి కలిపిన తర్వాత దించేయాలి. ఇది వేడిగా కాకుండా చల్లారాక తింటే బావుంటుంది.



శైలజ
సైలాస్ కిచెన్,
యూట్యూబ్ ఛానల్
asksailaw@gmail.com



దమ్మున్న కంటెంట్..

యూట్యూబర్స్‌లో ఈమె తీరే వేరు. కంటెంట్ క్రియేటరే కాదు.. సింగర్, క్యాంపెయినర్, యాక్టర్. పేరు.. ప్రజక్త కోలి. 'మోస్ట్‌లీశాన్' పేరుతో ఆమె నడిపే యూట్యూబ్ ఛానల్ సబ్‌స్క్రయిబర్స్ సంఖ్య ఏడు మిలియన్లు. దేశంలోనే గొప్ప ఇన్‌ఫ్లూయన్సర్‌గా పేరుగాంచిన ప్రజక్త కోలిని క్లైమేట్ సమ్మిట్‌కు ఆహ్వానించారు. ఈ క్రేజీ యూట్యూబ్‌స్టార్ మనోగతం మీకోసం.

దుమ్మురేపే యూట్యూబర్!

"నాకు ఇన్‌ఫ్లూయన్సర్ అంటే ఇష్టం ఉండదు. కంటెంట్ క్రియేటర్ అనటంలోనే కిక్ ఉంటుంది"ంటుంది ఈ యూట్యూబర్. ఆమె వయసు ముప్పయేళ్లు. క్రికెట్ స్టేడియంలో విధ్వంసకరమైన ఆటగాడు ఆడినట్లు.. కెమెరా ముందు పర్ఫెక్ట్‌గా మాట్లాడగలదు. సునిశితమైన హాస్యం, అప్‌డేటెడ్ రెట్రో జోక్స్, పేరడీలు, పాత్రల్లో జీవించటం.. ఇలా ఈమెకు కెమెరాతో పెట్టిన విద్య. అందుకే ప్రజక్త దేశంలోనే పేరున్న యూట్యూబర్స్‌లో ఒక్కరయ్యారు.

అలా కెమెరా ముందుకు..



'స్కూల్‌డేస్‌లో స్టేజ్‌మీద నటించే దాన్ని. నేర్చుకునేతత్వం నాలో మెండు. పదమూడేళ్ల కిందటే ఓ మరాఠీ చిత్రంలో నటించి రెండువందల రూపా యల చెక్ అందుకున్నా. రేడియో జాకీ అవ్వాలని కలలు కనేదాన్ని. పదకొండేళ్ల వయసులోనే ఆర్జే అవకాశం వచ్చింది. అయితే రేటింగ్స్ లేకపోవటం వల్ల షో ఆగిపోయింది. ఇలా అయ్యిందేనని.. బాధపడుతున్న సమయంలో లహరి అనే కంటెంట్ క్రియే టర్ 'యూట్యూబ్‌లో ప్రయత్నించు' అని సలహా ఇచ్చింది. నాన్న దగ్గర కెమెరా తీసుకుని, ట్రైపాడ్ కొనుక్కొని మొదట ఇంట్లోనే వీడియోలు తీశా. ఛానెల్ పేరు 'మోస్ట్‌లీశాన్'. అసలు వీడియోలు ఎలా తీయాలో తెలీదు.. ఎలా ఎడి టింగ్ చేయాలో తెలీదు. కేవలం ఐదు నిముషాల వీడియో కోసం కొన్ని గంటలపాటు పిచ్చిగా పని చేసే దాన్ని. డైరక్షన్, యాక్టింగ్ రెండూ నావే.


అలా పాపులర్ యూట్యూబర్..

రొడ్డకొట్టుడులా కాకుండా.. పదేళ్ల కిందటే మంచి కంటెంట్ క్రియేట్ చేసేది. ట్రావెల్ వ్లాగ్స్, పేరడీలు, సమా జంలో చూసిన విషయాలపై కామెడీషోలు చేసేది. దమ్మున్న కంటెంట్ ఉండటంతో.. 2015 సంవత్సరంలో లైమ్‌లైట్‌లోకి వచ్చిందీమె. 2017లో బాడీషేమింగ్ మీద 'షేమ్‌లెస్' అనే ర్యాప్ సాంగ్ చేసింది. ఆ తర్వాత పేరున్న యంగ్ తరంగ్స్‌తో బాడీ షేమింగ్ మీద కొన్ని కొలాబరే షన్స్ చేసింది. 2019 సెప్టెంబర్‌లో డెలిగేట్‌గా 'ఇంటర్నేష నల్ డే ఆఫ్ టోలరెన్స్' కార్యక్రమంకోసం ఏకంగా అమెరికా వెళ్లింది. అలాగే బాలీవుడ్‌లో అజయ్ దేవగణ్, హృతిక్ రోషన్, ఆయుష్మాన్ ఖురానా.. ఇలా ప్రముఖ స్టార్స్‌తో ఇంటర్వ్యూలు చేసే స్థాయికి ఎదిగింది. 2021లో యూత్ క్లైమేట్ సమ్మిట్ కోసం అమెరికా ఆహ్వానిం చింది. గూగుల్ సంస్థ నిర్వహించిన ఇంపాక్ట్ ఛాలెంజ్ ఫర్ ఉమన్ అండ్ గర్ల్స్ కార్య క్రమం కోసం అంతర్జాతీయ మహిళలను ఇంటర్వ్యూ చేసింది. బరాక్ ఒబామా భార్య మిచెల్లే, బిల్‌గేట్స్ లాంటి ప్రముఖులు మెచ్చిన 'ప్రజక్త కోలి' యూట్యూబర్‌గా అంతర్జాతీయ స్థాయికి ఎదిగింది.

బాలీవుడ్ కలలు..

ఆ తర్వాత బిగ్‌స్క్రీన్‌మీద కూడా కనప డాలనుకుంది. ముంబైలో ఉండటం.. బాలీవుడ్ సెలబ్రిటీ లతో పరిచయం.. ఇంట్లో వారి సహకారం కలిసొచ్చాయి. దీంతోపాటు నటిగా కూడా ప్రతిభ ఉండటంతో 'జగ్‌జగ్ జియో' చిత్రంలో నటించే అవకాశం వచ్చింది. అనిల్ కపూర్, నీతా కపూర్, వరుణ్ ధావన్.. నటించారీ చిత్రంలో. 'ప్రస్తుతం ఓ రొమాంటిక్ నావెల్ రాస్తున్నా. ఓటీటీ ప్లాట్‌ఫా మ్‌కూ ఓకే అయ్యింది. నటనతో పాటు దర్శకత్వం చేయ టమూ వచ్చు. ఏదేమైనా ఒక యూట్యూబర్‌గా మొదలెట్టి.. బాలీవుడ్ వరకూ రావటం ఓ అద్భుతమే. అందరికీ బాలీ వుడ్ అంటే కల.. అయితే త్వరలోనే మంచి నటిగా కని పిస్తా' అంటుంది ప్రజక్త కోలి. బాలీవుడ్‌లో నటించినా.. కంటెంట్ క్రియేటర్ జీవితం మర్చిపోను. ఈ ప్రవాహం ఆగదంటుందీమె.





మల్లన్న సాగర్‌కు భూకంపం ముప్పు!

- జలాశయం ప్రాంతంలో భూమి కింద నిట్టనిలువుగా భారీ చీలికలు
- హెచ్చరించిన ఎన్‌జీఆర్‌ఐ.. బేఖాతరు చేసిన నాటి రాష్ట్ర ప్రభుత్వం
- కాగ్ తాజా నివేదికలో వెల్లడి


హైదరాబాద్, జనవరి14(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంలో కీలక రిజర్వాయర్ అయిన మల్లన్నసాగర్‌ను నిర్మించిన ప్రాంతంలో.. భూకంపం ముప్పు ఉందని కేంద్రప్రభుత్వ సంస్థ ఎన్‌జీఆర్‌ఐ చేసిన హెచ్చరికలను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోకపోవటంపై కాగ్ ఆందోళన వ్యక్తం చేసింది. ఎలాంటి అధ్యయనాలు జరపకుండానే, తొందరపాటుతో మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టారని తెలిపింది. భూకంపం వస్తే రిజర్వాయర్ సమీప ప్రాంతాల్లోని ప్రజల ప్రాణాలు, ఆస్తులకు తీవ్ర ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై మూడేళ్లుగా సమగ్ర ఆడిట్ నిర్వహించిన కాగ్ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వానికి ముసాయిదా నివేదికను సమర్పించింది. ఈ నివేదిక ప్రకారం..

- మల్లన్న సాగర్ ప్రాథమిక డ్రాయింగ్స్‌ను 2016 ఆగస్టులో సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ చీఫ్ ఇంజనీర్ ఆమోదించే సమయంలో.. సైట్‌లో భూకంపాలు సంభవించే అవకాశాలపై ఎన్‌జీఆర్‌ఐ వంటి సంస్థలతో అధ్యయనం జరిపించాలని సలహా ఇచ్చారు. ఈ మేరకు రాష్ట్ర నీటిపారుదల శాఖ హైదరాబాద్‌లోని ఎన్‌జీఆర్‌ఐ డైరెక్టర్‌కు లేఖ రాయటంతో, అధ్యయనం చేసిన ఆ సంస్థ తన ప్రాథమిక నివేదికను మార్చి 2017లో సమర్పించింది. అయితే, ఈలోపే నీటిపారుదల శాఖ మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణం పనులను కాంట్రాక్టర్లకు అప్పగించింది.
- తెలంగాణ భూకంపాల ప్రమాదం తక్కువగా ఉండే సీస్మిక్ జోన్-2లో ఉన్నప్పటికీ.. 1967లో కోయినాలో, 1993లో లాతూర్‌లో 6.3 తీవ్రతతో వచ్చిన భూకంపాల వల్ల సీస్మిక్ జోన్-2లోని దక్షిణాది ప్రాంతం కూడా భూకంపాలకు అతీతం కాదని అవగతమైంది. 1983లో మేడ్చల్ ప్రాంతంలో 4.9తీవ్రతతో వచ్చిన భూకంపం ప్రభావం 200 కి.మీ వరకు కనిపించింది. నాటి భూకంప కేంద్రం భూగర్భంలో 15 కి.మీ. దిగువన ఉండగా, అది ప్రస్తుతం మల్లన్నసాగర్‌ను కట్టిన ప్రాంతం నుంచి 20 కి.మీ. దూరంలోనే ఉంది.
- మల్లన్న సాగర్ ప్రాంతం పరిధిలో సంభవించిన భూకంపాల చరిత్రను పరిగణలోకి తీసుకుంటే, 5 లేదా అంతకంటే ఎక్కువ తీవ్రతతో భూకంపం వస్తే కట్టడాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. ముఖ్యంగా, భూకంపాలను తట్టుకునే విధంగా కట్టని(నాన్ ఇంజనీర్డ్) నిర్మాణాలపై ప్రభావం ఎక్కువగా ఉంటుంది.
- మల్లన్నసాగర్ జలాశయాన్ని ప్రతిపాదించిన ప్రాంతంలో భూగర్భం చాలా లోతు వరకు నిలువునా చీలి ఉన్నట్టు, కదలికలూ చోటుచేసుకుంటున్నట్టు ఎన్‌జీఆర్‌ఐ ప్రాథమిక నివేదిక స్పష్టం చేసింది. ఈ జోన్‌లోని రాళ్లు సైతం పగుళ్లు, కోతలకు గురైనవేనని తెలిపింది. కనీసం మూడు జతల భారీ చీలికలు(3 సెట్స్ ఆఫ్ డామినెంట్ లీనమెంట్) భూగర్భంలో ఉన్నట్టు ఎన్‌జీఆర్‌ఐ పేర్కొంది. ఈ పరిస్థితులు సృష్టించే సమస్యలపై సమగ్ర సర్వే, పరిశోధనలు చేయాలని ఎన్‌జీఆర్‌ఐ సిఫారసు చేసింది.
- ఎన్‌జీఆర్‌ఐ నివేదికను, సిఫారసులను బేఖాతరు చేస్తూ ఎలాంటి సర్వేలు, అధ్యయనాలు చేపట్టకుండానే నిర్మాణం విషయంలో నీటిపారుదల శాఖ ముందుకు వెళ్లింది. మల్లన్నసాగర్ రిజర్వాయర్ దృఢత్వంపై, భూకంపం సంభవిస్తే కలిగే అపార నష్టంపై స్పష్టత లేకుండానే ఈ విధంగా వ్యవహరించటం తీవ్ర ఆందోళనకరం.
- కాళేశ్వరం ప్రాజెక్టులో అతిపెద్ద జలాశయమైన మల్లన్నసాగర్‌ను 50 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. దీని కింద 10.3 లక్షల ఎకరాల ఆయకట్టును ప్రతిపాదించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కింద ప్రతిపాదించిన మొత్తం ఆయకట్టులో సగానికి పైగా మల్లన్న సాగర్ కిందే ఉంది.

ముందే చెప్పాం.. అయినా వినలేదు

దక్షిణ భారతదేశంలోనే అతి పెద్ద లీనమెంట్ (భూగర్భంలో నిట్టనిలువునా పగుళ్లు) మల్లన్న సాగర్ ప్రాంతంలో ఉందని, ఆ రిజర్వాయర్ నిర్మాణానికి ముందే ప్రభుత్వాన్ని టీజేఏసీ తరఫున హెచ్చరించాం. పూర్తి స్థాయి నివేదికను ప్రభుత్వానికి అందజేశాం. ఈ ప్రాజెక్టు వద్ద ప్రమాదం జరిగే అవకాశాలు చాలా ఎక్కువ. భూకంపం సంభవిస్తే మల్లన్న సాగర్ బద్దలై నీళ్లు పరుగులు తీస్తాయి. ఎగువ, మిడ్, లోయర్ మానేరు డ్యాములతో సహా గంటల వ్యవధిలో కరీంనగర్ పట్టణం గోదావరిలో కలిసిపోతుంది.

- కె.రఘు, చైర్మన్, తెలంగాణ జేఏసీ



డిఫెన్స్‌లో బీడీఎల్ పాత్ర కీలకం

- 'అస్త్ర' క్షిపణిని ప్రారంభించిన రక్షణశాఖ సహాయమంత్రి అజయ్‌భట్

అల్వాల్, జనవరి14 (ఆంధ్రజ్యోతి): అత్యాధునికమైన ఎయిర్-టు-ఎయిర్ క్షిపణుల తయారీలో భారత డైనమిక్స్ లిమిటెడ్(బీడీఎల్) అంతర్జాతీయంగా పేరుగడించిందని, దేశ రక్షణ ఎగుమతులను పెంపొందించడంలో ఆ సంస్థ పాత్ర కీలకమైందని రక్షణశాఖ సహాయమంత్రి అజయ్‌భట్ ప్రశంసించారు. భారత వైమానిక దళానికి సరాఫరా చేసేందుకు స్వదేశీ పరిజ్ఞానంతో బీడీఎల్ తయారుచేసిన 'అస్త్ర' క్షిపణిని ఆయన ప్రారంభించారు. హైదరాబాద్ కంచన్‌బాగ్‌లోని బీడీఎల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా.. ఎయిర్-టు-ఎయిర్ మిస్సైలైన అస్త్రాను డీఆర్‌డీవో అభివృద్ధి చేసిందని, 100 కిలోమీటర్లకంటే ఎక్కువ దూరంలో ఉన్న లక్ష్యాన్ని కూడా ఈ క్షిపణి సునాయసంగా ఛేధిస్తుందని తెలిపారు. ఆత్మనిర్భర్ విధానానికి అనుగుణంగా స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన క్షిపణిని తయారు చేయడానికి బీడీఎల్ చేస్తున్న కృషిని అజయ్‌భట్ అభినందించారు. సీఎండీ మాధవరావు మాట్లాడుతూ 'మేక్ ఇన్ ఇండియా'పైనే బీడీఎల్ దృష్టి సారించిందని అన్నారు. అస్త్రా కోసం మిత్ర దేశాల నుంచి కూడా ఆర్డర్‌లు వస్తున్నాయన్నారు. దేశీయ, అంతర్జాతీయ డిమాండ్‌లకు అనుగుణంగా క్షిపణుల తయారీ సామర్థ్యాన్ని బీడీఎల్ పెంచుతుందని ఆయన వెల్లడించారు. జనవరి 12న డీఆర్‌డీవో ప్రయోగించిన ఆకాష్ ఎన్‌జీ క్షిపణిలో ఉపయోగించిన అత్యాధునిక రేడియో ఫ్రీక్వెన్సీ సీకర్‌తో సహా చాలా పరికరాలు బీడీఎల్‌లోనే తయారయ్యాయని ఆయన వివరించారు. రక్షణశాఖ సహాయమంత్రి అజయ్‌భట్ హైదరాబాద్ డీఆర్‌డీవోలోని డాక్టర్ అబ్దుల్ కలాం మిస్సైల్స్ కాంప్లెక్స్‌ను ఆదివారం సందర్శించారు. రీసెర్చ్ సెంటర్ ఇమరాత్‌లో నిర్వహిస్తున్న క్షిపణి సాంకేతికతలతో పాటు వాటికి సంబంధించిన వివరాలను సమీక్షించారు. స్వదేశీయంగా డీఆర్‌డీవో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆయన దగ్గరుండి పరిశీలించారు.

అసెంబ్లీ సచివాలయ సలహాదారుగా సూర్యదేవర ప్రసన్న కుమార్



న్యూఢిల్లీ, హైదరాబాద్, ఖమ్మం, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ శాసనసభ సచివాలయ సలహాదారుగా సూర్యదేవర ప్రసన్న కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అసెంబ్లీ కార్యదర్శి వి.నరసింహాచార్యులు ఉత్తర్వులు జారీ చేశారు. శాసనసభ, శాసనమండలికి ఆయన సేవలందిస్తారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సిఫారసులమేరకు ప్రసన్నకుమార్‌ను సలహాదారుగా నియమించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఆమోదం తెలిపారు. కేంద్ర ప్రభుత్వంలో వివిధ హోదాల్లో 30ఏళ్ల పాటు ప్రసన్న కుమార్ పనిచేశారు. ఆయన గతంలో ఐదేళ్లపాటు లోక్‌సభ స్పీకర్‌కు ఓఎస్డీగా పనిచేశారు. పార్లమెంట్ కోసం 'లోక్‌సభ టీవీ' పేరుతో స్పీకర్ నేతృత్వంలో టీవీ చానల్ ఏర్పాటులో ప్రసన్న కుమార్ కీలక పాత్ర పోషించారు.

మాల్దీవులకు వెళ్లట్లేదు: హీరో నాగార్జున

హైదరాబాద్, జనవరి 14: భారతదేశం మాల్దీవుల మధ్య ఉద్రిక్త వాతావరణం ఏర్పడిన వేళ టాలీవుడ్ కథానాయకుడు నాగార్జున తన మాల్దీవుల పర్యటనను రద్దు చేసుకున్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఎక్స్‌లో ఒక వీడియో విడుదల చేశారు. సెలవుల నిమిత్తం ఈ నెల 17న తాను మాల్దీవుల పర్యటనకు వెళ్లాల్సి ఉందని తెలిపారు. కానీ నిర్విరామంగా జరిగిన బిగ్‌బాస్ షో కార్యక్రమం, నా సామి రంగ సినిమా షూటింగుల వల్ల తాను చాన్నాళ్ల నుంచి తన కుటుంబంతో గడపలేదని చెప్పారు. అందుకే మాల్దీవుల పర్యటనను రద్దు చేసుకుని కుటుంబంతో గడపాలనుకుంటున్నట్లు తెలిపారు. వచ్చే వారం లక్షదీవులకు వెళ్తున్నట్లు నాగార్జున ప్రకటించారు.

ధరణితో రైతులకు కష్టాలే మిగిలాయి

- కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.కోదండరెడ్డి

యాచారం, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్‌తో రైతులకు కష్టాలే మిగిలాయని, ఆన్‌లైన్లో చాలా తప్పుడు రికార్డులు నమోదయ్యాయని కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.కోదండరెడ్డి అన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా యాచారంలో లీగల్ ఎంపవర్‌మెంట్ అండ్ అసిస్టెన్స్ ఫర్ ఫార్మర్స్ సొసైటీ (లీఫ్స్) సంస్థ రైతులకు అవగాహన సదస్సు నిర్వహించింది. దీనికి కోదండరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ధరణితో కలుగుతున్న ఇబ్బందులపై బాధితులు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా పరిష్కరించలేదన్నారు.

ఎమ్మెల్యే రాజాసింగ్‌కు బెదిరింపు ఫోన్లు

- శ్రీరామ నవమి శోభాయాత్ర చేయవద్దని హెచ్చరిక

మంగళ్‌హాట్, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు ఆదివారం బెదిరింపు ఫోన్లు వచ్చాయి. శ్రీరామనవమి శోభాయాత్ర చేస్తే.. చంపేస్తామని హెచ్చరించారు. దీనికి స్పందించిన రాజాసింగ్ "ఫోన్‌లో కాదు దమ్ము ఉంటే నేరుగా రావాలని" సవాల్ విసిరారు. తాను బెదిరింపులకు లొంగేవాడిని కాదని, శోభాయాత్ర చేసి తీరుతానని స్పష్టం చేశారు. తనకు 7199942827, 4223532270 నంబర్ల నుంచి కాల్స్ వచ్చాయని చెప్పారు. అయోధ్యలో రాముడి ప్రాణ ప్రతిష్ఠ నేపథ్యంలో రాజాసింగ్‌కు బెదిరింపులు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

బీసీ గణన తర్వాతే సర్పంచ్ ఎన్నికలు పెట్టండి

- సీఎం రేవంత్‌రెడ్డికి జాజుల శ్రీనివాస్‌గౌడ్ వినతి

సర్పంచుల పదవీకాలం మరో 15 రోజుల్లో ముగియనున్న నేపథ్యంలో.. బీసీ కులగణన ప్రక్రియ పూర్తిచేశాక గ్రామ పంచాయతీ ఎన్నికలు జరపాలని సీఎం రేవంత్‌రెడ్డిని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఆదివారం ఢిల్లీలోని ముఖ్యమంత్రి నివాసంలో రేవంత్‌రెడ్డిని కలిసిన ఆయన ఈ మేరకు విజ్ఞప్తిచేశారు.

స్పోర్ట్స్

సాత్విక్ జోడీకి రన్నరప్ ట్రోఫీ

చైనా జంటదే మలేసియా ఓపెన్



కౌలాలంపూర్: కెరీర్‌లో రెండో సూపర్ 1000 టైటిల్‌తో రికార్డు సృష్టిద్దామనుకున్న భారత బ్యాడ్మింటన్ సూపర్ స్టార్లు సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి ఆశలు ఫలించలేదు. మలేసియా ఓపెన్‌లో టోర్నీ ఆద్యంతం అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న సాత్విక్-చిరాగ్ జోడీ తుది మెట్టుపై బోల్తా పడింది. అయితే, ప్రపంచ టాప్ ర్యాంకరైన ప్రత్యర్థి జంటకు చివరిదాకా గట్టి పోటీ ఇచ్చి వెనుదిరిగింది. ఆదివారం హోరాహోరీగా జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో రెండోసీడ్ సాత్విక్-చిరాగ్ జంట 21-9, 18-21, 17-21తో చైనాకు చెందిన ప్రపంచ నెంబర్‌వన్ జోడీ లియాంగ్ వీ కెంగ్-వాంగ్ చాంగ్ చేతిలో పోరాడి ఓడింది. ఈ చైనా జోడీతో ఇప్పటిదాకా ఐదుసార్లు తలపడ్డ సాత్విక్ జంటకు ఇది నాలుగో ఓటమి. ఒకే ఒక్కసారి నిరుడు కొరియా ఓపెన్‌లో సాత్విక్ ద్వయం గెలిచింది.

క్రికెట్‌కు షాన్ మార్ష్ వీడ్కోలు



సిడ్నీ: ఆస్ట్రేలియా క్రికెటర్ షాన్ మార్ష్ ప్రొఫెషనల్ క్రికెట్‌కు ఆదివారం గుడ్‌బై చెప్పాడు. బిగ్ బాష్ లీగ్‌లో మెల్‌బోర్న్ రెనెగేడ్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న 40 ఏళ్ల మార్ష్..బుధవారం సిడ్నీ థండర్‌తో జరిగే మ్యాచే తన కెరీర్‌లో చివరిదని ప్రకటించాడు. మూడు ఫార్మాట్లలో ఆసీస్‌కు ఆడిన అతడు 13 సెంచరీలతో 5,200లకుపైగా పరుగులు చేశాడు. అయితే 2019 నుంచి టెస్టులు, వన్డేలు, 2016 నుంచి టీ20లకు మార్ష్ ఆస్ట్రేలియా జట్టుకు ఎంపిక కాలేదు.

న్యూజిలాండ్‌దే రెండో టీ20

హామిల్టన్: పాకిస్థాన్‌తో ఆదివారం జరిగిన రెండో టీ20లో న్యూజిలాండ్ 21 పరుగులతో నెగ్గింది. దాంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆతిథ్య జట్టు 2-0తో ఆధిక్యంలో నిలిచింది. తొలుత కివీస్ 20 ఓవర్లలో 194/8 స్కోరు చేసింది. ఫిన్ అలెన్ (74) హాఫ్ సెంచరీతో కదం తొక్కాడు. రౌఫ్ 3, అబ్బాస్ అఫ్రీది 2 వికెట్లు తీశారు. ఛేదనలో పాకిస్థాన్ 19.3 ఓవర్లలో 173 పరుగులకు ఆలౌటైంది. బాబర్ (66), ఫఖర్ జమాన్ (50) అర్ధ శతకాలతో మెరిశారు. మిల్నే 4, బెన్ సియర్స్, సోధి, సౌథీ తలా రెండేసి వికెట్లు పడగొట్టారు.

కుర్రాళ్లు కుమ్మేశారు

అదరగొట్టిన జైస్వాల్, దూబే



శివమ్ దూబే (63 నాటౌట్)



యశస్వి జైస్వాల్ (68)

రెండో టీ20లో భారత్ విజయం

అఫ్ఘానిస్థాన్‌తో సిరీస్ కైవసం

ఇండోర్: యువ బ్యాటర్లు యశస్వి జైస్వాల్ (34 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్స్‌లతో 68), శివమ్ దూబే (32 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లతో 63 నాటౌట్) దుమ్మురేపే అర్ధ శతకాలతో.. అఫ్ఘానిస్థాన్‌తో మూడు టీ20ల సిరీస్‌ను భారత్ మరో మ్యాచ్ మిగిలుండగానే సొంతం చేసుకొంది. ఆదివారం జరిగిన రెండో టీ20లో టీమిండియా 6 వికెట్లతో అఫ్ఘాన్‌ను చిత్తు చేసింది. తొలుత అఫ్ఘాన్ 20 ఓవర్లలో 172 పరుగులకు ఆలౌటైంది. గుల్బదిన్ నైబ్ (57) పోరాటం వృథా అయింది. అర్ష్‌దీప్ 3 వికెట్లు పడగొట్టగా.. అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్ చెరో 2 వికెట్లు దక్కించుకొన్నారు. ఛేదనలో భారత్ 15.4 ఓవర్లలో 4 వికెట్లకు 173 పరుగులు చేసి గెలిచింది. కోహ్లీ (16 బంతుల్లో 29) వేగంగా ఆడాడు. కరీమ్ 2 వికెట్లు పడగొట్టాడు. అక్షర్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది.

రోహిత్ విఫలం: ఛేదనలో జైస్వాల్, దూబే మూడో వికెట్‌కు 42 బంతుల్లో 92 పరుగులు జోడించడంతో టీమిండియా అలవోకగా నెగ్గింది. రోహిత్ (0) డకౌట్‌గా వెనుదిరిగాడు. కానీ, జైస్వాల్, కోహ్లీ రెండో వికెట్‌కు 57 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొన్నారు. ఏడాది తర్వాత టీ20ల్లోకి వచ్చిన విరాట్.. ప్రత్యర్థి బౌలర్లపై ఎదురుదాడితో అలరించారు. కోహ్లీ రెండు ఫోర్లతో జోరు చూపగా.. ఫరూఖీ బౌలింగ్‌లో జైస్వాల్ రెండు సిక్స్‌లు బాదాడు. ముజీబుర్ వేసిన 5వ ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్లతో విరుచుకుపడిన యశస్వి 19 పరుగులు రాబట్టాడు. అయితే, నవీనుల్ బౌలింగ్‌లో కోహ్లీ క్యాచవుట్ కావడంతో.. పవర్‌ప్లే ముగిసేసరికి భారత్ 69/2తో నిలిచింది. ఈ దశలో జైస్వాల్‌కు జత కలసిన దూబే ఎడాపెడా షాట్లతో పరుగుల వరద పారించాడు. 10వ ఓవర్‌లో నబీ బౌలింగ్‌లో జైస్వాల్ సింగిల్‌తో ఫిఫ్టీ పూర్తి చేసుకోగా.. దూబే హ్యాట్రిక్ సిక్స్‌లతో 21 పరుగులు పిండుకొన్నాడు. అయితే, గెలుపునకు 19 పరుగులు కావాల్సి ఉండగా.. జైస్వాల్, జితేష్ (0)ను కరీమ్ అవుట్ చేశాడు. కానీ, దూబే, రింకూ (9 నాటౌట్) మరో 26 బంతులు మిగిలుండగానే మ్యాచ్‌ను ముగించారు.

గుల్బదిన్ ఎదురుదాడి: గుల్బదిన్‌తోపాటు లోయరార్డర్ బ్యాటర్లు చెలరేగడంతో.. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన అఫ్ఘాన్ పోరాడగలిగే స్కోరు చేసింది. గుర్బాజ్ (14)ను బిష్ణోయ్ స్వల్ప స్కోరుకే అవుట్ చేసినా.. వన్‌డౌన్‌లో వచ్చిన గుల్బదిన్ భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. కెప్టెన్ ఇబ్రహీం (8)తో కలసి రెండో వికెట్‌కు 33 పరుగులు జోడించిన నైబ్.. నబీ (14)తో 4వ వికెట్‌కు 31 రన్స్ భాగస్వామ్యంతో జట్టును ఆదుకొన్నాడు. కానీ, నైబ్‌ను బోల్తా కొట్టించిన అక్షర్.. జట్టుకు కీలక బ్రేక్ అందించాడు. డెత్‌ఓవర్లలో నజీబుల్లా (23), కరీమ్ (20), ముజీబుర్ (21) బ్యాట్‌లు ఝుళిపించడంతో అఫ్ఘాన్ 170 మార్క్ దాటింది.

1 టీ20ల్లో భారత్‌పై అఫ్ఘాన్‌కిదే అత్యధిక స్కోరు.

టీ20 ఫార్మాట్‌లో 150 మ్యాచ్‌లు (పురుషుల క్రికెట్‌లో) ఆడిన తొలి క్రికెటర్‌గా రోహిత్. మహిళల్లో 161 మ్యాచ్‌లతో హర్మన్‌ప్రీత్ కౌర్‌ది అగ్రస్థానం.

స్కోరుబోర్డు

అఫ్ఘానిస్థాన్: గుర్బాజ్ (సి) దూబే (బి) బిష్ణోయ్ 14, ఇబ్రహీం (బి) అక్షర్ 8, గుల్బదిన్ (సి) రోహిత్ (బి) అక్షర్ 57, ఒమర్జాయ్ (బి) దూబే 2, నబీ (సి) అర్ష్‌దీప్ (బి) బిష్ణోయ్ 14, నజీబుల్లా (బి) అర్ష్‌దీప్ 23, కరీమ్ (సి) అక్షర్ (బి) అర్ష్‌దీప్ 20, ముజీబుర్ (రనౌట్/అర్ష్‌దీప్) 21, నూర్ (సి) కోహ్లీ (బి) అర్ష్‌దీప్ 1, నవీనుల్ (నాటౌట్) 1, ఫరూఖీ (రనౌట్/జైస్వాల్) 0; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 20 ఓవర్లలో 172 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-20, 2-53, 3-60, 4-91, 5-104, 6-134, 7-164, 8-170, 9-171; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-32-3, ముకేష్ 2-0-21-0, బిష్ణోయ్ 4-0-39-2, అక్షర్ 4-0-17-2, దూబే 3-0-36-1, సుందర్ 3-0-23-0.

భారత్: జైస్వాల్ (సి) గుర్బాజ్ (బి) కరీమ్ 68, రోహిత్ (బి) ఫరూఖీ 0, కోహ్లీ (సి) ఇబ్రహీం (బి) నవీనుల్ 29, దూబే (నాటౌట్) 63, జితేష్ (సి) నబీ (బి) కరీమ్ 0, రింకూ (నాటౌట్) 9; **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 15.4 ఓవర్లలో 173/4; వికెట్ల పతనం:** 1-5, 2-62, 3-154, 4-156; **బౌలింగ్:** ఫరూఖీ 3.4-0-28-1, ముజీబుర్ 2-0-32-0, నవీనుల్ 3-0-33-1, నూర్ 3-0-35-0, నబీ 2-0-30-0, కరీమ్ 2-0-13-2.

11 ఓవరాల్‌గా టీ20ల్లో 200 వికెట్ల క్లబ్‌లో చేరిన అక్షర్.. ఈ ఘనత సాధించిన 11వ భారత బౌలర్‌గా నిలిచాడు.



అక్షర్ పటేల్ (2/17)

షూటింగ్‌లో మరో రెండు స్వర్ణాలు

జకార్తా: ఆసియా షూటింగ్ ఒలింపిక్ క్వాలిఫయర్స్‌లో భారత క్రీడాకారుల జోరు కొనసాగుతోంది. ఆదివారం నాడు రెండు స్వర్ణాలు దక్కించుకున్నారు. పురుషుల 25 మీటర్ల వ్యక్తిగత స్టాండర్డ్ పిస్టల్ ఈవెంట్‌లో యోగేశ్ సింగ్ టాప్‌లో నిలిచి పసిడి అందుకున్నాడు. ఇక, టీమ్ ఈవెంట్‌లోనూ సత్తా చాటుతూ అమిత్ కుమార్, ఓం ప్రకాశ్‌లతో కలిసి యోగేశ్ రెండో స్వర్ణం గెలిచాడు.

ఢిల్లీ-పట్నా హోరాహోరీ

మ్యాచ్ టై

జైపూర్: ప్రొ కబడ్డీ తాజా సీజన్‌లో మరో మ్యాచ్ టై అయింది. ఆదివారం జరిగిన పోరులో ఢిల్లీ దబాంగ్-పట్నా పైరేట్స్ హోరాహోరీగా తలపడడంతో 39-39తో స్కోరు సమమైంది. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 36-31తో తమిళ్ తలైవాస్‌పై గెలిచింది.

ఆట మారె..విజయం దక్కె!

న్యూజిలాండ్‌పై భారత్ గెలుపు

మహిళల హాకీ ఒలింపిక్ క్వాలిఫయర్స్



రాంచీ: ఒలింపిక్ క్వాలిఫయర్స్ తొలి మ్యాచ్‌లో ఓటమి పాలైన మన హాకీ అమ్మాయిలు..రెండో పోరులో జూలు విదిల్చారు. ఆదివారం జరిగిన గ్రూప్ 'బి' మ్యాచ్‌లో 3-1తో న్యూజిలాండ్‌ను మనోళ్లు చిత్తు చేశారు. తద్వారా పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించే అవకాశాలను సజీవంగా ఉంచుకున్నారు. సంగీత కుమారి (ఒకటో నిమిషం), నేహ (12వ), డుంగ్ డుంగ్ బ్యూటీ (14వ) భారత్‌కు గోల్స్ అందించారు. హల్ మేగన్ (9వ) కివీస్ తరఫున ఏకైక గోల్ సాధించింది. మంగళవారం జరిగే తదుపరి మ్యాచ్‌లో ఇటలీతో భారత్ తలపడుతుంది. మరో మ్యాచ్‌లో అమెరికా 2-0తో ఇటలీపై గెలిచింది.

చెమటోడ్చిన జొకో

- రెండోరౌండ్‌కు నొవాక్
- సబలెంకా, వోజ్నియాకి ముందంజ

ఆస్ట్రేలియన్ ఓపెన్



మెల్‌బోర్న్: క్రొయేషియాకు చెందిన 18 ఏళ్ల డినో ప్రిజ్మిక్ డిఫెండింగ్ చాంపియన్ నొవాక్ జొకోవిచ్‌కు ఆస్ట్రేలియన్ ఓపెన్ తొలిరౌండ్‌లో ముచ్చెమటలు పట్టించాడు. 2005లో నొవాక్ గ్రాండ్‌స్లామ్ అరంగేట్రం చేసిన సమయంలో ఇంకా పుట్టని డినో..దిగ్గజ ఆటగాడైన ప్రత్యర్థిని మూడు చెరువుల నీళ్లు తాగించాడు. అయితే తన అనుభవాన్నంతా రంగరించిన 36 ఏళ్ల జొకో ఆదివారం జరిగిన సింగిల్స్ తొలిరౌండ్లో 6-2, 6-7 (5), 6-3, 6-4 స్కోరుతో ప్రిజ్మిక్‌పై నెగ్గి ఊపిరి పీల్చుకున్నాడు. మిగతా ఆటగాళ్లలో ఐదో సీడ్ రుబ్లేవ్ ఐదు సెట్లు పోరాడి 7-5 6-4, 3-6, 4-6, 7-6 (6) థియాగో సెబోత్‌పై గెలిచాడు. నాలుగో సీడ్ జానిక్ సిన్నర్ 6-4, 7-5, 6-3తో బోటిక్‌ని, 12వ సీడ్ టేలర్ ఫ్రిట్జ్ 4-6, 6-3, 3-6, 6-2, 6-4తో ఫకుండో డియాజ్‌ని, మునార్ 6-3, 6-3, 6-1తో షెవచంకోని ఓడించి ముందంజ వేశారు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో డిఫెండింగ్ చాంప్ సబలెంకా 6-0, 6-1తో సీడిల్‌పై, 8వ సీడ్ సకారి 6-4, 6-1తో హిబినోపై, 9వ సీడ్ క్రెజికోవా 2-6, 6-4, 6-2తో హొంటామాపై నెగ్గారు. తల్లయ్యాక తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ ఆడుతున్న 2018 విజేత వోజ్నియాకి 6-2, 2-0తో 20వ సీడ్ మగ్దలినాపై నెగ్గి రెండో రౌండ్ చేరింది. గాయంతో మగ్దలినా రెండో సెట్‌నుంచి వైదొలగింది. అమండా 6-3, 6-4తో 13వ సీడ్ లుడ్మిలాకు షాకిచ్చింది.

18 నుంచి ఉప్పల్ టెస్టు టిక్కెట్ల అమ్మకం

హైదరాబాద్: భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య ఈనెల 25న ఉప్పల్ స్టేడియంలో మొదలయ్యే తొలి టెస్టు మ్యాచ్‌కు టిక్కెట్ల అమ్మకం ఈనెల 18 నుంచి జరగనున్నట్టు హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు ఆదివారం ప్రకటించారు. 18 నుంచి ఆన్‌లైన్ ద్వారా పేటీఎం ఇన్‌సైడర్ యాప్‌లో, మిగిలిన టిక్కెట్లను 22వ తేదీ నుంచి ఆన్‌లైన్‌తో పాటు జింఖానాలోని హెచ్‌సీఏ స్టేడియంలో ఆఫ్‌లైన్ ద్వారా అందుబాటులో ఉంచనున్నారు. ఐదు టెస్టుల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ ఉప్పల్‌లో జరగనుంది.

సాయుధ దళాల సిబ్బందికి ఉచిత ప్రవేశం..: రిపబ్లిక్ డే (26వ తేదీ)ను పురస్కరించుకొని ఆరోజు తెలంగాణలో పనిచేస్తున్న భారత సాయుధ దళాల (ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్) సిబ్బంది, వారి కుటుంబాలతో కలిసి ఉచితంగా మ్యాచ్ చూసే అవకాశం కల్పిస్తున్నట్టు హెచ్‌సీఏ తెలిపింది. ఆసక్తిగల వారు తమ విభాగాధిపతితో సంతకం చేయించిన లేఖ, కుటుంబసభ్యుల వివరాలను ఈనెల 18లోపు హెచ్‌సీఏ సీఈవోకి ఈ-మెయిల్ చేయాలి. కాగా, పాఠశాల విద్యార్థులకు రోజుకు ఐదువేలు చొప్పున మొత్తం ఐదురోజులకు గాను 25వేల కాంప్లిమెంటరీ పాసులు కేటాయించినట్లు హెచ్‌సీఏ తెలిపింది.

ఇవీ ధరలు

టెస్టు మ్యాచ్‌కు ప్రారంభ ధర కనిష్ఠంగా రూ. 200 కాగా, గరిష్ఠంగా రూ. 4వేలుగా నిర్ణయించారు. స్టాండ్‌ల వారీగా టిక్కెట్ల ధరలు రూ. 200, రూ. 499, రూ. 750, రూ. 1250.. కార్పొరేట్ బాక్స్‌ల టిక్కెట్ల ధరలు రూ. 3వేలు, రూ. 4వేలుగా ఉన్నాయి. రోజువారీ గాకుండా, ఐదురోజుల సీజన్ టిక్కెట్ల ధరలు రూ. 1500, రూ. 2250, రూ. 3750 కాగా.. కార్పొరేట్ బాక్స్‌ల ధరలు రూ. 12వేలు, రూ. 16వేలు.

సెంట్రల్ బ్యాంక్ ఫెస్టివల్ ఆఫర్

మార్చి 31వరకు పొడిగింపు

న్యూఢిల్లీ: రిటైల్ రుణాలకు డిమాండు పెరుగుతున్న నేపథ్యంలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రస్తుత ఫెస్టివల్ ఆఫర్‌ను మార్చి 31 వరకు పొడిగిస్తున్నట్టు ప్రకటించింది. ఫెస్టివల్ ఆఫర్ కింద వివిధ రుణాలపై కస్టమర్లకు తక్కువ వడ్డీరేటు, ప్రాసెసింగ్ ఫీజు ఎత్తివేత, ఇతర సదుపాయాలు కల్పిస్తున్నట్టు బ్యాంకు జనరల్ మేనేజర్ వివేక్ కుమార్ ప్రకటించారు. సెంట్ గృహలక్ష్మి, సెంట్ బిజినెస్ స్కీమ్‌ల కింద 8.35 శాతం నుంచి ప్రారంభించి తక్కువ వడ్డీకే రుణాలందిస్తున్నట్టు తెలిపారు.

లుపిన్ ఔషధానికి ఎఫ్‌డీఏ అనుమతి

న్యూఢిల్లీ: లుపిన్ కంపెనీ తయారుచేసే రక్తపోటుకు వాడే జనరిక్ ఔషధం ప్రొప్రానొలాల్ హైడ్రోక్లోరైడ్ ఎక్స్‌టెండెడ్ రిలీజ్ క్యాప్సూల్స్‌కు అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ ఎఫ్‌డీఏ అనుమతి లభించింది. ఈ ఔషధాన్ని పీథంపూర్ ప్లాంట్‌లో వివిధ పరిమాణాల్లో తయారుచేస్తారు.

బీ న్యూలో సంక్రాంతి ఆఫర్లు



హైదరాబాద్: ఎలక్ట్రానిక్ రిటైలింగ్‌లోని బీ న్యూ సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకుని కస్టమర్లకు ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. ప్రతీ స్మార్ట్‌ఫోన్ కొనుగోలుపై రూ.9999 క్యాష్‌బాక్‌తో పాటు రూ.7999 వరకు కచ్చితమైన బహుమతి అందిస్తున్నట్టు కంపెనీ సీఎండీ వై బాలాజీ తెలిపారు. అలాగే బజాజ్ ఫైనాన్స్ ద్వారా చేసిన కొనుగోళ్లకు రూ.9000 క్యాష్‌బాక్, రూ.3000 వరకు ఆర్‌బీఎల్ రివార్డ్ పాయింట్లు, ఎస్‌బీఐ కార్డుపై కొనుగోళ్లకు రూ.5000 వరకు క్యాష్‌బాక్ అందిస్తున్నట్టు చెప్పారు. ఎంపిక చేసిన టీవీ, ల్యాప్‌టాప్‌లపై రూ.17,999 విలువ గల 120డబ్ల్యూ సౌండ్‌బార్ ఉచితంగా అందిస్తున్నామని, బ్రాండెడ్ యాక్సెసరీలపై 80 శాతం రాయితీ ఇస్తున్నామని వెల్లడించారు. బీన్యూ యాపిల్ డేస్ కింద జనవరి 13 నుంచి 18 వరకు కస్టమర్లకు ఆన్‌లైన్ కన్నా తక్కువ ధరకే ప్రైస్ గ్యారంటీ ఇస్తున్నామన్నారు.

వినియోగం పెంచడం పైనే గురి

ఫిబ్రవరి 1న మధ్యంతర బడ్జెట్



న్యూఢిల్లీ: వచ్చే నెల ఒకటో తేదీన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టబోతున్న మధ్యంతర బడ్జెట్లో వినియోగ డిమాండు పెంపునకే పెద్ద పీట వేయవచ్చు. అలాగే ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో నీరసించిన వ్యవసాయ రంగానికి చేయూత ఇచ్చే చర్యలు కూడా ప్రకటించే ఆస్కారం ఉంది. ఆర్థికమంత్రి ఫిబ్రవరి 1వ తేదీన మధ్యంతర బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టబోతున్నారు. ఆమెకి ఇది వరుసగా ఆరో బడ్జెట్. పేరుకి ఇది మధ్యంతర బడ్జెట్ అయినప్పటికీ వినియోగ, వ్యవసాయ రంగాల ఉత్తేజానికి కొన్ని కీలక చర్యలు ప్రకటించే సూచనలు కనిపిస్తున్నాయంటున్నారు. సాధారణంగా మధ్యంతర బడ్జెట్ అంటే లోక్‌సభ ఎన్నికలు ముగిసి, కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు కేంద్ర ప్రభుత్వ దైనందిక ఖర్చులకు అవసరమైన కేటాయింపులు మాత్రమే ఉంటాయి. అయితే కొన్ని అత్యవసర సమస్యల పరిష్కారానికి ఆర్థికమంత్రి మధ్యంతర బడ్జెట్‌లో చర్యలు తీసుకునే వెసులుబాటు ఉంటుంది.

వ్యవసాయ రంగం

ఈ ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధిరేటు ఏడు శాతంపైనే ఉన్నా, వ్యవసాయ వృద్ధిరేటు మాత్రం 1.8 శాతం మించదని సర్వేలు తెలుపుతున్నాయి. వర్షాభావంతో ఖరీఫ్ దిగుబడులు గణనీయంగా తగ్గాయి. జలాశయాల్లో నీటి మట్టాలు అడుగంటడంతో రబీ సీజన్ కూడా అంత ఆశాజనకంగా కనిపించడంలేదు. దీంతో వచ్చే మధ్యంతర బడ్జెట్‌లో ఆర్థికమంత్రి సీతారామన్ వ్యవసాయ రంగానికి ప్రత్యేక కేటాయింపులు జరిపే అవకాశం ఉందని భావిస్తున్నారు.

వినియోగ డిమాండ్ అంతంతే

గత ఆర్థిక సంవత్సరం దేశంలో వినియోగ వస్తువుల ఉత్పత్తి 5.3 శాతం పెరిగింది. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-నవంబర్ మధ్య కాలంలో అది 0.6 శాతానికి పడిపోయింది. ధరల సెగతో వినియోగం తగ్గడం ఇందుకు ప్రధాన కారణమని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఈ ప్రభావంతో ప్రజల ఆదాయాలకు కూడా గండి పడింది. ఏది కొనాలన్నా ఒకటికి నాలుగు సార్లు ఆలోచించాల్సి వస్తోంది. దీంతో వచ్చే మధ్యంతర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి ఈ దిశగా ప్రత్యేక చర్యలు తీసుకోక తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది. ఇందుకోసం గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేటాయింపులు పెంచడంతో పాటు, పట్టణ పేదల కోసం కొన్ని ప్రత్యేక చర్యలు తీసుకునే అవకాశం ఉంది. వీటికి తోడు మధ్య తరగతి వేతన జీవుల చేతుల్లో మిగులు నిధులు పెంచేందుకు కూడా ఆర్థిక మంత్రి ప్రస్తుత పన్ను శ్లాబుల్ని మరింత కుదించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఫార్మాని ఆదుకోండి

వంరోవైపు ఫార్మా రంగం కూడా తన బడ్జెట్ కోరికల చిట్టా విప్పింది. పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ) కార్యకలాపాలను మరింత ప్రోత్సహించడంతో పాటు, 2047 నాటికి 40,000 నుంచి 45,000 కోట్ల డాలర్ల స్థాయికి చేరుకునేందుకు అవసరమైన దీర్ఘకాలిక విధానాలు మధ్యంతర బడ్జెట్‌లో ప్రకటించాలని కోరింది. ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ (ఐపీఏ) సెక్రటరీ జనరల్ సుదర్శన్ జైన్ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఇందుకోసం ప్రత్యక్ష-పరోక్ష పన్నుల రాయితీలతో పాటు, సులభతర వ్యాపార విధానం ప్రకటించాలని కోరారు.

22300 పైన బుల్లిష్

(జనవరి 15-19 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

టెక్ వ్యూ

గత వారం నిఫ్టీ : 21894 (+183)

నిఫ్టీ గత వారం 21928-21449 పాయింట్ల మధ్యన కదలాడి 183 పాయింట్ల లాభంతో 21894 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 22300 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.


- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 21269, 20591, 19819, 19353 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి : 22300 బ్రేక్‌డౌన్ స్థాయి : 21500

నిరోధ స్థాయిలు : 22100, 22200, 22300 (22000 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు : 21700, 21600, 21500 (21800 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



14వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	550
15 జనవరి		విశాఖపట్నం	599
చిత్తూరు	563	వరంగల్	542
గోదావరి	550	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	107	గోదావరి	106
వరంగల్	107	విజయవాడ	106
కరీంనగర్	107	గుంటూరు	107
మహబూబ్‌నగర్	107	ఒంగోలు	107
కర్నూలు	107	చిత్తూరు	108
విశాఖపట్నం	101		

22,000 వద్ద ప్రధాన అడ్డంకి!

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు అంచనాలను మించి రాణిస్తున్నాయి. కరెక్షన్ ఏర్పడుతుందని ఎప్పటికప్పుడు అనుకుంటున్నా సూచీలు జీవిత కాల గరిష్ఠాలకు చేరుతున్నాయి. ఈ వారంలోనూ అదే ట్రెండ్ కొనసాగే అవకాశం ఉంది. అయితే నిఫ్టీకి 22,000 వద్ద ప్రధాన అడ్డంకి ఉంది. దీన్ని బ్రేక్ చేస్తే 22,440-22,500 స్థాయికి చేరవచ్చు. ఒకవేళ పరిస్థితులు అనుకూలించకపోయినా 21,800 వద్ద కీలక మద్దతు కనిపిస్తోంది. అది కూడా బ్రేక్ చేస్తే నిఫ్టీ 50 మరింత పతనమై 21,650-21,500 స్థాయిలను తాకే అవకాశం ఉంది. అయితే ఇదంతా అంతర్జాతీయ పరిణామాలు, ద్రవ్యోల్బణం, కంపెనీల మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలపై ఆధారపడి ఉంటుంది. లేదా కొన్నాళ్ల పాటు ప్రస్తుత స్థాయిలోనే స్తబ్దుగా కొనసాగవచ్చు.

ఈ వారం స్టాక్ రికమండేషన్స్

మహానగర్ గ్యాస్: ప్రస్తుతం ఈ కౌంటర్ కన్సాలిడేషన్ దశలో ఉంది. జెఫరీస్ రేటింగ్ తర్వాత డెలివరీ, ట్రేడింగ్ వాల్యూమ్స్ భారీగా పెరిగాయి. గత వారం ఎన్‌ఎస్ఈలో మహానగర్ గ్యాస్ కంపెనీ షేర్లు రూ.1,264.20 వద్ద ముగిశాయి. రూ.1,320/1,400 టార్గెట్‌తో రూ.1,250 శ్రేణిలో ఈ కౌంటర్‌లో పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.1,210ని గట్టి స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

అలెంబిక్ ఫార్మా: రూ.700-800 మధ్య ఈ కౌంటర్లో చక్కని బేస్ ఏర్పడింది. చివరి రెండు సెషన్స్‌లోనే ఈ కంపెనీ షేర్లు 11 శాతం పెరిగాయి. ఎన్ఎస్ఈలో శుక్రవారం అలెంబిక్ ఫార్మా కంపెనీ షేర్లు రూ.880.55 వద్ద ముగిశాయి. రూ.1,050 టార్గెట్‌తో రూ.850 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.815ను కచ్చితమైన స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.

ఐఆర్ఎఫ్‌సీ: కొన్నేళ్ల పాటు రూ.20-30 మధ్య ట్రేడైన ఐఆర్ఎఫ్‌సీ కౌంటర్లో గత ఏడాది ఆగస్టు నుంచి అప్‌ట్రెండ్ ప్రారంభమైంది. నెల రోజుల్లోనే రూ.90కు చేరుకుంది. మళ్లీ కరెక్షన్‌కు లోనై రూ.80 వద్ద కన్సాలిడేట్ అయింది. శుక్రవారం రూ.114 వద్ద ముగిసింది. డెలివరీ, ట్రేడింగ్ వాల్యూమ్స్ కూడా పెరిగాయి. రూ.125/155 లక్ష్యంతో రూ.100/110 వద్ద మదుపరులు ఈ కౌంటర్‌లో పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.92ని గట్టి స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.

టీటీకే ప్రెస్టిజ్ : ఈ కంపెనీ షేర్లు ప్రస్తుతం కన్సాలిడేషన్‌లో ఉన్నాయి. కొత్త ఏడాది ప్రారంభం నుంచి మూమెంటమ్ పుంజుకుంది. శుక్రవారం రూ.769 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో రూ.825-880 టార్గెట్‌తో మదుపరులు రూ.740-760 మధ్య పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.725ను గట్టి స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం, మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్

niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

టెక్ వ్యూ

ప్రధాన నిరోధం 22000



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం బలమైన రియాక్షన్‌లో ప్రారంభమైనా ప్రధాన నిరోధం 21500 కన్నా పైన రికవరీ సాధించి మరింత పురోగమించింది. చివరి రెండు రోజుల్లో మరింత బలమైన రికవరీతో ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి 21830ని కూడా ఛేదించి చివరికి 21900 సమీపంలో ముగిసింది. ప్రధాన ట్రెండ్ సానుకూలంగానే ఉన్నా కీలక మానసిక అవధి 22000కు సమీపంలో నిలిచి ఉండడం గమనించాల్సిన అంశం. నిఫ్టీ గత 12 వారాల్లో అప్‌ట్రెండ్‌లోనే కొనసాగుతూ 2300 పాయింట్ల వరకు లాభపడింది. టీసీఎస్, ఇన్ఫోసిస్ ఫలితాల మద్దతుతో గత వారం రికార్డు స్థాయిలకు దూసుకుపోయినా ద్రవ్యోల్బణం ఆశించిన స్థాయి కన్నా పైనే ఉండడంపై ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాల్సి ఉంది.

బుల్లిష్ స్థాయిలు: నిఫ్టీ ఇప్పుడు మానసిక అవధి 22000 వద్ద పరీక్ష ఎదుర్కొనేందుకు సమాయత్తం అవుతోంది. మరింత అప్‌ట్రెండ్ కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. ఆ పైన మరింత పై శిఖరాలకు నూతన గరిష్ఠ స్థాయిలకు పరుగులు తీస్తుంది.

బేరిష్ స్థాయిలు : 22000 వద్ద విఫలమైతే స్వల్ప అప్రమత్తతను సూచిస్తుంది. రియాక్షన్‌కు గురైనా భద్రత కోసం ప్రధాన మద్దతు స్థాయి 21800 వద్ద నిలదొక్కుకుని తీరాలి. విఫలమైతే స్వల్పకాలిక బలహీనతలో పడుతుంది. మరో ప్రధాన మద్దతు స్థాయి 21500.

బ్యాంక్ నిఫ్టీ : గత నాలుగు వారాలుగా ఈ సూచీ మైనర్ కరెక్షన్‌లో ఉంది. గత వారం కీలక స్థాయి 47000 వద్ద రికవరీ సాధించినా 450 పాయింట్ల నష్టంతో 47700 సమీపంలో ముగిసింది. పాజిటివ్ ధోరణిలో ట్రేడయితే మరింత అప్‌ట్రెండ్ కోసం ప్రధాన నిరోధం 48200 కన్నా పైన నిలదొక్కుకోవాలి. బలహీనత ప్రదర్శిస్తే దిగువన 47300, 47000 వద్ద మద్దతు ఉంది.

పాటర్న్ : 21800 వద్ద బ్రేకౌట్ సాధించినందు వల్ల పుల్ బ్యాక్ రియాక్షన్ ఉండవచ్చు. ట్రేడర్లు అప్రమత్తంగా ఉండాలి. 21800 వద్ద రెండు టాప్‌లను కలుపుతూ "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా దిగజారితే అప్రమత్తం కాక తప్పదు.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	22000, 22080
మద్దతు	21860, 21800

www.sundartrends.in



ఆదిత్య ఎల్ 1 సోలార్ అబ్జర్వేటరీ

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

భారతదేశపు తొలి సోలార్ అబ్జర్వేటరీ ఉపగ్రహం 'ఆదిత్య ఎల్ 1' నాలుగు నెలల ప్రయాణానంతరం విజయవంతంగా తన గమ్యస్థానమైన లాంగ్రేజ్ పాయింట్-1 (ఎల్ 1) వద్ద గల హాలో ఆర్బిట్‌లో ప్రవేశించింది. ఈ విజయంతో సూర్యుడిని అధ్యయనం చేసేందుకు అబ్జర్వేటరీని పంపిన అయిదో దేశంగా భారత్ నిలిచింది.

గతంలో అమెరికా, బ్రిటన్, యురోపియన్ స్పేస్ ఏజెన్సీ, జపాన్ తమ అబ్జర్వేటరీ ఉపగ్రహాలను సూర్యుని అధ్యయనానికి పంపాయి.

ఆదిత్య ఎల్ 1 సోలార్ అబ్జర్వేటరీ అంటే?


'ఆదిత్య' అంటే సంస్కృతంలో 'సూర్యుడు' అనీ; ఎల్ 1 అంటే 'లాంగ్రేజ్ పాయింట్ 1' అనీ అర్థం. భూమికి సూర్యునికి మధ్య ఉన్న లాంగ్రేజ్ పాయింట్ 1 వద్ద గల హాలో ఆర్బిట్‌లో ఈ అబ్జర్వేటరీని ప్రవేశపెడతారు. అందుకే దీనికి 'ఆదిత్య ఎల్ 1' అని నామకరణం చేశారు.

సౌర వాతావరణాన్ని, ఖగోళంలో సౌర ప్రభావాలను (సోలార్ డైనమిక్స్) అధ్యయనం చేసేందుకు ఏడు పేలోడ్లతో రూపొందించిన అంతరిక్ష అబ్జర్వేటరీ ఉపగ్రహమే 'ఆదిత్య ఎల్ 1 సోలార్ అబ్జర్వేటరీ'. దీని మొత్తం బరువు 1475 కేజీలు.

లాంగ్రేజ్ పాయింట్ 1 అంటే?

లాంగ్రేజ్ పాయింట్స్ అంటే రెండు ఖగోళ వస్తువుల గురుత్వాకర్షణ బలాలు సమానంగా పనిచేసే ప్రదేశాలు. ఇలా రెండు గురుత్వాకర్షణ బలాలు సమంగా ఆ ప్రదేశాల్లో ఉండడం వల్ల ఏదైనా చిన్న వస్తువు అక్కడ పరిభ్రవిుంచేందుకు కావాల్సిన అభికేంద్ర బలం (సెంట్రిపెటల్ ఫోర్స్) సమకూరుతుంది. అందుకే ఈ లాంగ్రేజ్ పాయింట్స్ వద్ద ఉపగ్రహాలు అతి తక్కువ ఇంధన వినియోగంతో స్థిరంగా పరిభ్రమిస్తాయి.

సూర్యునికి భూమికి మధ్య అయిదు లాంగ్రేజ్ పాయింట్స్ ఉన్నాయి. వీటిలో ఎల్ 1 పాయింట్ నుంచి సూర్యుడిని నిరంతరాయంగా ఎటువంటి అడ్డంకులు(గ్రహణాలు/ఛాయలు) లేకుండా పరిశీలించవచ్చు. ఎల్ 4, ఎల్ 5 పాయింట్లు భూమికి సూర్యునికి మధ్యలో కాక వాటితో త్రిభుజ కోణాకృతితో ఉంటాయి. ఎల్ 2 పాయింట్ భూమికి వెనక, ఎల్ 3 పాయింట్ సూర్యుని వెనక ఉంటాయి. కాబట్టి సూర్యుడి నుంచి భూమి వైపుగా వచ్చే సౌర తుఫాన్‌లను అధ్యయనం చేయాలంటే ఈ రెంటి మధ్య గల ఎల్ 1 పాయింట్ మాత్రమే సరైన ఎంపిక. అందుకే సోలార్ అబ్జర్వేటరీని భూమి నుంచి 15 లక్షల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎల్ 1 పాయింట్ ప్రాంతపు హాలో ఆర్బిట్‌లో దీర్ఘవృత్తాకార కక్ష్యలో ప్రవేశపెట్టారు.



ఆదిత్య ఎల్ 1 ప్రయోగం

ఆదిత్య ఎల్ 1 సోలార్ అబ్జర్వేటరీని 2023 సెప్టెంబరు 2న శ్రీహరి కోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి పీఎస్ఎల్‌వీ-ఎక్స్‌ఎల్(సీ 57) రాకెట్ ద్వారా ప్రయోగించారు. 127 రోజుల ప్రయాణం తరవాత ఇది 2024 జనవరి 6న గమ్యస్థానాన్ని చేరింది. భూమి నుంచి 15 కోట్ల కిలోమీటర్ల దూరంలో ఉన్న సూర్యుడిని పరిశీలించేందుకు, భూమి నుంచి 15 లక్షల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎల్ 1 పాయింట్ వద్ద ఒక స్థిర దీర్ఘవృత్తాకార కక్ష్యలో ఈ అబ్జర్వేటరీ పరిభ్రమిస్తూ ఉంటుంది. అంతేతప్ప ఈ అబ్జర్వేటరీ గానీ అందులోని పేలోడ్లు కానీ సూర్యుని పైకి/సమీపానికి వెళ్లవు. అంటే భూవికి సూర్యునికి మధ్య గల దూరంలో కేవలం ఒక శాతం దూరం వరకు మాత్రమే ఇది ప్రయాణిస్తుంది.

ఆదిత్య ఎల్ 1 విజయవంతంగా పూర్తిచేసిన దశలు

ఈ ప్రయోగంలో ఆదిత్య ఎల్ 1 మొత్తం మూడు దశలను పూర్తిచేసి నిర్దేశిత కక్ష్యను చేరింది.

తొలిదశ: ఎల్ 1 వైపు సుదీర్ఘ ప్రయాణం సాగించేందుకు కావాల్సిన వేగాన్ని(వెలాసిటీ) సంపాదించేందుకు 16 రోజులపాటు భూ నిమ్న కక్ష్య(లో ఎర్త్ ఆర్బిట్)లో దీర్ఘవృత్తాకారంలో తన పరిధిని ప్రతి ఆవృత్తానికీ క్రమంగా పెంచుకుంటూ భూమి చుట్టూ అయిదు పరిభ్రమణలు పూర్తిచేసింది. ఒక రాయికి తాడు చుట్టి తిప్పుతూ కావాల్సిన వేగం సాధించినట్లుగా దీనిని నిర్వహించారు. భూమి నుంచి ఎల్ 1కు నేరుగా చేరేందుకు పీఎస్ఎల్‌వీ-ఎక్స్‌ఎల్ సామర్థ్యం సరిపోదు కనుక అదనపు సామర్థ్యం కోసం ఇస్రో ఈ వ్యూహాన్ని అనుసరించింది.

రెండో దశ: ఎల్ 1 వైపు ప్రయాణించేందుకు కావాల్సిన వేగం సాధించిన తరవాత 'ఆన్ బోర్డ్ ప్రొపల్షన్'ను వినియోగించి శాస్త్రవేత్తలు దీనిని సంధించారు. ఈ క్రమంలో ఉపగ్రహం భూమ్యాకర్షణ శక్తిని దాటి ఎల్ 1 వైపు 110 రోజులు ప్రయాణించింది. దీనిని 'క్రూయిజ్ ఫేజ్' అంటారు.

మూడో దశ: ఉపగ్రహం ఎల్ 1 సమీపానికి చేరాక ఒక పరిభ్రమణం చేసి భూమి, సూర్యుల మధ్య ఎల్ 1 చుట్టూ సమాంతర(దీర్ఘవృత్తాకార) కక్ష్యను ఏర్పరచి అయిదేళ్లపాటు ఆ కక్ష్యలో పరిభ్రమిస్తూ సూర్యుడిని నిరంతరం పరిశీలిస్తూ ఉంటుంది.

ఆదిత్య ఎల్ 1లోని పరికరాలు-వాటి పరిశోధనలు

ఈ అబ్జర్వేటరీ ఉపగ్రహంలో దేశీయంగా తయారు చేసిన ఏడు పేలోడ్స్ ఉన్నాయి. వీటిలో అయిదింటిని ఇస్రో తయారుచేయగా రెంటిని ఇస్రో సహకారంతో దేశంలోని విద్యా సంస్థలు తయారు చేశాయి.

ఈ పేలోడ్లలో నాలుగు రిమోట్ సెన్సింగ్ తరహా పేలోడ్లను సూర్యుని వైపుగా కేంద్రీకరించి నిరంతరం సూర్యుడిని పరిశీలించేందుకు ఉద్దేశించారు. మూడు ఇన్ సిటూ తరహా పేలోడ్లు ఉపగ్రహం వెనక భాగంలో ఉండి ఎల్ 1 ప్రాంతంలో సౌర ప్రభావాలను(ఖగోళంలో సోలార్ డైనమిక్స్) అధ్యయనం చేస్తాయి.

పేలోడ్స్ వివరాలు

రిమోట్ సెన్సింగ్ పేలోడ్స్

విజిబుల్ ఎమిషన్ లైన్ కరోనాగ్రాఫ్: ఇది సూర్యుని బాహ్య వాతావరణానికి చెందిన కరోనా ప్రాంతాన్ని అధ్యయనం చేస్తుంది. సూర్యుని ఉపరితలంలో సంభవించే భారీ పేలుళ్లు, సౌర తుఫాన్‌ల తీరును పరిశీలిస్తుంది.

సోలార్ అల్ట్రా వయొలెట్ ఇమేజింగ్ టెలిస్కోప్: అతినీలలోహిత కాంతి ప్రాంతంలో ఫొటోస్ఫియర్, క్రోమోస్ఫియర్‌ల చిత్రాలను తీయడంతోపాటు సూర్యకిరణాలు/కాంతిపుంజాల్లోని వ్యత్యాసాలను పరిశీలిస్తుంది. దీనిని ఇస్రో సహకారంతో ఇంటర్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్(పుణె) అభివృద్ధి చేసింది.

సోలార్ లో ఎనర్జీ ఎక్స్‌రే స్పెక్ట్రోమీటర్, హై ఎనర్జీ ఎల్ 1 ఆర్బిటింగ్ ఎక్స్‌రే స్పెక్ట్రోమీటర్: ఈ రెండు పేలోడ్లు సూర్యుడి నుంచి ఉద్భవించే ఎక్స్‌రే జ్వాలలను అధ్యయనం చేస్తాయి. వీటిని ఇస్రోకు చెందిన యూఆర్.రావు శాటిలైట్ సెంటర్(బెంగళూరు) తయారు చేసింది.

ఇన్ సిటు పేలోడ్స్

ఆదిత్య సోలార్ విండ్ పార్టికల్ ఎక్స్‌పరిమెంట్, ప్లాస్మా అనలైజర్ ప్యాకేజ్ ఫర్ ఆదిత్య: ఈ పేలోడ్లు సోలార్ పవనాలను, ఎనర్జిటిక్ అయాన్లను ఖగోళంలో వాటి శక్తి వ్యాప్తిని అధ్యయనం చేస్తాయి. ఏఎస్‌పీఈఎక్స్‌ను అహ్మదాబాద్‌లోని ఫిజికల్ రీసెర్చ్ ల్యాబొరేటరీ సంస్థ, పీఏపీఏని తిరువనంతపురంలోని స్పేస్ ఫిజిక్స్ ల్యాబొరేటరీ విక్రం సారాభాయి స్పేస్ సెంటర్ తయారుచేశాయి. ఈ రెండు సంస్థలు ఇస్రోకు చెందినవి.

మాగ్నటోమీటర్: ఎల్ 1 వద్దగల అంతర్‌గ్రహ అయస్కాంత క్షేత్రాలను కొలిచే సామర్థ్యం దీనికి ఉంది. దీనిని ఇస్రోకు చెందిన ల్యాబొరేటరీ ఎలక్ట్రో ఆప్టిక్స్ సిస్టమ్స్(బెంగళూరు) అభివృద్ధి చేసింది.

ఆదిత్య ఎల్ 1 ప్రయోగ లక్ష్యాలు-ఉపయోగాలు

- సూర్యుని ఉపరితలంలో సంభవించే భారీ పేలుళ్లు, సౌర తుఫాన్‌ల తీరును అధ్యయనం చేసేందుకు వాటిని వెంటనే పసిగట్టి అంతరిక్ష శాటిలైట్లను, భూమి మీద ఉన్న సమాచార వ్యవస్థలను రక్షించేందుకు ఈ అబ్జర్వేటరీ ఉపగ్రహం సహకరిస్తుంది.
- సౌరకుటుంబంలో శక్తికి కేంద్రంగా గ్రహాలకు మూలాధారంగా ఉన్న సూర్యుని అధ్యయనం చేయడం ద్వారా విశ్వం, సౌర కుటుంబం పుట్టుక-అంతాల సమాచారాన్ని సేకరించవచ్చు.
- మనకు అతి దగ్గరగా ఉన్న సూర్యుని అధ్యయనం ద్వారా కేంద్రక సంలీన చర్యలను పరిశీలించి తద్వారా నేటి క్లీన్ ఎనర్జీ పరిశోధనల్లో మరింత పురోగతి సాధించవచ్చు.
- సౌర తుఫాన్‌లు, సౌర జ్వాలలు, అయస్కాంత క్షేత్రాలు, ఎనర్జిటిక్ అయాన్లు, కరోనల్ మాస్ ఎజెక్షన్స్, అత్యధిక ఉష్ణోగ్రతల ఆవిర్భావం, ప్రసరణ, సౌర వాతావరణంలోని వైవిధ్యాల సమాచారాన్ని నిర్దిష్టంగా తెలుసుకోవచ్చు.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

టీఎస్‌పీఎస్సీ/ ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం



లెటర్ సిరీస్

ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నలలో కొన్ని అక్షరాలు కలిసి ఒక సమూహంగా ఏర్పడతాయి. ఈ అక్షర సమూహాల్లో మధ్య మధ్య కొన్ని అక్షరాలు వదిలేస్తారు. ప్రశ్నగా ఇచ్చిన సిరీస్ ఏ క్రమపద్ధతిని అనుసరిస్తున్నదో తెలుసుకోనేందుకు ఐచ్ఛికాలలో పేర్కొన్న అక్షరాలను ప్రశ్నలోని ఖాళీలలో పూరించి సిరీస్ అవగాహన చేసుకోవాలి. సమాధానాలుగా ఇచ్చిన వాటిలోని ఏ ఆప్షన్‌లో గల అక్షరాలను ఖాళీలలో పూరిస్తే ఆ సిరీస్ క్రమపద్ధతిని అనుసరిస్తుందో, ఆ ఆప్షన్‌ను సమాధానంగా గుర్తించాలి.

ఈ విభాగానికి సంబంధించిన సిరీస్‌లు ఏవిధంగా ఉంటాయో, గత వివిధ పోటీ పరీక్షలలో ఇస్తున్న, ముఖ్యమైన సిరీస్ పద్ధతులను అభ్యర్థులకు ఈ చాప్టర్‌పై అవగాహన కలిగించేందుకు దిగువ పేర్కొన్నాం. ఇచ్చిన సిరీస్‌లను అభ్యర్థులను కనీసం అయిదు లేదా ఆరుసార్లు చదివి జాగ్రత్తగా పరిశీలించి సిరీస్ అక్షరాల విభజన, సిరీస్ ఏర్పడే విధానం, వాటి స్వభావంపై అవగాహన ఏర్పరచుకొని ఈ చాప్టర్‌పై పట్టు సాధించాలని ఆశిస్తున్నాం.

ఈ టాపిక్‌కు సంబంధించిన ప్రశ్నల్లో ఉండే అక్షరాలు ఎక్కువగా a, b, c లేదా L, M, N లేదా P, Q, R అయి ఉంటాయి.

వివిధ రకాలైన సిరీస్ పద్ధతులు

1. **ab/ ab/ ab/ ab/ ab/ ab.**
రెండేసి అక్షరాలు ఒక సమూహంగా రిపీట్ అవుతున్నాయి.

2. **PQR/ PQR/ PQR/ PQR/ PQR**
మూడేసి అక్షరాలు ఒక సమూహంగా రిపీట్ అవుతున్నాయి.

3. **kmlm/ kmlm/ kmlm/ kmlm**
నాలుగేసి అక్షరాలు ఒక సమూహంగా రిపీట్ అవుతున్నాయి.

4. **adbca/ adbca/ adbca/ adbca**
అయిదేసి అక్షరాలు ఒక సమూహంగా రిపీట్ అవుతున్నాయి.

5. **adcbca/ adcbca/ adcbca**
ఆరేసి అక్షరాలు ఒక సమూహంగా రిపీట్ అవుతున్నాయి.

6. **PQ/ PPQQ/ PPPQQQ/ PPPPQQQQ**
మొదటి సమూహంలో రెండు అక్షరాలు, రెండో సమూహంలో నాలుగు అక్షరాలు, మూడో సమూహంలో ఆరు అక్షరాలు, నాలుగో సమూహంలో ఎనిమిది అక్షరాలు ఉన్నాయి. మొదటి సమూహంలో ఒక PQ, రెండో సమూహంలో రెండు Pలు, రెండు Qలు, మూడో సమూహంలో మూడు Pలు, మూడు Qలు, నాలుగో సమూహంలో, నాలుగు Pలు, నాలుగు Qలు ఉన్నాయి.

7. **aabbcc/ aabbcc/ aabbcc**
రెండు aలు, రెండు bలు, రెండు cలు కలిసి ఒక సమూహంగా రిపీట్ అవుతున్నాయి.

8. **abba/ baab/ abba/ baab/ abba.**
మొదటి సమూహం abba ఈ సమూహంలో చివరి రెండు అక్షరాలు (ba) రెండో సమూహంలో మొదటగా, మొదటి రెండు అక్షరాలు ab రెండో సమూహంలో చివరగా ఏర్పడింది. రెండో సమూహంలో చివరి రెండు అక్షరాలు ab మూడో సమూహంలో మొదటగా, రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలు ba మూడో సమూహంలో చివరగా ఈ విధంగా ఒక క్రమపదతిని అనుసరిస్తూ ఈ సిరీస్ ఏర్పడింది.

9. **LMN/ LLMN/ LLMMN/ LLMMNN**
మొదటి సమూహంలో మూడు అక్షరాలు, రెండో సమూహంలో నాలుగు అక్షరాలు, మూడో సమూహంలో అయిదు అక్షరాలు, నాలుగో సమూహంలో ఆరు అక్షరాలు ఉన్నాయి. మొదటి సమూహంలోని అక్షరాలన్నీ ఉంటూ రెండో సమూహంలో ఒక 'L' అదనంగా వచ్చింది. రెండో సమూహంలోని అక్షరాలన్నీ ఉంటూ మూడో సమూహంలో ఒక 'M' అదనంగా చేరింది. మూడో సమూహంలోని అక్షరాలన్నీ ఉంటూ నాలుగో సమూహంలో ఒక 'N' అదనంగా చేరింది. ఈవిధంగా ఒక క్రమపద్ధతిని అనుసరిస్తూ సిరీస్ ఏర్పడింది.

10. **aabbcc/ bbccaa/ ccaabb**
మొదటి సమూహంలోని చివరి నాలుగు అక్షరాలు రెండో సమూహంలో మొదటగా, మొదటి సమూహంలో మొదటి రెండు అక్షరాలు రెండో సమూహంలో చివరిగా రాయడమైనది. అదేవిధంగా రెండో సమూహంలో చివరి నాలుగు అక్షరాలు మూడో సమూహంలో మొదటగా, రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలు మూడో సమూహంలో చివరిగా రాయడమైనది. ఈవిధంగా ఒక కచ్చితమైన చైన్ పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.

11. **abc/ bca/ cab/ abc**
మొదటి సమూహంలో చివరి రెండు అక్షరాలు రెండో సమూహంలో మొదటగా, మొదటి సమూహంలోని మొదటి అక్షరం రెండో సమూహంలో చివరి అక్షరంగా ఏర్పడింది. అదేవిధంగా రెండో సమూహంలోని చివరి రెండు అక్షరాలు మూడో సమూహంలో మొదటగా, రెండో సమూహంలోని మొదటి అక్షరం మూడో సమూహంలో చివరి అక్షరంగా ఏర్పడినది ఈ విధంగా ఒక కచ్చితమైన చైన్ పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.

12. **abcac/ bcaba/ cabcb/ abcac**
ఈ సిరీస్‌లో అండర్‌లైన్ చేసిన abc/ bca/ cab/ abcలకు 11వ మోడల్‌కు సంబంధించిన వివరణే. ప్రతి మూడు అక్షరాల తరవాత ఏర్పడిన రెండు అక్షరాలు ఆ సమూహాల్లోని 1, 3 అక్షరాలే రిపీట్ అయినవిగా భావించగలరు. ఈవిధంగా ఒక కచ్చితమైన పద్ధతిని ఈ సిరీస్ అనుసరించినది.

13. **abc/ b/ bca/ c/ cab/ a/ abc/ b**
ఈ సిరీస్‌లో అండర్‌లైన్ చేసిన abc/ bca/ cab/ abcలకు 11వ మోడల్‌కి సంబంధించిన వివరణే. ప్రతి మూడు అక్షరాల తరవాత ఏర్పడిన ఒక అక్షరం దాని ముందు సమూహంలోని మధ్య అక్షరమే మరల రిపీట్ అయినదిగా భావించగలరు.

14. **a/ ab/ abc/ abcd/ dcba/ cba/ ba/a**
మొదటి సమూహంలో ఒక అక్షరం, రెండో సమూహంలో రెండు వరుస అక్షరాలు, మూడో సమూహంలో మూడు వరుస అక్షరాలు, నాలుగో సమూహంలో నాలుగు వరుస అక్షరాలు ఉన్నాయి. అయిదో సమూహంలో నాలుగో సమూహంలోని అక్షరాల రివర్స్ ఆరో సమూహంలో మూడో సమూహంలోని అక్షరాల రివర్స్, ఏడో సమూహంలో రెండో సమూహంలోని అక్షరాల రివర్స్, ఏర్పడి ఎనిమిదో సమూహంగా మొదటి అక్షరమే ఏర్పడినది.

15. **PPP/ QQQ/ RRR/ PPP**
ప్రతి సమూహంలోను ఒక అక్షరమే మూడుసార్లు రిపీట్ అయినది.

16. **klmn/ lmkn/ mkln/ klmn/ lmkn**
మొదటి సమూహంలోని మధ్య రెండు అక్షరాలు రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, మొదటి సమూహంలోని మొదటి, చివరి అక్షరాలు రెండో సమూహంలో మూడో, నాలుగో అక్షరాలుగా ఏర్పడ్డాయి. రెండో సమూహంలోని మధ్య రెండు అక్షరాలు, మూడో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా రెండో సమూహంలోని మొదటి, చివరి అక్షరాలు మూడో సమూహంలో మూడో, నాలుగో అక్షరాలుగా ఏర్పడ్డాయి. అదేవిధంగా మూడో సమూహంలోని మధ్య రెండు అక్షరాలు నాలుగో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, మూడో సమూహంలో మొదటి, చివరి అక్షరాలు నాలుగో సమూహంలో మూడో, నాలుగో అక్షరాలుగా ఏర్పడినవి. ఈవిధంగా ఒక క్రమపద్ధతిని అనుసరిస్తూ ఈ సిరీస్ ఏర్పడినది.

17. **PRPR/ QSQS/ PRPR/ QSQS**
PRPR/QSQS అక్షరాల సమూహాలు రెండుసార్లు రిపీట్ అయినవి.

18. **ad/ aadd/ aaaddd/ aaaadddd**
మొదటి సమూహంలో ఒక ad, రెండో సమూహంలో రెండు aలు రెండు dలు, ఒక సమూహంగా, మూడో సమూహంలో మూడు aలు, మూడు dలు ఒక సమూహంగా, నాలుగో సమూహంలో నాలుగు aలు, నాలుగు dలు ఒక సమూహంగా ఈవిధంగా ఒక క్రమపద్ధతిని అనుసరిస్తూ ఈ సిరీస్ ఏర్పడినది..



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

తెలంగాణ వ్యవసాయరంగం ప్రభుత్వ కార్యక్రమాలు



వ్యవసాయరంగ అభివృద్ధి, రైతు సంక్షేమం దృష్ట్యా తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న కార్యక్రమాలు కింది విధంగా ఉన్నాయి.

రైతుబంధు(పెట్టుబడి మద్దతు)

వ్యవసాయ ప్రక్రియలో ప్రాథమిక ఉత్పాదకాల ఖర్చులను తీర్చడానికి పెట్టుబడి మద్దతుగా 'రైతుబంధు' పథకాన్ని 2018లో రాష్ట్రం ఆరంభించింది. దీనిని 'వ్యవసాయ పెట్టుబడి మద్దతు పథకం - రైతుబంధు' అని అధికారిక నామకరణం చేశారు. విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు మొదలైన ఉత్పాదకాల కొనుగోలు, కూలీల వ్యయం నిమిత్తం ప్రతి పంట సీజన్‌లో ఎకరానికి రూ.4,000 ఇచ్చారు. 2019-20 నుంచి ప్రతి సీజన్‌లో, ప్రతి ఎకరానికి రూ.5000 ఇస్తున్నారు. తదనంతరం ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ యోజన పేరిట కేంద్రప్రభుత్వం, కృషిక్ సహాయం పేరిట ఒడిషా ప్రభుత్వం, ముఖ్యమంత్రి కృషి ఆశీర్వాద్ యోజన పేరిట జార్ఖండ్ ప్రభుత్వం కూడా రైతుబంధు లాంటి పథకాలు ఆరంభించాయి. ఆంధ్రప్రదేశ్‌లో రైతు కుటుంబానికి ఏడాదికి రూ.7,500, జార్ఖండ్‌లో సన్న, చిన్నకారు రైతులకు ఏడాదికి రూ.5,000, పశ్చిమబెంగాల్‌లో ఎకరం లేదా అంతకంటే ఎక్కువ సాగుభూమికి ఏడాదికి రూ.10,000 ఆయా రాష్ట్రప్రభుత్వాలు అందిస్తున్నాయి.

2018-19 నుంచి 2022-23 మధ్యకాలంలో రైతుబంధు కింద రాష్ట్రప్రభుత్వం వెచ్చించిన మొత్తాన్ని కింది పట్టికలో చూడవచ్చు. **పట్టిక-1:** రైతుబంధు కింద రాష్ట్రప్రభుత్వం వెచ్చించిన మొత్తం

సంవత్సరం	రైతుబంధు కింద వెచ్చించిన మొత్తం (రూ.కోట్లలో)
2018-19	10,486
2019-20	10,532
2020-21	14,658
2021-22	14,773
2022-23	14,743

పై పట్టిక ప్రకారం తెలంగాణ రాష్ట్రప్రభుత్వం రైతుబంధు కింద 2018-19లో రూ.10,486 కోట్లు వెచ్చించగా 2022-23లో రూ.14,743 కోట్లు అందించింది.

రైతుబంధు కింద భూ కమతాల వారీగా లబ్ధిదారుల సంఖ్యను కింది పట్టికలో చూడవచ్చు. **పట్టిక-2:** రైతుబంధు లబ్ధిదారుల సంఖ్య(భూ కమతాల వారీగా)

రైతు	సంఖ్య(లక్షల్లో) 2020-21	2021-22	2022-23
ఉపాంత రైతు 2.47 ఎ.రాల.వరకు	40.63	43.71	47.86
చిన్న రైతు 2.48-4.94 ఎకరాలు	11.36	11.53	11.50
సెమీ మీడియం 4.95-9.88 ఎకరాలు	5.03	4.89	4.73
మీడియం 9.89-21.78	0.93	0.89	0.85
పెద్ద రైతు 24.78 ఎ.రాల కంటే ఎక్కువ	0.06	0.06	0.06

పై పట్టిక ప్రకారం 2022-23లో మొత్తం లబ్ధిదారుల్లో ఉపాంత రైతులు 47.86 లక్షలు, చిన్న రైతులు 11.50 లక్షలు, సెమీ మీడియం రైతులు 4.73 లక్షలు, మీడియం రైతులు 85,000, పెద్ద రైతులు ఆరువేలుగా ఉన్నారు. ఈ పథకం ప్రారంభించినప్పటి నుంచి 2022-23 వరకు 1211 లక్షల ఎకరాలకు రైతుబంధును వర్తింపచేశారు.

వ్యవసాయ పరపతి-పంట రుణాల మాఫీ

2015లో రూ.41,300 కోట్ల వ్యవసాయ పరపతిని బ్యాంకుల ద్వారా అందించగా 2022లో రూ.87,591 కోట్లు చెల్లించారు.

2014 ఏప్రిల్ 1న లేదా ఆ తరవాత మంజూరు చేసిన, లేదా పునరుద్ధీకరించి 2018 డిసెంబరు 11 నాటికి బకాయిలుగా ఉన్న పంట రుణాలను ఒక్కో కుటుంబానికి గరిష్ఠంగా ఒక లక్ష వరకు ప్రభుత్వం రుణమాఫీ చేసింది. ఇందుకోసం రూ.16,144 కోట్లను వెచ్చించారు. 35.32 లక్షల మంది రైతులు లబ్ధి పొందారు.

రుణమాఫీ

ఏకారణంతోనైనా 18 నుంచి 59 సంవత్సరాల వయసు గల రైతులు మరణిస్తే కుటుంబ సభ్యులు/ఆధారపడిన వారికి ఆర్థిక ఉపశమనం కోసం 2018లో 'రైతుబీమా'ను రాష్ట్రప్రభుత్వం ఆరంభించింది. పథకం కింద నమోదు చేసుకున్న రైతు ప్రీమియం రాష్ట్రప్రభుత్వమే చెల్లించి రైతు మరణించిన పది రోజుల్లో రూ.5లక్షల బీమా మొత్తాన్ని ఆధారపడిన వారికి/ కుటుంబ సభ్యులకు అందించడం జరుగుతుంది. రైతుబీమా కింద బీమా పొందినవారి సంఖ్య 2018-19 నుంచి 2021-22 వరకు కిందివిధంగా ఉంది. **పట్టిక-3:** రైతుబీమా పొందినవారి సంఖ్య

సంవత్సరం	రైతుబీమా పొందినవారి సంఖ్య
2018-19	17,666
2019-20	19,020
2020-21	29,070
2021-22	23,093

పై పట్టిక ప్రకారం 2018-19లో 17,666 రైతుబీమా కింద పరిష్కరించిన క్లెయిమ్‌లు ఉండగా, 2020-21లో 29,070 ఉన్నాయి. అయితే 2021-22లో 23,093గా ఉన్నాయి. 2018-19 నుంచి 2021-22 వరకు రైతుబీమా కింద చెల్లించిన మొత్తాన్ని కింది పట్టికలో చూడవచ్చు. **పట్టిక-4:** రైతుబీమా కింద చెల్లించిన మొత్తం

సంవత్సరం	రైతుబీమా చెల్లించిన మొత్తం(రూ.కోట్లలో)
2018-19	883
2019-20	951
2020-21	1454
2021-22	1155

పై పట్టిక ప్రకారం రైతుబీమా కింద చెల్లించిన మొత్తం 2018-19లో రూ.883 కోట్లు ఉండగా 2020-21లో రూ.1454 కోట్లు కాగా 2021-22లో రూ.1155 కోట్లుగా ఉంది.

నీటిపారుదల

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరవాత నీటిపారుదల రంగానికి సంబంధించి ప్రభుత్వ చర్యల కారణంగా కాళేశ్వరం ప్రాజెక్టు(18.25 లక్షల ఎకరాలు), సీతారామ ఎత్తిపోతల పథకం(3.87 లక్షల ఎకరాలు), జె.చొక్కారావ్ దేవాదుల ఎత్తిపోతల పథకం(5.58 లక్షల ఎకరాలు), రాజీవ్ బీమా ఎత్తిపోతల పథకం(2.03 లక్షల ఎకరాలు), మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం(12.30 లక్షల ఎకరాలు), దేవాదుల ఎత్తిపోతల పథకం(3.61 లక్షల ఎకరాలు) పురోగతిలో ఉన్నాయి.

27,742 చెరువులను పునరుద్ధరించారు. మొత్తం 1200 చెక్‌డ్యామ్స్‌లో మొదటిదశలో 638 పురోగతిలో ఉన్నాయి. ఫలితంగా 2014-15 నుంచి 2021-22 వరకు నీటిపారుదల స్థూల విస్తీర్ణంలో వచ్చిన పెరుగుదలను కింది పట్టికలో చూడవచ్చు. **పట్టిక-5:** రాష్ట్రంలో స్థూల నీటిపారుదల విస్తీర్ణంలో వచ్చిన మార్పు.

సంవత్సరం	రాష్ట్రంలో మొత్తం నీటిపారుదల విస్తీర్ణం (లక్ష ఎకరాలో)
2014-15	62.48
2015-16	50.10
2016-17	74.32
2017-18	78.38
2018-19	77.37
2019-20	113.27
2020-21	136.86
2021-22	135.60

పై పట్టిక ప్రకారం చూస్తే తెలంగాణలో స్థూల నీటిపారుదల విస్తీర్ణం 2014-15లో 62.48 లక్షల ఎకరాలు ఉండగా 2021-22లో 135.60 లక్షల విస్తీర్ణంగా ఉంది. అంటే 74.32 లక్షల ఎకరాల అదనపు నీటిపారుదల సామర్థ్యం తెలంగాణ ఏర్పడిన తరవాత పెరిగింది.

వ్యవసాయానికి ఉచిత విద్యుత్

2018 జనవరి 1 నుంచి రాష్ట్రంలోని వ్యవసాయ వినియోగదారులకు 24 గంటల ఉచిత, నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నది. మొత్తం విద్యుత్ సరఫరాలో 40 శాతం వ్యవసాయ రంగానికి జరుగుతున్నది. రాష్ట్రంలో మొత్తం వ్యవసాయ కనెక్షన్ల సంఖ్య 26.22 లక్షలుగా ఉంది. 2014-15 నుంచి 2022-23 వరకు ఉచిత విద్యుత్ సరఫరా కోసం ప్రభుత్వం రూ.49,314 కోట్లు సబ్సిడీగా వెచ్చించింది.

వ్యవసాయ యాంత్రీకరణ సబ్సిడీ

రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి 6.66 లక్షలమంది రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ కోసం రూ.963 కోట్లను ప్రభుత్వం సబ్సిడీగా అందించింది. రాష్ట్రంలో 19607 ట్రాక్టర్లను సబ్సిడీతో అందించింది.

రైతు వేదికలు

రైతులందరినీ ఒక వేదిక దగ్గరకు చేర్చి చర్చలు/ సంప్రదింపుల ద్వారా వ్యవసాయ దిగుబడిని మెరుగుపరిచే ఉద్దేశంతో ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి క్లస్టర్‌లో 1-3 రైతు వేదికల నిర్మాణం చేపట్టారు. ఒక్కో రైతువేదిక నిర్మాణానికి రూ.22 లక్షలు వెచ్చించి రాష్ట్రంలో 2,601 రైతు వేదికలు నిర్మించారు.

గిడ్డంగి సౌకర్యాల పెంపు

రాష్ట్రం ఏర్పడిన తరవాత వ్యవసాయ మార్కెటింగ్ శాఖ నాబార్డు సహాయంతో 347 ప్రదేశాల్లో 457 గిడ్డంగులను నిర్మించింది. ఫలితంగా రాష్ట్రంలో మొత్తం గిడ్డంగుల సంఖ్య 1167కు ధాన్యం నిల్వ సామర్థ్యం 24.73 లక్షల మెట్రిక్ టన్నులకు పెరిగింది.



డా.ఎం.ఏ.మాలిక్ అసోసియేట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కూకట్‌పల్లి, హైదరాబాద్.

పల్లెకళ ముందు వెలవెల!

సంక్రాంతికి తరలిన జనం.. ఖాళీగా హైదరాబాద్.. బోసిపోయిన రోడ్లు, కూడళ్లు, సిటీ బస్ స్టాపులు, మాల్స్

హైదరాబాద్ సిటీ, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జనవరి 14(ఆంధ్రజ్యోతి): పట్నానికి పట్నం బండి గీరలు కట్టుకొని పల్లెకు తరలిపోయిందా? ఎందుకంటే మన హైదరాబాద్ హైదరాబాద్ మాదిరిగా కనిపించడం లేదు మరి! నిత్యం రద్దీగా ఉండే రోడ్లు ఊపిరి పీల్చుకుంటున్నాయి. పొద్దున్నుంచి రాత్రి దాకా కనిపించే ఆ వాహనాల వరుస.. ట్రాఫిక్ జాంలు లేవు. దద్దరిల్లిపోయే హారన్ల మోత లేదు. గ్రీన్ చానల్ ఏర్పాటు చేసినట్లు రోడ్లన్నీ ఖాళీగా కనిపిస్తున్నాయి! మియాపూర్, కూకట్‌పల్లి, ఖైరతాబాద్, హైటెక్‌సిటీ, ఎల్బీనగర్ సహా ప్రధాన కూడళ్లను చూస్తే నిత్యం రద్దీగా కనిపించే ఆ కూడళ్లేనా? అనిపించాయి. కిటకిటలాడే సిటీ బస్సుల్లో జనమే లేరు. వెలుగుజిలుగుల షాపింగ్ మాల్స్‌దీ అదే వెలవెల! ఇదంతా భాగ్యనగర మీద్ద సంక్రాంతి పండుగ వేసిన సంబురాల వల! పూతరేకులు, అరిసెలు, జంతికల రుచులు.. కోడిపందాల సందళ్ల మధ్య సంక్రాంతి మజాను ఆస్వాదించాలంటే పుట్టి పెరిగిన ఊళ్లోనే సాధ్యం! సో.. బిజీలైఫ్ అనే చట్రం నుంచి బయటపడి.. పచ్చని పల్లెల్లో వాలిపోయి ఆప్తుల పలకరింపుల మధ్య సేదతీరేందుకు నగర జనం పల్లెకు పోయింది. ఫలితంగా ఏదో మంత్రం వేసినట్లుగా హైదరాబాద్ ఖాళీ అయిపోయింది. భోగి పండుగ ముందురోజు వరకు కిక్కిరిసిపోయిన హైదరాబాద్ మహానగరం.. ఆదివారం బోసిపోయింది. సిటీ బస్సులు పెద్దగా కనిపించలేదు. ఆ బస్సుల్లోనూ జనం కనిపించలేదు. బస్ స్టాపులు, సూపర్ మార్కెట్లూ ఖాళీగా కనిపించాయి. రద్దీ లేకపోవడంతో రోడ్లపై వాహనదారులు ఝుమ్మంటూ దూసుకెళ్లారు. ట్రాఫిక్ రద్దీ మధ్య నగర రోడ్ల మీద కొన్నిసార్లు 10 కి.మీ ప్రయాణానికే గంట సమయం పట్టేది. ఆదివారం 20 కి.మీ ప్రయాణాన్ని కూడా అర గంటలోనే ముగించి గమ్యస్థానాలకు చేరుకున్నారు. కాలనీలు, బస్తీల్లో మాత్రం చిన్నారులు పతంగులు ఎగురవేస్తూ సందడి చేశారు. ట్యాంక్‌బండ్, అమరవీరుల స్తూపం, సెక్రటేరియట్, సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ వంటి ప్రాంతాల్లో జనం సందడి బాగా కనిపించింది. పండుగ రోజును ప్రశాంతంగా, సంతోషంగా గడపడానికి పిల్లాపాపలతో నగరవాసులు అక్కడికి చేరుకొని పతంగులు ఎగురవేయడం, పలు పర్యాటక ప్రాంతాలను తిలకించి ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ ఎంజాయ్ చేశారు.



ఖాళీగా ఉన్న సచివాలయం రోడ్డు

బస్, రైల్వే స్టేషన్లు కిటకిట..

సంక్రాంతికి జనం సొంతూళ్లకు వెళుతుండటంతో మూడు రోజులుగా ప్రయాణికుల రద్దీతో బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు కిటకిటలాడుతున్నాయి. ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్, ఎల్బీనగర్ బస్టాండ్లలో ఆదివారం ఉదయం ప్రయాణికుల రద్దీ కనిపించింది. రాత్రి 7 గంటల వరకు గ్రేటర్‌నుంచి రెగ్యులర్ సర్వీసులతోపాటు 600 ప్రత్యేకబస్సులు జిల్లాలకు నడిపినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. పండుగ కోసం టీఎస్ ఆర్టీసీ 4,484 ప్రత్యేక బస్సులు నడపాలని ముందుగా నిర్ణయించినా ఆర్టీసీ ప్రయాణికుల రద్దీ భారీగా పెరగడంతో రాష్ట్ర వ్యాప్తంగా 6,261 ప్రత్యేక బస్సులను ఏపీ, తెలంగాణ జిల్లాలకు నడిపింది. శనివారం ఒక్క రోజు గ్రేటర్ నుంచి 1,861 స్పెషల్ సర్వీసులు ఏపీ, తెలంగాణ జిల్లాలకు నడిపించారు. బస్సుల సంఖ్య తక్కువగా ఉండటంతో 1127 సిటీ బస్సులను తెలంగాణలోని పలు జిల్లాలకు నడిపించారు. మహాలక్ష్మి ఉచిత ప్రయాణంతో గ్రేటర్ నుంచి తెలంగాణ జిల్లాలకు ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రికార్డుస్థాయిలో మహిళలు ప్రయాణాలు సాగించినట్లు అధికారులు తెలిపారు. ప్రయాణికుల రద్దీ, బస్సుల ఆపరేషన్స్ నిర్వహణకు మొదటిసారి ఆర్టీసీ బస్‌భవన్‌లో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. సంక్రాంతికి ప్రశాంతంగా ప్రయాణికులను సొంతూళ్లకు చేర్చడంలో పాలుపంచుకున్న టీఎస్ ఆర్టీసీ సిబ్బంది, అధికారులకు టీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ ఎక్స్‌వేదికగా అభినందనలు తెలిపారు. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో 52.78 లక్షల మంది ప్రయాణాలు సాగించినట్లు అధికారులు వెల్లడించారు. పండుగకు జిల్లాలకు వెళ్లిన ప్రజలు తిరిగి నగరానికి చేరుకునేలా ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. తెలంగాణ జిల్లాల్లో బస్సుల సంఖ్య పెంచిన ఆర్టీసీ, ఏపీ జిల్లాలకు ప్రత్యేక సర్వీసుల సంఖ్య తగ్గించడంతో వేలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఏపీ బస్సుల్లో డైనమిక్ చార్జీల పేరుతో రిజర్వేషన్ బస్సుల్లో చార్జీలు పెంచారంటూ పలువురు ప్రయాణికులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పలు జిల్లాలకు వెళ్లే ప్రయాణికులతో ఆదివారం రద్దీగా మారింది. సికింద్రాబాద్ నుంచి ఏపీకి వైపు వెళ్లే ప్యాసింజర్ రైళ్లలో భారీరద్దీ ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇంటర్ సిటీ, తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లోని రిజర్వేషన్ బోగీల్లో సాధారణ ప్రయాణికులు ఎక్కడంతో ప్రయాణికుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో అన్ని ప్లాట్ ఫామ్స్‌లో ప్రయాణికుల రద్దీతో పండుగ ప్రయాణ సందడి కనిపించింది. ప్రయాణికులను అదుపు చేయడంలో ఆర్పీఎఫ్, జీఆర్పి పోలీసులు కాస్త ఇబ్బందులు పడ్డారు.



కోడిపందేలకు ఏపీకి!

» తరలివెళ్లి తెలంగాణ ప్రజలు.. కోట్లలో పందేలు

అశ్వారావుపేట/ బూర్గంపాడు/ఎర్రుపాలెం, జనవరి 14: "ఆడొద్దు మావ కోడిపందెమూ.. ఆడి ఓడొద్దు మావ కోడి పందెమూ".. అంటూ ఇంట్లోవారు బెట్టుచేసినా.. "ఆడొస్తె జానకే కోడిపందెమూ.. ఆడి గెలిచొస్తె జానకే కోడిపందెమూ".. అంటూ తెలంగాణ సరిహద్దు జిల్లాలకు చెందిన కొందరు కోడి పందేల కోసం ఆంధ్రప్రదేశ్‌కు క్యూ కట్టారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సరిహద్దు ప్రాంతాలైన ఏపీలోని ఉభయగోదావరి జిల్లాలు, ఎన్టీఆర్ జిల్లాల్లో ఏర్పాటు చేసిన కోడిపందేల బిర్రుల్లో(పందేలు నిర్వహించే ప్రాంతాలు) భోగి సందర్భంగా ఆదివారం ఒక్కరోజే రూ.కోట్లలో చేతులు మారాయి. కొన్ని బిర్రుల వద్ద నిర్వాహకులు మినీ ఏటీఎం కేంద్రాలను ఏర్పాటు చేయడం గమనార్హం..!

శివార్లలో ఏర్పాట్లు..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట సరిహద్దులోని ఏపీ గ్రామాలైన కామయ్యపాలెం, తాటాకులగూడెం, శ్రీనివాసపురం, పాలచెర్ల, జంగారెడ్డిగూడెం, దెందులూరు, తాడేపల్లిగూడెం, పేరంపేట, భీమవరం, కుక్కునూరు, వేలేరుపాడు, చింతలపూడి తదితర ప్రాంతాలతోపాటు ఏపీలో విలీనమైన వరరామచంద్రాపురం, చింతూరు, కూనవరం, ఎన్టీఆర్ జిల్లాలోని ఊటుకూరు, నెమలికొణిజర్ల, మైలవరం, మురుసుమిల్లి, గంగినేని, వీరులపాడు, పెనుగొలను, రుద్రారం, పొందుగుల, రెడ్డిగూడెం గ్రామాల్లో కోడిపందాల కోసం బిర్రులు ఏర్పాటయ్యాయి. తెలంగాణ పోలీసులు ఇక్కడ కోడిపందేలపై గట్టి నిఘా పెట్టడంతో.. ఉమ్మడి ఖమ్మంలోని జూదగాళ్లు ఏపీకి వెళ్తున్నారు. మరికొందరు పందెంకోళ్లను తీసుకెళ్తున్నారు. ఉమ్మడి ఖమ్మంతోపాటు.. మహబూబాబాద్, ములుగు జిల్లాల నుంచి కూడా ఏపీకి జూదగాళ్ల తాకిడి పెరిగింది. కొన్ని బిర్రుల్లో కోడిపందేలతో పాటు.. పేకాట, లోనబయట(అందర్-బాహర్), గుండాట లాంటి జూదాలు, మద్యం విక్రయాలు యథేచ్ఛగా సాగాయి. భోగిరోజు కోట్ల రూపాయల్లో జూదాలు నడిచాయని అంచనా. తెలంగాణ నుంచి బిర్రులు ఏర్పాటు చేసిన గ్రామాలకు దారి తీసే మార్గాల్లో ఆదివారం ట్రాఫిక్ జామ్ నెలకొంది. ముఖ్యంగా ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా కుక్కునూరు మండలం వేలేరులో నిర్వహించిన కోడిపందాలకు వెళ్లే జనంతో తెలంగాణ సరిహద్దుల్లో ఎక్కడి ట్రాఫిక్ అక్కడే నిలిచిపోయింది. బూర్గంపాడు కూడలి నుంచి వేలేరు వరకు వాహనాలు నిలిచిపోయాయి.



సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో..

నింగినంటిన కైట్స్..!

» రెండోరోజూ అలరించిన కైట్ ఫెస్టివల్

» వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన సందర్శకులు

హైదరాబాద్ సిటీ/అడ్డగుట్ట, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో జరుగుతున్న ఇంటర్నేషనల్ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు నింగిలో చక్కర్లు కొడుతున్న విభిన్న ఆకారాల పతంగులను ఆసక్తిగా తిలకించారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ టూరిజంశాఖ ఆధ్వర్యంలో ఈనెల 13 నుంచి 15 వరకు కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం రెండో రోజు స్విట్జర్లాండ్, కెనడా, స్వీడన్, శ్రీలంక, స్కాట్లాండ్, థాయిలాండ్, మలేషియా దేశాలకు చెందిన కైట్ ఫ్లయర్స్ భారీ పతంగులను ఎగురవేశారు. ప్రధానంగా గరుడదేవా, మిక్కీమౌస్ కైట్స్ సందర్శకులను ఎంతో ఆకట్టుకున్నాయి. వీటితోపాటు 200 మీటర్ల వరుసతో కూడిన చిన్న పతంగులు, రిమోట్ సెన్సార్ కైట్స్‌ను చూసి పిల్లలు కేరింతలు కొట్టారు. కొంతమంది విదేశీయుల వద్దకు వెళ్లి సెల్ఫీలు తీసుకుని సంబురపడ్డారు. కాగా, పతంగులను వీక్షించిన వారు అక్కడే ఏర్పాటు చేసిన స్వీట్ స్టాళ్ల వద్దకు వెళ్లి ఇష్టమైన వాటిని రుచి చూశారు. అయితే సాధారణ ధరలతో పోల్చితే స్వీట్ ఫెస్టివల్‌లో రేట్లు కొద్దిగా ఎక్కువగా ఉండడంతో కొనుగోళ్లకు చాలామంది వెనకంజ వేశారు. ఇదిలా ఉండగా, ఆదివారం దాదాపు 4 లక్షల మందికి పైగా సందర్శకులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. సోమవారం సాయంత్రం ఫెస్టివల్ ముగియనున్నట్లు చెప్పారు. మైదానంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



సత్తెనపల్లిలో భోగి వేడుకల్లో నృత్యం చేస్తున్న ఏపీ మంత్రి అంబటి

మళ్లీ చిందేసిన సంబరాల రాంబాబు..!

సత్తెనపల్లి, జనవరి 14: సంక్రాంతి పండుగ వచ్చిందంటే చాలు మంత్రి అంబటి రాంబాబు... సంబరాల రాంబాబుగా మారిపోతారు. మంత్రి హోదాను సైతం పక్కనబెట్టి రోడ్డుపై డ్యాన్స్‌లు చేస్తూ కనిపిస్తారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్‌లో మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి భోగి మంటల చుట్టూ తిరుగుతూ నృత్యం చేశారు. "అంబటి రాంబాబు... సంబరాల రాంబాబు... అంబటి రాంబాబు..." అనే ప్రత్యేక పాటకు స్టెప్పులు వేశారు. గతేడాది కూడా అంబటి ఇలాగే సంక్రాంతి సంబరాలలో చేసిన డాన్స్ వైరల్‌గా మారిన సంగతి తెలిసిందే



ఏలూరు జిల్లా రాజవరంలో 225రకాలతో అల్లుడికి తినుబండారాలు

గోదారోళ్ల అల్లుడంటే ఆ మాత్రం ఉండాలి..!

» రాజవరంలో కొత్తల్లుడికి 225 రకాల వంటకాలు

» రాజానగరంలో అల్లుడికి 156 రకాలతో విందు

కొయ్యలగూడెం, రాజానగరం, జనవరి 14: కొత్త అల్లుళ్లకి మర్యాదలు చేయడంలో గోదారోళ్లు చాలా స్పెషల్..! ఎప్పట్లాగే ఈ ఏడాది కూడా కొత్త అల్లుళ్లకు వందలాది రకాల వంటకాలతో మర్యాదలు చేశారు. ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం రాజవరంలో కాకి నాగేశ్వరరావు కుమార్తె జ్యోత్స్నకు గతేడాది మార్చి 16న విజయవాడకు చెందిన లోకేశ్‌సాయితో వివాహమైంది. పండుగకు కొత్త అల్లుడు రావడంతో అత్తమామలు 225 రకాల వంటకాలు సిద్ధం చేశారు. గోదావరి జిల్లాల్లో సంక్రాంతి సంప్రదాయ వంటకాలన్నింటినీ తినిపించారు. అలాగే.. తూర్పు గోదావరి జిల్లా రాజానగరానికి చెందిన ఓ కుటుంబం కొత్తల్లుడికి ఏకంగా 156 రకాల వంటకాలు వడ్డించారు. గ్రామానికి చెందిన కిరాణా వ్యాపారి చవ్వా నాగ వెంకట శివాజీ, సునీతరాణి దంపతుల పెద్ద కుమార్తె హర్షిత వివాహం గతేడాది నవంబరు 29న నర్సాపురానికి చెందిన అప్పన రిషీంద్రతో జరిగింది. కొత్త జంటకు ఇదే తొలి పండగ కావడంతో రాజానగరంలోని అత్తమామలు భోగి రోజున అల్లుడికి భారీ విందు ఏర్పాటు చేశారు.

సంక్రాంతికి పల్లెటూరు

(మొదటిపేజీ తరువాయి)

ముందు పెద్ద ఎత్తున భోగిమంటలు వేసి పిన్నాపెద్దా అందరూ కలిసి అక్కడ గుమిగూడి సరదాగా ముచ్చట్లు చెప్పుకోవడం కనిపించింది. అలాగే రాత్రుళ్లు మహిళలంతా కలిసి కబుర్లు చెప్పుకొంటూ.. వీధి గుమ్మాల్లో అందమైన రంగవల్లులను ఆవిష్కరిస్తున్నారు. ఆనవాయితీ ఉన్నవారు బొమ్మల కొలువులు తీర్చిదిద్దుతున్నారు. పిల్లలేమో అపార్ట్‌మెంట్లు, ఇళ్ల మేడలపైకెక్కి పతంగులు ఎగరేస్తూ రచ్చరచ్చ చేస్తున్నారు. మొత్తమ్మీద.. పండుగ ఉత్సాహం ఎల్లెడలా తొణికిసలాడుతోంది. సామాన్యుల సందడి ఇలా ఉంటే.. సెలబ్రిటీలు, వ్యాపారవేత్తలు, డబ్బున్నవారు ఇప్పటికే నగరశివార్లలోని తమ ఫామ్‌హౌజ్‌లకు చేరుకుని పల్లె వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు. కుటుంబసభ్యులతోపాటు.. బంధువులను, తమకు కావాల్సినవారిని అక్కడికి పిలిపించుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేసి మరీ సంబురాలు చేస్తున్నారు. ఉదాహరణకు.. నగర శివార్లలోని తన ఫామ్‌హౌజ్‌లో స్నేహితులు, కుటుంబసభ్యులతో కలిసి గత కొన్నేళ్లుగా సంక్రాంతి వేడుకలు జరుపుకొంటున్న టాలీవుడ్ ప్రముఖుడు ఒకరు ఈసారి ఇంకాస్త భారీగా ఏర్పాట్లు చేశారు. అక్కడ అసలు సిసలు పల్లె వాతావరణాన్ని రీ-క్రియేట్ చేసి అక్కడికి వస్తున్న తన స్నేహితులు, బంధువులకు కొత్త అనుభూతి పంచుతున్నారు. చాలామంది వ్యాపారవేత్తలు కూడా ఇదే తరహాలో ఘనంగా పండగ చేసుకుంటున్నారు. అలాగే.. కరోనా వల్ల గత మూడేళ్లుగా ఒకచోట కలవని ఉమ్మడి కుటుంబాలు కూడా ఈసారి ఒకమాట ముందే అనుకుని కుటుంబాల రీ-యూనియన్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. తెలుగురాష్ట్రాల్లోని నగరాలు, పట్నాల నుంచే కాదు.. ఆస్ట్రేలియా, అమెరికా తదితర దేశాల్లో స్థిరపడ్డ తెలుగువారిలో చాలా మంది ఈసారి పండగకి ఇక్కడికి.. ఇంటికి.. రావడం అసలు విశేషం. ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి కృష్ణా, ఉభయగోదావరి జిల్లాల్లోని కలిగిన కుటుంబాలు.. తమ ఇంటి ప్రాంగణంలోనే కోడి పందేలు, పేకాట వంటివి ఏర్పాటు చేయడం గమనార్హం.

అపార్ట్‌మెంట్లలోనే ఆటాపాటా..

తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచీ ఉపాధి కోసం పొట్ట చేతపట్టుకుని హైదరాబాద్‌కు వచ్చిన లక్షలాది మంది.. సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లడంతో రాజధాని వీధులన్నీ ఎప్పట్లాగే శనివారం నుంచే బోసిపోయి కనిపించాయి. భోగిమంటల సందడి మాత్రం అపార్ట్‌మెంట్ల వద్ద ఎక్కువగా కనిపించింది. కొన్ని అపార్ట్‌మెంట్లలో అయితే ఈసారి ఊళ్లకు వెళ్లినవారు మినహా మిగతావారంతా సోమవారంనాడు కలిసి భోజనాలు చేయడానికి ప్రణాళికలు వేసుకున్నారు. "కొన్ని కారణాల వల్ల ఈసారి సొంతూరికి వెళ్లలేదు. అయినా ఆ లోటు తెలియకుండా మా అపార్ట్‌మెంట్‌వాసులందరం కలిసి ఇక్కడే పండుగ చేసుకుంటున్నాం. కోడిపందేలు లేవుగానీ.. చతుర్ముఖపారాయణానికి (పేకాట) ఏర్పాట్లు చేసుకున్నాం" అని తణుకుకు చెందిన నాగేశ్వరరావు నవ్వుతూ చెప్పారు. అలాగే.. కొన్ని ఈవెంట్ కంపెనీలు నగరశివార్లలోని ఫామ్‌హౌజ్‌లలో టికెటింగ్ ఈవెంట్‌గా సంక్రాంతి సంబరాలను నిర్వహిస్తున్నాయి.



శిల్పారామంలో గంగిరెద్దు, హరిదాసుల సందడి



ఇక మిగిలింది 87 రోజులే!

జగన్ సర్కారుకు కౌంట్ డౌన్: చంద్రబాబు

గుంటూరు, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైందని.. ఇక మిగిలింది 87 రోజులేనని.. లెక్కపెట్టుకోవాలని.. ఏపీ మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు హెచ్చరించారు. వచ్చే ఏడాది జనసేన-టీడీపీ ప్రభుత్వంలో అద్భుతమైన సంక్రాంతి వేడుకలు నిర్వహించుకుంటామని.. బంగారంలాంటి రాజధానిని నిర్మించుకుంటామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ చెప్పారు. ఏపీ రాజధాని అమరావతిలోని మందడంలో ఆదివారం 'పల్లె పిలుస్తోంది రా.. కదలిరా!' కార్యక్రమంలో టీడీపీ-జనసేన 'భోగి సంకల్పం' తీసుకున్నాయి. ఈ సందర్భంగా మాట్లాడిన చంద్రబాబు... "మన రాజధాని అమరావతే. ఇది నేనూ, పవన్ కల్యాణ్ కలిసి చెబుతున్న మాట. రాజధాని నిర్మాణంతోపాటు విశాఖను ఆర్థిక రాజధానిగా చేస్తాం. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేసి పూర్వ వైభవం తీసుకొస్తాం. రాతి యుగం పోవాలి.. స్వర్ణయుగం రావాలి.' అని తన సంకల్పం ప్రకటించారు. "టీడీపీ, జనసేన కలిసి సుస్థిర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలి. బంగారం లాంటి భవిష్యత్ ఇవ్వాలని భోగి రోజున కోరుకుంటున్నా' మని పవన్ తెలిపారు.

చైనా మాంజా.. గొంతు తెగ్గోసింది

లంగర్‌హౌస్‌లో ఆర్మీ జవాను దుర్మరణం.. ఫ్లైఓవర్‌పై నుంచి బైక్ వస్తుండగా మెడకు మాంజా

కార్వాన్, పేట్‌బషీరాబాద్, విశాఖపట్నం, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): పతంగులు ఎగురవేయాలని, పేంచీలతో వేరే పతంగులను తెగ్గొట్టి ఈలవేసి గోల చేయాలనే ఉత్సాహం వెనుకా ముందు చూసుకోలేనంత అత్యుత్సాహంగా మారిపోయి వారి ప్రాణాలను... కొన్నిసార్లు ఇతరుల ప్రాణాలనూ తీస్తోంది. కంటికి కనిపించని 'పదునైన కత్తి' లాంటి చైనా మాంజాకు ఓ యువకుడి ప్రాణం బలైపోయింది. ఎక్కడి నుంచి వచ్చి రెయిలింగ్‌కు బిగుసుకుందో గానీ ఆ మాయదారి మాంజా, బైక్ మీద వెళుతున్న ఆర్మీ జవాను మెడకు తగిలి.. గొంతును లోతుకంటా కోసేసింది. తీవ్ర గాయమై.. రక్తం ధారగా పోవడంతో ఆ సైనికుడు మృత్యువాతపడ్డాడు. శనివారం అత్తాపూర్‌లో ఓ పదకొండేళ్ల బాలుడు భవనంపై పతంగి ఎగురవేస్తూ ఏసీ బాక్సుకు తగిలి విద్యుదాఘతంతో మృతిచెందడం తెలిసిందే. ఆ రోజు.. ఆదివారం మరో ముగ్గురు పతంగుల ఎగురవేస్తూ జరిగిన ప్రమాదాల్లో మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. ఏపీలోని విశాఖపట్నం పెద్దవాల్తేరుకు చెందిన కాగితాల కోటేశ్వర్‌రెడ్డి (30) భారత ఆర్మీలో నాయక్‌గా పనిచేస్తున్నారు. ఢిల్లీ నుంచి నెల క్రితమే హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. రెండేళ్ల క్రితం విశాఖకే చెందిన ప్రత్యూషతో పెళ్లయింది. వీరికి ఏడాదిన్నర వయసున్న కుమార్తె భువిక ఉంది. భార్య, కుమార్తెతో కలిసి కోటేశ్వర్, లంగర్‌హౌజ్‌లో ఉంటున్నారు. శనివారం రాత్రి 7:30 గంటలకు లంగర్‌హౌజ్ ఫ్లైఓవర్ మీదుగా ద్విచక్ర వాహనంపై వెళుతుండగా చైనా మాంజా ఆయన మెడకు తగిలింది. కోటేశ్వర్ హెల్మెట్ ధరించినా.. సరిగ్గా గొంతు వద్దే మాంజా తగలడంతో ఆ వేగానికి అక్కడ లోతుగా కోసుకుపోయింది. గాయం నుంచి ధారగా కారిన రక్తంతో ఆయన శరీరం, బైక్ తడిసిపోయాయి. ఆయన్ను వెంటనే ఆస్పత్రికి తరలించినా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. శనివారం నాగోలులో 8వ తరగతి విద్యార్థిని శివ ప్రసన్న అనే బాలిక నాలుగో అంతస్తు నుంచి కింద పడి మృతిచెందింది. అల్వాల్‌లో పతంగుల సంబురం ఓ ఇంట్లో తీవ్ర విషాదం నింపింది. పేట్‌బషీరాబాద్ పోలీసుల వివరాల ప్రకారం.. కొంపల్లి నార్త్ ఎన్‌సీఎల్ క్యాస్కేడ్ గ్రీన్స్ అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్న ఏఎస్‌ఐ రాజశేఖర్ ఆల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె. రెండో కుమారుడు ఆకాశ్ (20) డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం అపార్టుమెంట్ ఐదో అంతస్తుపై పతంగి ఎగరవేస్తుండగా అది రెండు అపార్టుమెంట్‌ల మధ్య పడింది. పిట్టగోడ నుంచి కిందకు వంగుతూ ఆ పతంగిని తీసే ప్రయత్నంలో ఆకాశ్ పట్టుతప్పి కింద పడిపోయాడు. తీవ్ర గాయాలైన అతడిని వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. నాగర్‌కర్నూల్‌లో జోహల్ (12) అనే బాలుడు విద్యుత్తు తీగలకు తగిలిన పతంగిని తీసేయత్నంలో విద్యుదాఘాతంతో మృతిచెందాడు.



జవాన్ కోటేశ్వర్‌రెడ్డి; ఆకాశ్ (ఫైల్)

పందెం నీదా నాదా?

» కోస్తాంధ్ర జిల్లాల్లో కోడి పందేలు, గుండాటల జోరు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)



విజయవాడలోని ఊర్పుగల్లులో భారీ బరి

సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా ఏపీలోని పలు జిల్లాల్లో కోడి పందేల పోలీసుల సాక్షిగా జోరుగా హుషారుగా సాగుతున్నాయి. పందెం రాయుళ్లు జాతరలా తరలివస్తూనే ఉన్నారు. మెజారిటీ బరులు వైసీపీ నేతల అండతో ఏర్పాటు కావడంతో ఎలాంటి ఆంక్షలూ ఆటంకాల్లేకుండా పందేలు జరుగుతున్నాయి. ఎక్కడికక్కడ బరులు ఏర్పాటు చేసి కోట్లలో పందేలు కాస్తున్నారు. కొన్ని బరులు 50, 100 ఎకరాలకు పైబడిన విస్తీర్ణంలో.. భారీ టెంట్లతో.. ఫ్లడ్ లైట్ల వెలుగుల్లో జరుగుతున్నాయి. పందేలకు వచ్చే జనంతో బరుల వద్ద కార్లు, బైక్లు వందలాదిగా కనిపిస్తున్నాయి. పందెం డబ్బులు లెక్కబెట్టడానికి సమయం కూడా లేక.. ఏకంగా నోట్ల కౌంటింగ్ మిషన్లు పెట్టారు. సంక్రాంతి తొలిరోజు భోగినాడు అన్ని బరుల వద్ద కోడి పందేలతోపాటు గుండాట, పేకాటలు జోరుగా సాగి లక్షలు చేతులు మారాయి. ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి బెల్టులకు.. అక్కడి నుంచి బరుల వద్ద మద్యం ఏరులై పారింది. ముఖ్యంగా ఉమ్మడి గోదారి, ఉమ్మడి కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో దాదాపు అన్ని బరుల వద్ద జరిగిన పందేలకు తెలంగాణ జిల్లాల నుంచి భారీ సంఖ్యలో ఔత్సాహికులు వచ్చి లక్షల్లో పందేలు కాసి ఎంజాయ్ చేశారు. కొన్ని బరుల వద్ద ప్రవేశ రుసుముగా వెయ్యి పైనే టికెట్ పెట్టి లోనికి అనుమతిస్తున్నారు. పండగ మూడు రోజులూ పందేలు, గుండాటలు ఉంటాయి కనుక.. రేయింబవళ్లూ నిరాటంకంగా నిర్వహించేందుకు దాదాపు అన్ని చోట్లా ఫ్లడ్ లైట్లు, విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు. ఓవైపు సంక్రాంతి ఉత్సవాల్లో కోడి పందేలు, ఇతర జూదాల నిర్వహణను అడ్డుకోవాలని హైకోర్టు ఆదేశించినా అధికార పార్టీ నేతల ఒత్తిడితో పోలీసులు పూర్తిగా చేతులెత్తేశారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లావ్యాప్తంగా వందకు పైగానే కీలక బరులు ఏర్పాటయ్యాయి. బరుల వద్ద సీఎం జగన్‌తో పాటు ఆయా ప్రాంతానికి చెందిన ప్రజాప్రతినిధుల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలను భారీగా ఏర్పాటు చేశారు.

గోదావరి, కృష్ణా జిల్లాల్లో కోట్లే కోట్లు

కాకినాడ, ఉమ్మడి కృష్ణా జిల్లాల్లో తొలిరోజు వందేసి కోట్లు పైబడి చేతులు మారినట్లు అంచనా. కాకినాడ రూరల్ మండలంలోని సర్పవరం వద్ద భారీ బరి ఏర్పాటు చేయగా, కోడి పందేలపై లక్షల్లో బెట్టింగ్‌లు కాశారు. గుండాట, పేకాట శిబిరాలు సరేసరి. అక్కడే బెల్ట్‌షాపులు ఏర్పాటు చేసి మద్యం విక్రయించారు. తొలిరోజే ఇక్కడ ఒకచోటే రూ.15కోట్లు చేతులు మారినట్లు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం రూ.100కోట్లు మేర చేతులు మారినట్లు చెబుతున్నారు. కోడి పదేలకు పెద్ద బరులకు రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రేటు నిర్ణయించారు. చిన్నబరులకు రూ.10 వేల నుంచి రూ.50 వేల ధరలు పెట్టారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక వ్యక్తికి మూడు మద్యం సీసాలకు మించి విక్రయించకూడదు. అటువంటిది ప్రతి బరి వద్ద మద్యం స్టాకు భారీగా కనిపించింది. తిరువూరు, జగ్గయ్యపేటలో జాతీయ రహదారులకు పక్కనే పందాల శిబిరాలను ఏర్పాటు చేశారు. తెలంగాణ ప్రాంతం నుంచి పందెం రాయుళ్ల అధిక సంఖ్యలో హాజరయ్యారు.

పందెం చూడాలంటే.. రూ.1000

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం పిడింగొయ్యి గ్రామంలో ప్రధాన రోడ్డు పక్క భారీ బరి ఏర్పాటు చేశారు. ఇక్కడ ఓ గేటు పెట్టి రూ.1000 టికెట్ కొనుకున్నవారినే లోపలికి అనుమతిస్తున్నారు. కుర్చీలు కూడా ఏర్పాటు చేయడంతో ఇదో మినీ స్టేడియంలా తలపిస్తోంది. వీరికి ప్రత్యేక ఫుడ్ కోర్టు కూడా ఏర్పాటు చేశారు. దీనికి సమీపంలో సాధారణ బరి ఒకటి ఏర్పాటు చేశారు. మరో పక్కన రెండు గుండాట శిబిరాలు, పేకాట శిబిరం ఏర్పాటు చేశారు. ఈ బరికి కొద్దిదూరంలో కవలగొయ్యకు చెందిన మరో బరి ఏర్పాటు చేశారు. అక్కడ టికెట్ రూ.500 మాత్రమే. ఇలా జిల్లాలో వందలాది బరులు ఏర్పాటు చేశారు. వైసీపీ నేతలతో పాటు కొన్ని చోట్ల ఇతర పార్టీల నేతలు కూడా వీటి వెనుక ఉండడం గమనార్హం.





నుజ్జునుజ్జు అయిన ఆటో; మృతులు శ్రీను, పాపా, రుత్విక్, రుత్విక (ఫైల్)

కుటుంబాన్ని కబళించిన ప్రమాదం

» ఆటో-కారు ఢీ.. నలుగురి మృతి

» మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

మహబూబాబాద్, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): మొక్కులు తీర్చుకొని ఆలయం నుంచి తిరుగు ప్రయాణమైన ఆ కుటుంబం ఇల్లు చేరలేదు. వారు ప్రయాణిస్తున్న ఆటో ఘోర ప్రమాదం బారినపడింది. ఎదురుగా అతివేగంగా వస్తున్న కారు ఢీకొనడంతో ఆటోలోని ప్రయాణిస్తున్న ఆరుగురిలో నలుగురు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం ఆముతండాకు చెందిన ఇస్లావత్ శ్రీను (35)కు రుత్విక్ (6), రుత్విక (4) పిల్లలు. ఆయన భార్య గతంలోనే కొవిడ్‌తో మృతి చెందింది. శ్రీను ఆటో తోలుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శ్రీను, ఆయన తల్లి పాపా (60), ఇద్దరు పిల్లలు, అత్త శాంతి, బావమరిది సర్దార్‌తో కలిసి మొక్కులు చెల్లించుందుకు నల్లగొండ జిల్లాలోని బుడియాబాపు ఆలయానికి వెళ్లారు. శ్రీనునే ఆటో నడిపాడు. మొక్కులు తీర్చుకొని, రాత్రి అక్కడే బస చేసి ఆదివారం తిరుగు ప్రయాణమయ్యారు. వీరు ప్రయాణిస్తున్న ఆటో మహబూబాబాద్ జిల్లా జమాండ్లపల్లి శివారులోకి రాగానే ప్రమాదానికి గురైంది. ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో ఆటోలోని వారు ఎగిరిపడ్డారు. ప్రమాదంలో ఆటో నడుపుతున్న శ్రీను, ఆయన తల్లి పాపా, శ్రీను కుమారుడు రుత్విక్, కుమార్తె రుత్విక మృతిచెందారు. శ్రీను అత్త శాంతి, బావమరిది సర్దార్ గాయపడ్డారు. ఇద్దరినీ ఆస్పత్రికి తరలించారు. కారులో ఉన్న నలుగురు గాయపడ్డారు.

సర్కారును కూల్చేందుకు కేసీఆర్ కుట్ర

- ఎంపీ ఎన్నికల తర్వాత ఎప్పుడైనా ముప్పు
- కాంగ్రెస్‌లో కేసీఆర్ కోవర్టులు ఉన్నారు: సంజయ్
- ఓటమిని కాంగ్రెస్ అన్యాయంగా భావిస్తోంది
- 24 వేల కోట్లతో ఆదివాసీల సంక్షేమం: కిషన్‌రెడ్డి



కరీంనగర్, జనవరి 14(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు మాజీ సీఎం కేసీఆర్ కుట్రలు పన్నుతున్నారని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎంపీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడైనా కూలే ప్రమాదముందన్నారు. సర్కారును పడగొట్టి.. ఆ నెపం బీజేపీపై నెట్టినా ఆశ్చర్యం లేదన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని ఎంపీ కార్యాలయంలో సంజయ్ విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్‌లో కేసీఆర్ కోవర్టులు ఉన్నారని, ఎన్నికల్లో వాళ్లకు భారీగా డబ్బులు అందాయని చెప్పారు. బీఆర్ఎస్ జాతీయ పార్టీ అయితే ఇతర రాష్ట్రాల్లో ఎందుకు పోటీ చేయడం లేదని ప్రశ్నించారు. తెలంగాణలోనే ఆ పార్టీకి అభ్యర్థులు లేరని ఎద్దేవా చేశారు. ప్రజలు కేసీఆర్‌ను మరచిపోయారని అన్నారు. కేంద్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని, రాష్ట్రంలో బీజేపీ ఎంపీలను గెలిపిస్తే అధిక నిధులు తీసుకువస్తామని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేరాలంటే కేంద్రంలో బీజేపీ ఎంపీలు గెలవాలని చెప్పారు. తెలంగాణ అప్పులెలా తీరుస్తారని కాంగ్రెస్‌ను ప్రశ్నించారు. రాహుల్ ప్రాపకం కోసం బీజేపీపై విమర్శలు చేస్తే అది రాష్ట్రానికే నష్టమని గమనించాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ నేతలు కలిసి పని చేస్తే తెలంగాణకు అత్యధిక నిధులు తీసుకువచ్చే అవకాశం ఉందన్నారు. బీఆర్ఎస్ మాదిరిగా కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రాన్ని తిట్టడం మానేయాలని.. కేంద్రాన్ని ఒప్పించి అధిక నిధులు తీసుకురావడానికి కృషి చేద్దామని అన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ఒక్కటే..

భీమదేవరపల్లి, జనవరి 14 : లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటేస్తే మూసీ నదిలో వేసినట్లేనని బండి సంజయ్ అన్నారు. ఆదివారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామికి ఆయన గుమ్మడి కాయ మొక్కులు చెల్లించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కేటీఆర్‌ను విమర్శిస్తే పొన్నం ప్రభాకర్‌కు కోపం వస్తోందని.. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకటేనని స్పష్టమవుతోందనిన్నారు.

ఈ ఏడాది గిరిజన వర్సిటీ ప్రారంభం: కిషన్‌రెడ్డి

ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ను ఓడించడాన్ని ఆ పార్టీ అన్యాయంగా భావిస్తోందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో, జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని గిరిజన విశ్వవిద్యాలయానికి త్వరలోనే ప్రత్యేక అధికారిని నియమించనున్నట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచే వర్సిటీని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆబిడ్స్‌లో గిరిజన మ్యూజియానికి వచ్చేవారం భూమి పూజ నిర్వహిస్తామని వెల్లడించారు. ఆదివాసీల సంక్షేమం కోసం ప్రధాని మోదీ సోమవారం ప్రత్యేక కార్యక్రమాన్ని వర్చువల్‌గా ప్రారంభిస్తున్నారని తెలిపారు. రూ.24 వేల కోట్లతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారని చెప్పారు. దేశవ్యాప్తంగా వంద జిల్లాల్లో లక్ష ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులకు హక్కుపత్రాలు ఇస్తారని చెప్పారు. తాను వికారాబాద్ జిల్లాలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటానని కిషన్‌రెడ్డి తెలిపారు.

సంజయ్ జ్యోతిషం చెబుతున్నారా?

- ప్రభుత్వాన్ని కూల్చుతాం అంటే ఊరుకోబోం
- బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని స్పష్టమవుతోంది: మంత్రి పొన్నం



కరీంనగర్అర్బన్/వేములవాడ/హైదరాబాద్, జనవరి 14: కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే దమ్ము ఎవరికీ లేదని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అమ్ముడుపోవడానికి ఎవరూ సిద్ధంగా లేరని, పార్టీలో కోవర్టులు లేరని స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని కూల్చుతామంటే ఊరుకోబోమని నోరు, ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని ఎంపీ బండి సంజయ్‌పై ఫైర్ అయ్యారు. ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ, కరీంనగర్‌లో పొన్నం మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ కూల్చనుందని బీజేపీ నాయకుడు బండి సంజయ్ చెబుతున్నారంటే.. ఎవరెవరు కలిసి ఉన్నారో తేటతెల్లమవుతోందన్నారు. బీఆర్ఎస్, బీజేపీ మధ్య అవగాహన ఉందని తేలిపోయిందన్నారు. ఇంటర్ ఫెయిలైన బండి సంజయ్ ఏమన్నా జ్యోతిష శాస్త్రం చదివారా..? లేకుంటే బీఆర్ఎస్ వాళ్లు ఏమైనా సంజయ్‌కి చెప్పారా..? అని ప్రశ్నించారు. కేంద్రంలో అధికారంలోకి రావడం కోసం అయోధ్యలో రామాలయ ప్రారంభోత్సవాన్ని అనుకూలంగా వాడుకుంటూ శ్రీరాముని అక్షింతల పేరిట కొందరు ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. వేములవాడ ఆలయ అభివృద్ధిపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి సీఎంతో చర్చించామని ఈ నెల 30లోగా వీటీడీఏ సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. కాగా, బండి సంజయ్ వ్యాఖ్యలు చూస్తుంటే బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య సంబంధాలు బలంగా ఉన్నట్లు అర్థమవుతోందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి వ్యాఖ్యానించారు. ప్రభుత్వంపై కుట్రలు చేసే పార్టీలను ప్రజలు నామరూపాలు లేకుండా చేస్తారని టీపీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ అన్నారు.

ఈసారీ కాంగ్రెస్, బీజేపీ కలుస్తాయి

- బీఆర్ఎస్‌ను ఓడించేందుకు ఆ రెండు పార్టీల కుట్ర
- బండి సంజయ్ వ్యాఖ్యలే నిదర్శనం: కేటీఆర్



హైదరాబాద్, జనవరి 14 (ఆంధ్రజ్యోతి)/పెద్దకొత్తపలి: లోక్‌సభ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌ను ఓడించేందుకు కాంగ్రెస్, బీజేపీలు కలిసి పనిచేస్తాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభిప్రాయపడ్డారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌ను కూల్చే విధంగా కేసీఆర్ వ్యూహం పన్నుతున్నారు.. బీజేపీ.. బీఆర్ఎస్ బీ టీం అంటూ అధికార కాంగ్రెస్ మమ్మల్ని అనడం కాదు.. బీఆర్ఎస్‌పై దృష్టి పెట్టాలి అని బీజేపీ జాతీయ కార్యదర్శి బండి సంజయ్ వ్యాఖ్యానించారు. దీనిపై ఎక్స్ వేదికగా స్పందించిన కేటీఆర్.. మీడియాతో బండి సంజయ్ మాట్లాడిన వీడియోను షేర్ చేస్తూ.. 2019లో కరీంనగర్, నిజామాబాద్ పార్లమెంటు స్థానాల్లో బీజేపీ గెలుపునకు కాంగ్రెస్ సాధనంగా మారిందని పేర్కొన్నారు. అదే తరహాలో ఇప్పుడూ ఆ రెండు పార్టీలు కలిసి పనిచేసి.. మరోసారి బీఆర్ఎస్‌ను ఓడించాలనే విధంగా బండి సంజయ్ వ్యాఖ్యలు ఉన్నాయని కేటీఆర్ వెల్లడించారు. మరోవైపు.. రాష్ట్రంలో పదేండ్లు అధికారంలో ఉన్న తాము ఎన్నడూ హింసాత్మక సంఘటనలు, హత్యలను ప్రోత్సహించలేదని కేటీఆర్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం గంట్రావుపల్లి గ్రామంలో గత ఏడాది డిసెంబరు 29న హత్యకు గురైన బీఆర్ఎస్ కార్యకర్త, రిటైర్డ్ ఆర్మీ జవాన్ చిక్కపల్లి మల్లేష్ కుటుంబాన్ని ఆదివారం కేటీఆర్ పరామర్శించారు. పార్టీ తరఫున ఐదు లక్షల రూపాయల చెక్కును అందించారు.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: **K. Srinivas**. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna,** Founder: K.L.N.Prasad.*